17 . 10. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

శుక్రవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 139 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్నా పోటీకి అర్హులే

### - మంత్రి పొంగులేటి

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:**



స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నా పోటీ చేయొచ్చని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గత ప్రభుత్వంలో ఇద్దరు పిల్లల నిబంధన ఉండేదని, అంతకంటే ఎక్కువ మంది ఉంటే పోటీ చేసే అర్హత ఉండేది కాదన్నారు. ఇప్పుడు ఆ చట్టాన్ని మార్చాలని క్యాబినెట్ నిర్ణయించిందని పేర్కొన్నారు. దీంతో వార్డు మెంబర్, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే వారికి ఊరట లభించనుంది.



## బిసి రిజర్వేషన్లపై
# వెనక్కి తగ్గేది లేదు

న్యాయనిపుణులతో చర్చించి ముందుకు

స్థానిక ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేత

- కొత్తగా మూడు వ్యవసాయ కళాశాలు మంజూరు
- మెట్రో రెండో దశపై సిఎస్ ఆధ్వర్యంలో కేబినేట్ సబ్‌కమిటీ
- డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలు
- తెలంగాణ కేబినేట్ భేటీలో కీలక నిర్ణయలు...హాజరు కాని కొండా సురేఖ

*బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపుపై సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ డిస్మిస్ కావడంతో తదుపరి కార్యాచరణపై కేబినెట్‌లో చర్చించారు. ఈ కేసును వాదించిన సీనియర్ న్యాయ వాదులు, న్యాయ నిపుణుల సలహాలు సూచనల మేరకు తదుపరి కార్యాచరణ చేపట్టాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రెండు రోజుల్లో న్యాయ నిపుణుల అభిప్రాయాలతో నివేదిక ఇవ్వాలని అధికారులకు సీఎం రేవత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని, ముందుకు వెళ్లాలని కేబినేట్‌లో నిర్ణయించారు. ఇకపోతే స్థానిక ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉంటే పోటీచేయకుండా తీసుకున్న నిర్ణయాన్ని ఎత్తివేస్తూ కేబినేట్ ఆమోదించింది. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన కేబినేట్‌లోకీలక నిర్ణయాలు తీసుకున్నారు. వివరాలను సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాకు వివరించారు. దీనికి సిఎస్ అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ వేశారు. అయితే, కేబినెట్ భేటీకి మంత్రి కొండా సురేఖ హాజరు కాలేదు. తన ఇంటికి పోలీసులు రావడంపై ఆగ్రహంగా ఉన్నారు మంత్రి కొండా సురేఖ. ఈ నేపథ్యంలోనే కేబినెట్ భేటీకి రాకూడదని మంత్రి సురేఖ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.*

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:**
ఈ వానాకాలంలో 1.48 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంది. దేశంలోనే ఇది రికార్డు స్థాయి ఉత్పత్తి. ఇందులో రాష్ట్రంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని పౌరసరఫరాల విభాగం అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు అంగీకరించింది.. మరో 15 లక్షల మెట్రిక్ టన్నులుసేకరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని మంత్రి వర్గం నిర్ణయించింది. వానకాలం సీజన్లో పండించిన ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ, పౌర సరఫరాల శాఖ, రవాణా శాఖ సమన్వయంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. ధాన్యానికి చెల్లించే మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు ఇచ్చే రూ.500 బోనస్ రైతుల ఖాతాల్లో వెంట వెంటనే జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. కలెక్టర్లు, అదనపుకలెక్టర్లు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని.. ప్రతి కొనుగోలు కేంద్రం పర్యవేక్షణ, సమన్వయానికి ఒక్కో అధికారికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలో కొత్తగా మూడు (3) అగ్రికల్చర్ కాలేజీల ఏర్పాటు కు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. హుజూర్ నగర్, కొడంగల్, నిజామాబాద్ లో అగ్రికల్చర్ కాలేజీల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తయిన సందర్భంగా ప్రజా పాలన –ప్రజా విజయోత్సవాలను నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తుంది. ఉత్సవాల నిర్వహణ.. సంబంధిత ఏర్పాట్లపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం. ఇద్దరు పిల్లలకు మించి సంతానమున్న వారు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులనే నిబంధనను మంత్రివర్గం



## పర్యాటకంలో సుస్థిర అభివృద్ధే లక్ష్యం

### - మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:**
పర్యాటకాన్ని సంస్కృతి, సాంప్రదాయల్లో భాగంగా చేస్తామని, తద్వారా సుస్థిర పర్యాటక అభివృద్ధి జరుగుతుందని, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో కామర్స్ డిపార్ట్మెంట్ ఆద్వర్యంలో గ్లోబల్ టూరిజం:

## ట్రంప్‌కు లొంగిపోయిన మోడీ

- పదేపదే ప్రశంసలే ఇందుకు నిదర్శనం
- ఎక్స్ వేదికగా విపక్షనేత రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ,అక్టోబర్16( వెలుతురు):**
అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలకు ప్రధాని మోడీ లొంగిపోయారని విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దని, చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నా, మోడీ నుంచి సమాధానం లేదన్నారు.

## మీడియాకు ఎక్కి
# రచ్చ చేయవద్దు

కొండాసురేఖకు మీనాక్షి సున్నిత హెచ్చరిక



**హైదరాబాద్,అక్టోబర్16( వెలుతురు):**
తెలంగాణ మంత్రి కొండా సురేఖతో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్

## మావోయిస్టులకు
# వరుస ఎదురుదెబ్బలు

ఛత్తీస్‌ఘడ్‌లో లొంగిన 170మంది మావోలు

లొంగిన వారిలో వాసుదేవరావు తదితరులు

ఎక్స్ వేదికగా వెల్లడించిన హోంమంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ,అక్టోబర్16( వెలుతురు):**
మావోయిస్టులకు వరుసగా భారీ ఎదురుదెబ్బలు తగులుతున్నాయి.

## జిఎస్టీ సంస్కరణలతో
# పేదలకు మేలు

ఓకల్ ఫర్ లోకల్ నినాదంతో సాగాలి





జిఎస్టీ సంస్కరణలతో పేదలకు మేలు జరుగుతోందని, అయితే అది ఓకల్ ఫర్ లోకల్ కావాలని ప్రధాని మోడీ అభిలషించారు. డ్రోన్ టెక్నాలజీకి కర్నూలు కేంద్రం కాబోతోందన్నారు. మరోవైపు.. ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి మన సైనిక బలాన్ని నిరూపించింది. అందులో దేశీయ టెక్నాలజీ అద్భుతంగా పనిచేసిందన్నారు. ఇది మన ఆత్మనిర్బరతకు గర్వకారణమన్నారు. కర్నూలు శివారులోని నన్నూరు వద్ద 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' పేరుతో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీఎం చంద్రబాబు, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నారా లోకేశ్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల నిర్మించిన, నిర్మించబోతున్న రూ.13,429 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

- డ్రోన్ టెక్నాలజీలో కర్నూలుకు స్థానం
- ఆవిష్కరణలకు కేంద్రంగా ఆంధ్రప్రదేశం
- గూగుల్ రాకతో విశాఖ దశ మారతుంది
- రాష్ట్రంలో చంద్రబాబు, పవన్‌ల విజనరీ నాయకత్వం
- కర్నూలు సభలో ప్రధాని మోడీ ప్రసంగం

**కర్నూలు, అక్టోబరు 16( వెలుతురు):**
ఈ సందర్భంగా మాట్లాడుతూ .. ఆత్మగౌరవం, సంస్కృతికి నిలయంగా ఆంధ్రప్రదేశ్ ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సైన్స్, ఆవిష్కరణల కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఉంది. ఏపీలో అనంత అవకాశాలతో పాటు యువతకు అపార శక్తి ఉంది. అహోబిలం నర్సింహస్వామి, మహానంది ఈశ్వరుడికి నమస్కరిస్తున్నా. మంత్రాలయం రాఘవేంద్రస్వామి అందరినీ ఆశీర్వదించాలని కోరుతున్నా. జ్యోతిర్లింగం సోమనాథుడి నేల అయిన గుజరాత్‌లో నేను జన్మించాను. విశ్వనాథుడి భూమి అయిన కాశీకి సేవ చేసే అవకాశం లభించింది. ఇవాళ శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆశీస్సులు పొందానని అన్నారు.



### శ్రీశైలంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్న మోడీ



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న స్వామికి రుద్రాభిషేకం

పూర్ణకుంభంతో స్వాగతించి..ఆశీర్వించిన పండితులు

## సూపర్ జిఎస్టీ ..సూపర్ సేవింగ్స్ ప్రారంభం మాత్రమే

- 21వ శతాబ్దం మోడీదే అవుతుందనడంలో సందేహం లేదు
- మోడీలాంటి నేత ఉండడం మన అదృష్టం
- కర్నూలు సభలో సిఎం చంద్రబాబు ప్రశంసలు



**కర్నూలు,అక్టోబరు16( వెలుతురు):**
సూపర్ జిఎస్టీ ..సూపర్ సేవింగ్స్ ఇది ప్రారంభం మాత్రమే అని ఏపీ సిఎం చంద్రబాబు అన్నారు. కర్నూలులో 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్' పేరుతో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోడీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, సిఎం

## ప్రధాని మోడీ ఓ నిజమైన కర్మయోగి

- దేశం తలెత్తుకునేలా పాలన చేస్తున్న మోడీ
- కూటమి ప్రభుత్వం మరో 15 ఏళ్లు ఉండాలి
- కర్నూలు సభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**కర్నూలు,అక్టోబరు16( వెలుతురు):**
దేశ సేవే పరమావధిగా ప్రజలకు సేవ చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ని ఓ నిజమైన కర్మయోగిగా చూస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

## తిరుగలేని శక్తిగా భారత్ అభివృద్ధి



- దేశాన్ని సూపర్ పవర్‌గా మార్చిన ఘనత
- మోడీపై ప్రశంసలు కురిపించిన మంత్రి లోకేశ్

**కర్నూలు,అక్టోబరు16( వెలుతురు):**
ప్రధాని మోదీ భారత్‌ను తిరుగులేని శక్తిగా మారుస్తున్నారని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. కర్నూలు శివారులోని నన్నూరు వద్ద 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్' పేరుతో ఏర్పాటు చేసిన బహిరంగసభలో లోకేశ్ ప్రసంగించారు. పలు సినిమాల్లోని డైలాగులు చెబుతూ

# ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి భేష్



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:**
రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న ఆయా శాఖల పెండింగ్ బకాయిలను త్వరితగతిన పూర్తీ చేస్తున్నారు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా. పెండింగ్ నిధులతో పాటు ఉద్యోగుల జిపిఎఫ్ డబ్బును సైతం దశల వారీగా విడుదల చేస్తుండటంతో ఉద్యోగులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒక్క డిపార్ట్మెంట్ లో పెండింగ్ నిధులు లేకుండా జాగ్రత్తగా పడుతున్నారు. తాజగా పంచాయితీ రాజ్ పరిధిలో పనిచేసే EGMM ( ఎంప్లాయిమెంట్ జెనరేషన్ , మార్కెటింగ్ మిషన్ ) విభాగానికి రావాల్సిన డెబ్బై కోట్ల రూపాయల పెండింగ్ బకాయిలను తక్షమమే విడుదల చేయాలనీ కోరుతూ ఆర్థిక శాఖ కార్యదర్శికి పంచాయితీ రాజ్ కమిషనర్ శ్రీజన లేఖ రాసారు. స్కిల్ దేవలప్మెంట్ కింద ప్రతి ఏటా లక్షలాది మంది పేద విద్యార్థులు ఉచితంగా ఆయా కోర్సుల నిమిత్తం శిక్షణ పొందుతున్నారని లేఖలో తెలిపారు. గడిచిన సారి 144 కోట్ల రూపాయాలను ప్రభుత్వం కేటాయిస్తే అందులో ప్రతి పైసా శిక్షణ కోసమే వాడినట్లు తెలియజేసారు. ఈ సారి మరో డెబ్బై కోట్ల పెండింగ్ బకాయిలు రావాల్సి ఉండటంతో ఫైనాన్స్ శాఖను కోరారు.అటు ఫైనాన్స్ డిపార్ట్మెంట్ కి సందీప్ కుమార్ సుల్తానియా వచ్చాక ఆర్థిక శాఖను గాడిలో పెడుతున్నారన్న పేరుంది. అటు ప్రభుత్వాన్ని ఇటు పెండింగ్ నిధులతో బాధపడుతున్న ఆయా విభాగాలను గాడిలో పెట్టి ఆర్థిక శాఖను సరిద్దిటుతున్నారు. ఎక్కడ ఫైళ్ల పెండింగ్ లేకుండా అధికారులను ఉరుకులు పెట్టిస్తున్నారు. ఇక ఉద్యోగుల జిపిఎఫ్ డబ్బులు ఎక్కడ ఆపకుండా క్లియర్ చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ను ముఖ్య మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి ల సహకారంతో అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు.స్కిల్ డెవలప్మెంట్ అంశంలో ముఖ్య మంత్రికి ప్రత్యేక ఇష్టం ఉంది. ఇందుకోసం ప్రభుత్వం ఎంతైనా ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇప్పటికే సీఎం స్పష్టం చేసారు.

వెలుతురు

## మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు

మావోయిస్టు పార్టీకి దశాబ్దాలపాటు అత్యంత కీలక నేతగా వ్యవహరించిన మల్లోజుల వేణుగోపాల్‌రావు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ముందు లొంగిపోయిన మరుసటి రోజే మరో 170 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయారు. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని సమూలంగా నిర్మూలించేందుకు తాము కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. నిన్న ఛత్తీస్‌గఢ్‌లో 27మంది; మహారాష్ట్రలో 61 మంది జనజీవన స్రవంతిలోకి వచ్చారన్నారు. దీంతో రెండు రోజుల వ్యవధిలో 258 మంది లొంగిపోయారన్న అమిత్ షా.. నక్సలిజంపై పోరులో ఇదో పెద్ద విజయమన్నారు. భారత రాజ్యాంగంపై తమ విశ్వాసాన్ని ప్రకటిస్తూ హింసను త్యజించాలనే వీరి నిర్ణయాన్ని అభినందిస్తున్నట్లు అమిత్ షా తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాల ఫలితాలను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. తమ విధానం స్పష్టంగా ఉందన్న అమిత్ షా.. లొంగిపోయేవారిని స్వాగతిస్తామని.. ఇంకా తుపాకీతో ఉద్యమం కొనసాగించాలను కొనేవారు భద్రతా దళాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నక్సలిజం మార్గంలో ఇంకా కొనసాగుతున్న వారు ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో చేరాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాద స్థావరాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్, ఉత్తర బస్తర్‌లు విముక్తిపొందిన ప్రాంతాలుగా ప్రకటించడం సంతోషదాయకమని తెలిపారు. ఇప్పుడు దక్షిణ బస్తర్‌లో నక్సలిజం జాడ ఉందని.. దీన్ని భద్రతా దళాలు త్వరలో తుడిచిపెడతాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో భాజపా సర్కార్ ఏర్పాటైన తర్వాత జనవరి 2024 నుంచి 2,100 మంది మావోయిస్టులు లొంగిపోగా, 1785మందిని అరెస్టు చేశారని తెలిపారు. 477 మందిని భద్రతాదళాలు నిర్మూలించాయని తెలిపారు. లొంగిపోయిన వారిలో సతీష్ అలియాస్ టి. వాసుదేవరావు సహా 10 మంది సీనియర్ మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం. లొంగిపోయిన వారి జాబితాలో రాణిత, భాస్కర్, నీలా అలియాస్ నందే, దీపక్ పాలో సహా పలువురు ఉన్నారు. వీరిలో వాసుదేవరావు తలపై రూ.కోటి రివార్డు ఉండగా.. మరికొందరిపై లక్షల్లో రివార్డులు ఉన్నట్లు తెలుస్తోంది.

## ట్రంప్‌కు లొంగిపోయిన మోడీ

ఈ బెదిరింపు చర్యల్లో భాగంగానే అమెరికా భారత్‌పై పెద్దఎత్తున సుంకాల్ని విధించిన సంగతి తెలిసిందేనన్నారు. ఈ నేపథ్యంలో భారత్ అమెరికాకు తలొగ్గి రష్యా నుంచి ఆయిల్‌ని కొనుగోలును నిలిపివేస్తున్నట్లు తనకు హామీ ఇచ్చిందని అమెరికా అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రంప్‌కి మోడీ భయపడిపోయారని రాహుల్ ఆరోపించారు. దీనికి తాజా సంఘటనలే తార్కాణమని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయదని ట్రంప్ నిర్ణయానికి మోడీ అనుమతించడం,. భారత్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు ట్రంప్ చేస్తున్నప్పటికీ.. ప్రధాని మోడీ ట్రంప్‌కి పదేపదే అభినందనలు తెలుపుతూ సందేశాలు పంపడం ఏమిటన్నారు. ఆర్థికమంత్రి అమెరికా పర్యటనను రద్దు చేసుకోవడం, ఈజిప్టు షర్మ్ ఎల్ షేక్‌లో జరిగిన గాజా శాంతి శిఖరాగ్ర సమావేశానికి హాజరుకాకపోవడం,ఆపరేషన్ సింధూర్ సమయంలో ట్రంప్ జోక్యం చేసుకుని యుద్ధాన్ని ఆపానని చెబుతున్నప్పటికీ మోడీ నోరెత్తకపోవడం... ఆ వ్యాఖ్యల్ని విభేదించకపోవడం వంటి చర్యల్ని చూస్తే.. మోడీ ట్రంప్‌కి భయపడిపోయారని తెలుస్తోందని రాహుల్ ఎక్స్ పోస్టులో ప్రధానిని విమర్శించారు.

## మీడియాకు ఎక్కి రచ్చ చేయవద్దు

మీనాక్షి నటరాజన్ ఫోన్‌లో మాట్లాడారు. మీడియా ముందుకు వెళ్లవద్దని కొండా సురేఖకు ఆమె సూచించారు. కూర్చొని మాట్లాడదామని మీనాక్షి నటరాజన్ చెప్పినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను ఆ బాధ్యతల నుంచి ఇటీవల తప్పించిన విషయం తెలిసిందే. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని సిమెంటు కంపెనీల యాజమాన్యాలను ఆయన బెదిరించినట్లు ప్రభుత్వం దృష్టికి రావడంతో గట్టిగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో హైదరాబాద్‌లో కొండా సురేఖ ఇంటికి పోలీసులు వెళ్లారు. సురేఖ నివాసంలో ఆమె మాజీ ఓఎస్డీ సుమంత్ ఉన్నారన్న సమాచారంతో మఫ్టీలో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మంత్రి కుమార్తె సుస్మిత వారిని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ తమపై బురదజల్లేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దలే ఇవన్నీ చేయిస్తున్నారని ఆరోపించారు. తన తల్లిదండ్రులనే లక్ష్యంగా చేసుకుని కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖతో మీనాక్షి నటరాజన్ మాట్లాడినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని ఇంతటితో సమసిపోయేట్లు చూద్దామని ఆమె చెప్పినట్లు సమాచారం.

## పర్యాటకంలో సుస్థిర అభివృద్ధే లక్ష్యం



సుస్థిర అభివృద్ధికి నూతన మార్గాలు” అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మంత్రి జూపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సుస్థిర అభివృద్ధి కోసం పర్యాటకాన్ని సంస్కృతితో అనుసంధానం చేయాల్సిన, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సిన, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాలను ప్రోత్సహించాల్సిన ప్రాముఖ్యతను వివరించారు. తెలంగాణ కొత్త పర్యాటక విధానం ఈ రంగాన్ని పునరుత్తేజితం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని, ఈ మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు నుండి వెలువడే సూచనలు, సిఫార్సులను విధానాల మెరుగుదలకు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించడంతో పాటు ఆ రంగంలో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా సంకల్పించిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోందని అన్నారు. రాష్ట్రంలో రూ. 15 వేలకు పైగా కోట్ల పెట్టుబడుల సమీకరణ, 3 లక్షల ఉద్యోగాల కల్పన, రెట్టింపు వృద్ధి, పర్యాటకుల సంఖ్య పెంపుదల, మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి ప్రాజెక్టుల మేళవింపుతో రూపొందించిన నూతన పర్యాటక విధానం ద్వారా పర్యాటకులను ఆకర్శించేలా ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్లుతున్నామని చెప్పారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో ముందుకు వెళుతున్నామని, టూరిజం కాంక్లేవ్ లో రూ. 15 వేల కోట్లకు పైగా పీపీపీ మోడల్ లో పెట్టుబడులకు సంబంధించి అవగాహన ఒప్పందాలు చేసుకున్నామని చెప్పారు. ప్రభుత్వానికి వ్యాపారాత్మక ధోరణి లేదని, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, ప్రభుత్వం పెట్టుబడులు పెట్టే పరిస్థితి లేదని అందుకు పీపీపీ మోడల్ పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నిరుపయోగంగాఉన్న పర్యాటక కేంద్రాలను వినియోగంలోకి తేవడానికి కృషి చేస్తున్నామని, తద్వారా వచ్చే ఆదాయంతో పర్యాటక రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పర్యాటకాన్ని మనం సంస్కృతి, సాంప్రదాయాల్లో భాగంగా చేస్తామని, తద్వారా సుస్థిర అభివృద్ధి సాధిస్తామని అన్నారు. సామాజిక రుగ్మతలు, యువతలో పెడధోరణులను రూపుమాపేందుకు భాషా, సాంస్కృతిక శాఖ పర్యవేక్షణలో ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించి, టూరిజం ప్రమోషన్ లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాస మూర్తి (డైరెక్టర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్) హాజరయ్యారు.

# జీఎస్టీ సంస్కరణలతో పేదలకు మేలు

చంద్రబాబు, పవన్ కల్యాణ్ రూపంలో ఏపీకి శక్తిమంతమైన నాయకత్వం ఉంది. ఏపీకి కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతు ఉంది. 16 నెలలుగా రాష్ట్రంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. డబుల్ ఇంజిన్ సర్కారు ఆధ్వర్యంలో రాష్ట్రం అపూర్వ ప్రగతి సాధిస్తోంది. దిల్లీ, అమరావతి వేగంగా అభివృద్ధి పథంలో సాగుతున్నాయి. 2047 నాటికి మన దేశం.. వికసిత్ భారత్‌గా మారుతుంది. 21వ శతాబ్దం.. 140 కోట్ల భారతీయుల శతాబ్దం అని ప్రధాని మోదీ అన్నారు. ప్రాజెక్టుల వల్ల రాష్ట్రంలో కనెక్టివిటీ బలోపేతం అవుతుంది. ప్రాజెక్టులతో పరిశ్రమలకు ఊతంతో పాటు జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే ఇంధన భద్రత కీలకం. ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులతో దేశం ఇంధన సామర్థ్యం పెరుగుతుంది. గూగుల్ ఏఐ డేటా సెంటర్ ద్వారా సబ్ సీ గేట్‌వేగా ఏపీ మారుతుంది. ఈ ప్రాజెక్టు విశాఖను ఏఐ, కనెక్టివిటీ హబ్‌గా మారుస్తుంది. దీని ద్వారా భారత్‌తో పాటు యావత్ ప్రపంచానికి సేవలు అందుతాయి. భారత్ అభివృద్ధికి ఏపీ అభివృద్ధి చాలా అవసరం. అలాగే ఏపీ అభివృద్ధికి.. రాయలసీమ అభివృద్ధి అంతే అవసరం. ఈ ప్రాజెక్టులు రాయలసీమ లోని ప్రతి జిల్లాలో ఉద్యోగాలు సృష్టిస్తాయి. రాయలసీమ ప్రగతికి సరికొత్త ద్వారాలు తెరిపిస్తాయి. ప్రాజెక్టులతో పారిశ్రామిక అభివృద్ధి మరింత వేగవంతమవుతుంది. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక కారిడార్లతో ఉపాధి అవకాశాలు పెరిగాయి. భారత్‌ను 21వ శతాబ్దపు తయారీ కేంద్రంగా ప్రపంచం చూస్తోంది. ఆత్మనిర్భర్ భారత్ సాధనకు ఆంధ్రప్రదేశ్ కీలకంగా మారనుంది. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏపీ సామర్థ్యాన్ని విస్మరించాయి. దేశాన్ని ముందుకు నడిపించే శక్తి ఏపీకి ఉంది. ఎన్‌డీఏ హయాంలో ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం మారుతోందని ప్రధాని అన్నారు. ప్రాజెక్టుల వల్ల రాష్ట్రంలో కనెక్టివిటీ బలోపేతం అవుతుందని.. ప్రాజెక్టులతో పరిశ్రమలకు ఊతంతో పాటు జీవన ప్రమాణాలు మెరుగవుతాయని వెల్లడించారు. ఏ దేశమైనా.. రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే ఇంధన భద్రత కీలకం అన్నారు ప్రధాని నరేంద్ర మోడీ.. ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులతో దేశం ఇంధన సామర్థ్యం పెరుగుతుందన్న ఆయన గూగుల్ ఏఐ డేటా సెంటర్ ద్వారా సబ్ సీ గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్ మారుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.. ఈ ప్రాజెక్టు విశాఖను ఏఐ, కనెక్టివిటీ హబ్‌గా మారుస్తుందని.. తద్వారా భారత్‌తో పాటు యావత్ ప్రపంచానికి సేవలు అందుతాయన్నారు.. భారత్ అభివృద్ధికి ఆంప్రదేశ్ అభివృద్ధి చాలా అవసరం.. అలాగే ఏపీ అభివృద్ధికి.. రాయలసీమ అభివృద్ధి అంతే అవసరం అన్నారు భారత ప్రధాని.. అయితే, ఈ ప్రాజెక్టులు రాయలసీమలోని ప్రతి జిల్లాలో ఉద్యోగాలు సృష్టిస్తాయి.. రాయలసీమ ప్రగతికి సరికొత్త ద్వారాలు తెరుస్తాయని వెల్లడించారు.. ప్రధాని నరేంద్ర మోదీ సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ సభా వేదికగా వివిధ ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 13,429 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. వర్చువల్ విధానం ద్వారా వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, రెండు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు ప్రధాని. వీటిలో రూ. 9449 కోట్ల విలువైన 5 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయగా.. రూ. 1704 కోట్ల విలువైన 8 అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ. 2276 కోట్ల విలువైన 2 ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు ప్రధాని మోదీ. వికసిత్ భారత్ లక్ష్యం సాధనకు.. మల్టీమోడల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల అభివృద్ధి. సబ్బవరం - షీలానగర్ హైవేతో కనెక్టివిటీ మరింత పెరుగుతుంది. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక కారిడార్లతో ఉపాధి లభిస్తోంది. భారత్‌ను 21వ శతాబ్దపు తయారీ కేంద్రంగా ప్రపంచం చూస్తోంది. ఏపీ అభివృద్ధికి రాయలసీమ అభివృద్ధి చాలా ముఖ్యం. రాయలసీమ జిల్లాల్లో ఉపాధి కల్పించేలా పలు ప్రాజెక్టులు వస్తున్నాయి. ప్రజలే ప్రాధాన్యంగా మా ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధే మా విధానం. జీఎస్టీ భారాన్ని కూడా తగ్గించాం. జీఎస్టీ పొదుపు ఉత్సవాన్ని పండుగగా చేసుకున్నారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఉత్సవాన్ని జరుపుకోవడం ఆనందాన్నిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏపీ సామర్థ్యాన్ని విస్మరించాయి. దేశాన్ని ముందుకు నడిపించే శక్తి ఏపీకి ఉంది. ఏపీ మాత్రం సొంత అభివృద్ధి కోసం పోరాడే దుస్థితి కలిగింది. ఎన్డీఏ హయాంలో ఏపీ ముఖచిత్రం మారుతోంది. నిమ్మలూరు నైట్ విజన్ పరికరాల తయారీ ఫ్యాక్టరీ.. రక్షణ రంగంలో కీలక పాత్ర పోషించబోతోంది. కర్నూల్‌ను డ్రోన్ హబ్‌గా మార్చాలన్నది ప్రభుత్వం సంకల్పం' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.

### శ్రీశైలంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్న మోడీ

కర్నూలు పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం క్షేత్రాన్ని దర్శించుకున్నారు. అర్చకులు, ఆలయ అధికారులు ఆయనకు వేదోక్తంగా స్వాగతం పలికారు. భ్రమరాంబ, మల్లికార్జున స్వామివారికి మోదీ పూజలు చేశారు. మల్లికార్జునస్వామికి పంచామృతాలలో రుద్రాభిషేకం, భ్రమరాంబదేవికి ఖడ్గమాల, కుంకుమార్చన పూజలు చేశారు. పూజల అనంతరం శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడి శివాజీ దర్బార్ హాల్, ధ్యాన మందిరాలను తిలకించారు. ప్రధానితో పాటు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శ్రీశైలం చేరుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉదయం ప్రత్యేక విమానంలో కర్నూలు చేరుకున్న ప్రధాని.. అక్కడి నుంచి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి హెలికాప్టర్‌లో సున్నిపెంటకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో శ్రీశైలం వెళ్లారు. ఆలయానికి చేరుకున్న ప్రధానికి అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎంతో కలిసి ప్రధాని మోదీ శ్రీభ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లను దర్శించుకున్నారు. మల్లికార్జునస్వామికి పంచామృతాలతో రుద్రాభిషేకం చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం ప్రధానికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. దర్శనానంతరం ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలంలో శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. రాజ దర్బార్ గోడలపై ఛత్రపతి శివాజీ జీవిత చరిత్రను తెలిపే శిల్పాలను ఆసక్తిగా పరిశీలించారు. అక్కడి శివాజీ విగ్రహం వద్ద నమస్కరించారు. శివాజీ దర్బార్ హాల్, ధ్యాన మందిరాలను పరిశీలించారు. ధ్యానముద్రలో ఉన్న శివాజీ, అమ్మవారి విగ్రహాలను దర్శించు కున్నారు. అమ్మవారి విగ్రహానికి భక్తిశ్రద్ధలతో పుష్పాలను సమర్పించారు. ప్రధానితో పాటు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శివాజీ స్ఫూర్తి కేంద్రానికి వెళ్లారు. ఈ కేంద్రం నిర్వహణ బాగుందని ట్రస్టు నిర్వాహకులను ప్రధాని మోదీ అభినందించారు. అక్కడి నుంచి భ్రమరాంబ గెస్ట్‌హౌస్‌కు వెళ్లారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో శ్రీశైలం పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సున్నిపెంట వద్ద సుమారు 1500 మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

## సూపర్ జీఎస్టీ ..సూపర్ సేవింగ్స్ ప్రారంభం మాత్రమే

చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, నారా లోకేష్ సహా పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రజలందరూ ప్రయోజనం పొందుతున్నారు. మీరు జీఎస్టీ 2.0తో లబ్ధి పొందుతున్నారా? లేదా? అని సభకు హాజరైన ప్రజలను చంద్రబాబు అడిగారు. లబ్ధిపొందినవారు చప్పట్లు కొట్టాలంటూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. సూపర్ సేవింగ్స్ అనేది ప్రారంభం మాత్రమే.. రాబోయే రోజుల్లో మరిన్ని అవకాశాలు ఉంటాయి. 25 సంవత్సరాలుగా నరేంద్ర మోడీ.. సీఎంగా, పీఎంగా ప్రజా సేవలో ఉన్నారు. 21వ శతాబ్దం మోడీదే అవుతుందనడంలో సందేహం లేదు. సరైన సమయంలో దేశానికి సరైన నాయకుడిగా ప్రధాని ఉన్నారని ప్రశంసలు కురిపించారు. ఇలాంటి నాయకుడు ఉండటం దేశం అదృష్టంగా అభివర్ణించారు. చాలా మంది ప్రధానమంత్రులతో నేను కలిసి పనిచేశాను. కానీ, నరేంద్ర మోడీ లాంటి నాయకుడిని నేను చూడలేదని.. ఆయన విశ్రాంతి లేకుండా నిరంతరం పనిచేస్తూనే ఉన్నారని చంద్రబాబు పేర్కొన్నారు. ఇక, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంటుందని తెలిపారు చంద్రబాబు అన్నారు. మరోవైపు.. ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి మన సైనిక బలాన్ని నిరూపించింది. మాటలతో కాదు.. చేతలతో చూపించే వ్యక్తి ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.10 వేలు ఆదా అవుతుందని వెల్లడించారు. సరైన సమయంలో ప్రధాని మోడీ.. దేశానికి సరైన నాయకుడిగా ఉన్నారని ప్రశంసలు కురిపించిన ఆయన.. ఇలాంటి నాయకుడు ఉండటం దేశం అదృష్టంగా అభివర్ణించారు.. చాలా మంది ప్రధానమంత్రులతో కలిసి పనిచేశారు.. కానీ, నరేంద్ర మోడీ లాంటి నాయకుడిని నేను చూడలేదని.. ఆయన విశ్రాంతి లేకుండా నిరంతరం పనిచేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు చంద్రబాబు.. ఇక, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంటుందని తెలిపారు ఏపీ సీఎం చంద్రబాబు.. నరేంద్ర మోడీ దృఢ సంకల్పంతో మనం 11వ స్థానం నుండి నాల్గో స్థానానికి ఎదిగామన్నారు.. మరోవైపు.. ఆపరేషన్ సిందూర్ మన సైనిక బలాన్ని నిరూపించింది.. మాటలతో కాదు.. చేతలతో చూపించే వ్యక్తి ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు..

### ప్రధాని మోడీ ఓ నిజమైన కర్మయోగి

అభివర్ణించారు. ధర్మాన్ని పాటిస్తూ కర్మను పాటించే నాయకుడు మోదీ అని ప్రశంసించారు. కర్నూలు జిల్లాలోని నన్నూరులో 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్' బహిరంగ సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించారు. మోదీ దేశాన్ని మాత్రమే కాదని.. రెండు తరాలను నడుపుతున్నారని కొనియాడారు. దేశం తలెత్తి చూసే విధంగా ఆత్మనిర్భర్ భారత్‌ని మోదీ తీసుకువచ్చారని కీర్తించారు. కూటమి 15 ఏళ్లకు తక్కువ కాకుండా బలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా తట్టుకుని మనం నిలబడాలని సూచించారు. మోదీ కేవలం ప్రభుత్వాన్ని మాత్రమే కొనసాగించడం లేదని.. రెండు, మూడు తరాల ప్రజలకు దిశా నిర్దేశర చేస్తున్నారని కొనియాడారు పవన్ కల్యాణ్. ఆత్మ నిర్భర్ భారత్ ద్వారా ప్రపంచ పటంలో దేశాన్ని నిలబెడుతున్నారని ప్రశంసించారు. గూగుల్ లాంటి అతిపెద్ద ప్రాజెక్టులు దేశానికి ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కి వచ్చాయని ఉద్ఘాటించారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో పేదలు, సామాన్యులకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతోందని తెలిపారు. జీవిత, ఆరోగ్య బీమాతో సహా నిత్యావసర వస్తువుల ధరలు తగ్గటంతో ప్రజలు ఆదా చేసుకోగలుగుతారని వివరించారు. కూటమి ప్రభుత్వం కనీసం 15 ఏళ్ల పాటు అధికారంలో ఉండాలని ఆకాంక్షించారు. పెట్టుబడులు పరిశ్రమల నమ్మకాన్ని సడలించకుండా అంతా కలిసి ఉండి స్థిరమైన ప్రభుత్వాన్ని కొనసాగిస్తామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీని కర్మయోగిగా చూస్తాం.. ఎలాంటి లాభాపేక్ష లేకుండా పనిచేస్తున్నారు కాబట్టే మోడీని కర్మయోగి అంటాం అని పేర్కొన్నారు. ఇక ఇక, ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం 15 ఏళ్లు ఉండాలని ఆకాక్షించారు పవన్ కల్యాణ్.. దీని కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తట్టుకొని నిలబడతాం అన్నారు.. ఇబ్బందులు ఉన్నా.. ఏమున్నా తట్టుకుని నిలబడాలని సూచించిన ఆయన.. ఒక తరం కోసం ఆలోచించే నాయకులు సీఎం చంద్రబాబు అని.. ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు నాయకత్వంలో అందరం సమష్టిగా పనిచేస్తాం.. వచ్చే తరం ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్తాం అని స్పష్టం చేశారు పవన్ కల్యాణ్.. మరోవైపు, ప్రధాని మోడీ దేశాన్ని మాత్రమే కాదు.. రెండు తరాలను నడుపుతున్నారు.. దేశం తలెత్తి చూసే విధంగా ఆత్మనిర్భర్ భారత్ తీసుకువచ్చారని ప్రశంసించారు.. దేశ జెండా ఎంత పౌరుషంగా ఉంటుందో.. అలాగే దేశ పటాన్ని ప్రపంచపటంలో నిలబెట్టారని పేర్కొన్నారు.

### తిరుగలేని శక్తిగా భారత్ అభివృద్ధి

ప్రధానిపై ప్రశంసలు కురిపించారు. 'పహల్గాం దాడి తర్వాత 'నమో' దెబ్బకు పాకిస్థాన్ దిమ్మతిరిగింది. అమెరికా సుంకాలు పెంచితే పెద్ద దేశాలే వణికిపోయాయి. కానీ, నమో స్టైలే వేరు. పేద, మధ్యతరగతి ప్రజలపై జీఎస్టీ భారం తగ్గించారు. దసరా-దీపావళి కలిసి వస్తే ఎలా ఉంటుంది. అలాంటి పండగను దేశ ప్రజలకు అందించారని లోకేశ్ తెలిపారు. బ్రిటీష్ వారిని గడగడలాడించిన ఉయ్యాలవాడ పుట్టిన నేల అని.. కర్నూలు ప్రజల రాజసం కొండారెడ్డి బురుజు అని చెప్పుకొచ్చారు. మన నమో అంటే విక్టరీ.. ఆయన ఏ కార్యక్రమం చేపట్టినా విజయమే అని అన్నారు. గుజరాత్ సీఎంగా.. దేశ ప్రధానిగా 25 ఏళ్లు పూర్తి చేస్తుకున్నారని తెలిపారు. దేశాన్ని సూపర్ పవర్‌గా మార్చిన ఘనత మోదీది అంటూ మంత్రి కొనియాడారు. మోదీ కొట్టిన దెబ్బకు పాక్ దిమ్మ తిరిగిందన్నారు. ట్రంప్ టారిఫ్స్‌తో పలు దేశాలు వణికినా మోదీ బెదరలేదని అన్నారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు సూపర్ సేవింగ్ అయ్యిందన్నారు. పేద ప్రజల చిరునవ్వే మోదీకి పండుగన్నారు. దేశాన్ని సూపర్ పవర్‌గా మార్చిన ఘనత మోదీదే అని వెల్లడించారు. జీఎస్టీ తగ్గింపుతో రూ.8వేల కోట్ల ఆదాయం కోల్పోతామని చెప్పినా.. పేదలకు మంచి జరుగుతుందని సీఎం అన్నారని తెలిపారు. డబుల్ ఇంజన్ బు÷-లలెట్ ట్రైన్ సర్కార్ కేంద్రంలో, రాష్ట్రంలో ఉందన్నారు. పారిశ్రామిక ప్రాజెక్టులు, రైల్వే, హైవే ప్రాజెక్టులు ఏపీకి వచ్చాయని చెప్పారు. భారత్ 4వ ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి కారణం ప్రధాని మోదీనే అని అంటూ ప్రధానిపై మంత్రి లోకేష్ ప్రశంసల వర్షం కురిపించారు. కాగా.. జిల్లాలో ప్రధాన ప్రధాన మంత్రి నరేంద్ర పర్యటన కొనసాగుతోంది. శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శనం అనంతరం నన్నూరులో 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్' బహిరంగసభలో పాల్గొన్నారు ప్రధాని. ఈ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి శివుడి జ్ఞాపికను బహుకరించారు సీఎం. ఆపై మోదీని సీఎం, డిప్యూటీ సీఎం శాలువతో సత్కరించారు. అలాగే ప్రధానికి ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ ఆంజనేయస్వామి జ్ఞాపిక అందజేశారు.

# బిసి రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు

పునరాలోచన చేసింది. రాష్ట్రంలో జనాభా నియంత్రణ కట్టుదిట్టంగా అమలవుతున్న తరుణంలో ఈ గరిష్ఠ నిబంధన ను అమలు చేయాల్సిన అవసరం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఈ నిబంధనను ఎత్తివేసేందుకు కేబినెట్ సూచనప్రాయంగా అంగీకరించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో ఏన్కూర్ మార్కెట్ యార్డ్ కు పది ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ తీర్మానం చేసింది. నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయానికి ఇప్పుడున్న చోటనే అదనంగా 7 ఎకరాల భూమిని కేటాయించే ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నల్సార్ యూనివర్సిటీ అడ్మిషన్లలో ఇప్పుడు తెలంగాణ స్థానికులకు కేటాయించిన 25 శాతం సీట్ల కోటాను 50 శాతం పెంచాలని కేబినెట్ తీర్మానం చేసింది. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మెట్రో 2ఏ, 2బి విస్తరణకు అడ్డంకిగా మారిన మొదటి దశను పీపీపీ మోడ్లో నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంపై సుదీర్ఘంగా



చర్చించింది. మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో సాధ్యాసాధ్యాలు, అందులో ముడిపడి ఉన్న అంశాలన్నింటినీ లోతుగా అధ్యయనం చేసేందుకు ఉన్నత అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సీఎస్ ఛైర్మన్గా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఎంఏయూడీ కార్యదర్శి, లా సెక్రెటరీ, మెట్రో రైలు ఎండీ, అర్బన్ ట్రాన్స్పోర్ట్ అడ్వయిజర్ అధికారుల కమిటీలో సభ్యులుగా ఉంటారు. అధికారుల కమిటీ తమ రిపోర్టును కేబినేట్ సబ్ కమిటీకి అందిస్తుంది. కేబినేట్ సబ్ కమిటీ సిఫారసుల ఆధారంగా మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్రంలో హ్యామ్ మోడ్‌లో మొదటి దశలో 5,566 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జాతీయ రహదారులు, జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, పర్యాటక ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలతో అనుసంధానమయ్యే రహదారులకు సంబంధించి అభివృద్ధి, విస్తరణ పనులు చేపడుతాం. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్ పేట ఓఆర్ఆర్, ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫాం రోడ్ వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించి రక్షణ శాఖ భూములు వినియోగించుకుంటున్నందున వారికి ప్రత్యామ్నాయంగా 435.08 ఎకరాల భూములను అప్పగిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది. కృష్ణా-వికారాబాద్ బ్రాడ్‌గేజ్ రైలు మార్గం నిర్మాణానికి సంబంధించి 845 హైక్టార్ల భూ సేకరణకు అయ్యే రూ.438 కోట్ల వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు అంగీకరిస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీర్మానం చేసింది. మన్ననూర్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి మొత్తం వ్యయంలో మూడో వంతు రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు అంగీకరిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది.

వెలుతురు

### ఆర్ అండ్ బి శాఖ పరిధిలో నిర్మించే

## హ్యామ్ రోడ్లకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం

- హర్షం వ్యక్తం చేసిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి
- వారంలో టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తాం
- వచ్చే 30నెలల్లో రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్లు నిర్మిస్తాం
- దేశానికే రోల్ మోడల్ గా నిలువనున్న తెలంగాణ రోడ్లు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహచర మంత్రి వర్గానికి కృతజ్ఞతలు
- రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:**

గురువారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఆర్ అండ్ బి శాఖ పరిదిలో 10,547 కోట్ల వ్యయంతో నిర్మించే 5,566 కి.మీ రోడ్లకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందనీ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇందులో విస్తరించబడే రోడ్లు మొత్తం–1,791 కి.మీ, వ్యయం - 6,152 కోట్లు.. సింగిల్ లేన్ నుండి డబుల్ లేన్ –866 కి.మీ - 2,377 కోట్లు, డబుల్ లేన్ 10మీటర్ల రోడ్డు - 779 కి.మీ - 2,637 కోట్లు,4లేన్ రోడ్లు - 124 కి.మీ -



735 కోట్లు అని మంత్రి పేర్కొన్నారు. బలోపేతం చేసే రోడ్లు మొత్తం - 3,775 కి.మీ, వ్యయం - 4,395 కోట్లు,, సింగిల్ లేన్ –768 కి.మీ - 674 కోట్లు, డబుల్ లేన్ - 2,618 కి.మీ - 3031 కోట్లు, డబుల్ లేన్(10 మీటర్ల రోడ్డు) - 148 కి.మీ - 225 కోట్లు..4లేన్ - 221 కి.మీ 444 కోట్లు అని మంత్రి వెల్లడించారు. ఆర్ అండ్ బి సర్కిళ్ల వారిగా మొత్తం 32 ప్యాకేజీల్లో పనులు చేపట్టనున్నట్లు,అందులో మొదటి ఫేజ్ లో 10 ప్యాకేజీలు వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టనునట్లు చెప్పారు. వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, వచ్చే 30నెలల్లో ప్యాకేజీల వారిగా అన్ని రోడ్లు పూర్తి చేస్తామని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

## అంగన్వాడి కేంద్రాలకు రూ. 156 కోట్లు విడుదల

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 16:**

రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాలకు పోషకాహార పథకం (SNP) కింద సరఫరా చేసిన వస్తువుల బిల్లుల కోసం అవసరమైన నిధులను ఆర్థిక శాఖ విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాల వారీగా వస్తువులు, కూరగాయలు, గ్యాస్ సరఫరాలు, ఇంటి అద్దెల వంటి



ఖర్చుల కోసం మొత్తం రూ. 156 కోట్లను ఆర్థిక శాఖ విడుదల చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఖర్చులకు సంబంధించిన అన్ని బిల్లులను వెంటనే సమర్పించాల్సిందిగా మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్ అన్ని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రాబోయే రెండు రోజుల్లోపు అన్ని జిల్లాలు తమ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొంది.




# సంపాదకీయం.. తాయిలాలకు లొంగితే అంతే సంగతులు !

ఎన్నికల ముందు హామీలు ఇచ్చే వారిని ప్రజలు నమ్మడం మానేస్తే ప్రజాస్వామ్యం బోలపేతం అవుతుంది. అంతెందుకు అసలు నాయకుల హామీలను పట్టించుకోవద్దు. ప్రజలు ఈ విషయంలో చైతన్యం పొందాలి. ఉచిత పథకాలు, నగదు బదిలీల హామీలను దరిచేరకుండా చూసుకోవాలి. రాజకీయ నాయకులు హామీలు ఇవ్వడం కాదు..ప్రజలు తమ ఎజెండాను నాయకుల ముందు ఉంచాలి. గ్రామాల వారీగా ప్రజలే ఎజెండా విధించాలి. రోడ్లు వేస్తారా లేదా అడగాలి. మంచినీటి సరఫరా చేస్తారా లేదా నిలదీయాలి. ఇలాంటి సమస్యల ను ఏ గ్రామానికి ఆ గ్రామ ప్రజలే గుర్తించి నాయకులకు ఎజెండా నిర్దేశించాలి. కిలోరూపాయి బియ్యం, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు వంటి వాటికి లొంగితే అంతే సంగతులు. అలా చేసి అధికారంలోకి వచ్చిన నేతలు రాష్ట్రాలను లూటీ చేసేస్తున్నారు.అందుకు తెలుగు రాష్ట్రాలు పక్కా ఉదాహరణ అని చెప్పవచ్చు. బీహార్‌లో పదేళ్లుగా అటుఇటుగా ఎన్‌డిఎ ప్రభుత్వమే నడుస్తోంది. నితీశ్ కుమార్ సిఎంగా పెద్దగా మార్పులకు శ్రీకారం చుట్టింది లేదు. అంతుకుముందు లాలూ ప్రసాద్ యాదవ్ కూడా కుటుంబ సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చారు. లాలూ లేదా, నితీశ్ కుమార్‌లు పెద్దగా బీహార్‌లో ప్రభావితం చేసేంతగా పాలన సాగించలేదు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీహార్ మొదటి నుండి రాజకీయంగా అత్యంత



చురుకుగా ఉండే రాష్ట్రంగా గుర్తింపు పొందింది. బీహార్ ఓ రకంగా కళింగ రాజ్యంగా చెప్పుకోవాలి. పాటలీపుత్రాన్ని రాజధానిగా చేసుకుని మౌర్యులు పాలించారు. ఆర్య చాణక్యుడు అక్కడే ఉండేవారు. నలంద విశ్వవిద్యా లయం ఒకప్పుడు ప్రపంచానికి మార్గం చూపింది. ఇలాంటి నేల బీహార్‌లో ఇప్పుడు అరాచకం సాగుతోంది. ఇకపోతే రాజకీయంగా ఎంతో చైతన్యం కలిగిన నేల అది. అక్కడ చోటుచేసుకునే పరిణామాలు అనేక సందర్భాలలో దేశ వ్యాప్తంగా ప్రభావం చూపాయి. దేశ రాజకీయాలకు దిశా నిర్దేశం చేశాయి. బీహర్‌కు చెందిన జయప్రకాశ్ నారాయణ్ జనతా పార్టీని స్థాపించి దేశ రాజకీయాలను మలుపు తిప్పారు. ఈ నేపథ్యంలోనే అక్కడ జరగనున్న ఎన్నికలు ఆ రాష్ట్రానికే కాకుండా దేశానికే కీలకంగా మారాయి. మరోమారు ఎన్‌డిఎ అధికారం కోసం ఎత్తులు వేస్తోంది. వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ రాజకీయంగా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. బీహార్‌లో అధికారంలో కొనసాగడమే లక్ష్యంగా బిజెపి నేతృత్వం లోని ఎన్‌డిఎ కూటమి ఎన్నో అడ్డదారులు తొక్కుతోంది. హడావిడిగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్)తో ఎన్నికల కమిషన్ స్వతంత్రత ప్రశ్నార్థకం గా మారింది.

పెద్దఎత్తున ఓట్ చోరీ ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటికి జవాబు ఇచ్చి, సందేహాలను నివృత్తి చేయాల్సిన ఎన్నికల కమిషన్ (ఇసి) గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతిపక్షాలపై దాడికి దిగుతోంది. అయితే బంగ్లా చొరబాటు దారుల సమస్య కూడా తీవ్రంగా ఉంది. ఓటర్ల జాబితాపై కొనసాగుతున్న నిరసనల మధ్యే తుది జాబితాను, ఎన్నికల షెడ్యూల్‌ను ఇసి విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం 243 మంది సభ్యులుగల బీహార్ శాసనసభకు నవంబర్ 6, 11 తేదీలలో పోలింగ్ జరగనుంది. 14వ తేదీన ఫలితాలు ప్రకటిస్తారు. మరోవైపు ఇసి విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాపై కూడా దుమారం రేగుతోంది. ఈ జాబితాలోని చేర్పులు, తొలగింపులకు సంబంధించిన పూర్తి వివరాలను తమకు అందచేయడంతో పాటు, వాటిని క్షేత్రస్థాయి వరకు ప్రదర్శించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఇకపోతే ఓట్ల తొలగింపు ఆరోపణలు చేస్తున్న రాహుల్ సక్రమంగా రుజువు చేయలేక పోయారు. సుప్రీం కూడా తొలగించిన ఓట్లకు సంబంధించి రుజువులతో అఫిడవిట్ వేయాలని సూచించినా వెనక్కి పోయింది. మరోవైపు ఎన్‌డిఎ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న నితిష్ కుమార్ ఇప్పటికే 9 సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. పదోసారి కూడా ఆ పదవిని ఆయన ఆశిస్తున్నారు. బిజెపి నేతలు ఆ విషయాన్ని తేల్చకుండా రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలకు మాత్రం నితీష్‌ను పూర్తి బాధ్యుడిని చేస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ఓటర్లను మభ్య పెట్టే కుతంత్రాలకు తెరతీస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాబోయే రోజుల్లో ఈ తరహా విన్యాసాలు మరింత జోరందుకోనున్నాయి. 2020లో జరిగిన ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి కేవలం 0.2 శాతం ఓట్ల ఆధికత్యతను మాత్రమే సాధించింది. దీంతో త్వరలో జరగనున్న ఎన్నికలలో ప్రతి ఓటు కీలకంగా మారనుంది. అదే సమయంలో ప్రతిపక్షాల మధ్య గరిష్ట స్థాయిలో ఐక్యత పెరగాల్సి ఉంది. గత ఎన్నికల్లో చోటు చేసుకున్న తప్పులు మరోసారి జరగకుండా చూసుకోవడంతో పాటు, ప్రజలకు నమ్మకం ఇయ్యవలసిన బాధ్యత ప్రతిపక్షాలదే! అయితే అధికారమే పరమావధిగా అన్ని పార్టీలు విన్యాసాలు చేస్తున్నాయి. తాజాగా 7.42 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు. ఈ క్రమంలో బీహార్ అభివృద్ధికి ఏం చేస్తారన్న దానిపై రాజకీయ పార్టీల్లో స్పష్టత లేదు. కేవలం ఓట్లు కొల్లగొట్టి అధికారం దక్కించుకోవడం అందరిపనిగా మారింది. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. నేతల కుయుక్తులను గమనించాలి. తమ ఓటును సక్రమంగా వినియోగించుకోవాలి. తాయిలాలు ఆశపడితే మరో ఐదేళ్లు లొంగిపోవాల్సి ఉంటుందని గుర్తించాలి.

## రష్యా నుంచి ఇక భారత్ చమురు కొనదు

- మోడీ నాతో చెప్పి..హామీ కూడా ఇచ్చారు
- మరోమారు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు




**వాషింగ్టన్,అక్టోబర్16( వెలుతురు):**
రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయదని.. ఈమేరకు ప్రధాని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి రష్యాను ఒంటరిని చేయడంలో ఇదొక కీలక అడుగని అభివర్ణించారు. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి అంటూ పొగడ్తలతో ముంచెత్తారు.రష్యా నుంచి భారత్ చమురును దిగుమతి చేసుకోవడంపై ప్రధాని మోదీ వద్ద తాను ఆందోళన వ్యక్తం చేశానని ట్రంప్ చెప్పారు. మాస్కో నుంచి భారత్ చమురు కొనడం వల్ల ఉక్రెయిన్‌పై యుద్ధం కొనసాగించేందుకు పుతిన్ ఆ నిధులు ఉపయోగిస్తున్నారని అమెరికా భావిస్తున్నదని తెలిపారు. ఈ కొనుగోళ్లపై తాను సంతోషంగా లేనని చెప్పాను. ఈ సందర్భంగా ఇక నుంచి రష్యా నుంచి చమురు కొనుగోలు చేయమని ప్రధాని మోదీ ఈరోజు తనకు హామీ ఇచ్చారని. ఇదొక కీలక ముందడుగు అని చెప్పారు. చైనా కూడా రష్యా ఆయిల్‌ను కొనకుండా చేస్తానని, ఇక అదే మిగిలి ఉందని తెలిపారు. భారత్, చైనా.. అమెరికాతో కలిసి వస్తే పుతిన్ చేస్తున్న యుద్ధానికి చెక్ పెట్టవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంధన విధానంపై భారత్, అమెరికాల మధ్య ఘర్షణ ఉన్నప్పటికీ యూఎస్‌కు భారత్ సన్నిహిత భాగస్వామి అని ట్రంప్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ తనకు స్నేహితుడని, తమ మధ్య గొప్ప అనుబంధం ఉందని చెప్పొకొచ్చారు. నేను చాలా ఏండ్లుగా భారత్‌ను గమనిస్తున్నానని, అది అద్భుతమైన దేశమని చెప్పారు. గతంలో ప్రతి ఏడాది కొత్త నాయకుడు వచ్చేవారు. కొందరు కొన్ని నెలలకే మారిపోయేవారన్నారు. కానీ ఇప్పుడు తన మిత్రుడు చాలా కాలంగా అక్కడ అధికారంలో కొనసాగుతున్నారని వెల్లడించారు. మోదీ నాయకత్వంలో రాజకీయంగా స్థిరత్వం సాధించిందని వ్యాఖ్యానించారు.ఇదిలాఉండగా భారత్-పాకిస్థాన్ కాల్పుల విరమణకు సంబంధించి ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. యుద్ధం ఆపకపోతే 200శాతం టారిఫ్‌లు విధిస్తానని ఈ దేశాలను తాను హెచ్చరించానని అన్నారు. వాణిజ్యంతోనే తాను భారత్-పాక్ ఉద్రిక్తతలను తగ్గించానని తెలిపారు. ఓ డిన్నర్ ఈవెంట్‌లో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా భారత్‌కు కొత్తగా నియమితులైన అమెరికా రాయబారి సెర్గియో గోర్ గురించి ఆయన ప్రస్తావించారు. 'గోర్ గొప్పగా పనిచేస్తున్నారు. ఆయన భారత్‌లో అమెరికాకు మంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

## పాక్‌తో చెలిమి కోసం ట్రంప్ ఆరాటం

- భారత్‌లో సంబంధాలు దెబ్బతీసుకుంటున్నారు
- అమెరికా మాజీ రాయబారి రహమ్ ఇమాన్యుయేల్ వ్యాఖ్యలు

**వాషింగ్టన్, అక్టోబర్16( వెలుతురు):**
పాక్‌తో చెలిమి కోసమే ట్రంప్ ఆరాటం అని, అందుకు భారత్‌తో చెలిమిని వదులుకుంటున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆ దేశ మాజీ రాయబారి ఒకరు సంచలన ఆరోపణలు చేశారు. పాకిస్థాన్ సొమ్ము కోసం ట్రంప్ అహంభావంతో వ్యవహరిస్తున్నారన్నారు. అందుకోసం భారత్-అమెరికా సంబంధాలను కూడా చెడగొట్టారని ఆరోపించారు. జపాన్‌కు అమెరికా మాజీ రాయబారి రహమ్ ఇమాన్యుయేల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. చైనాను ఎదుర్కోవడంలో అగ్రరాజ్యానికి భారత్ అత్యంత కీలకమైన భాగస్వామి. ఆ విషయాన్ని గుర్తించకుండా అధ్యక్షుడు ట్రంప్ అహం చూపిస్తున్నారు. 40ఏళ్ల వ్యూహాత్మక ప్రణాళికను, దౌత్య సంబంధాలను ఆయన వదులు కుంటున్నారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ చేసింది తానేనంటూ ట్రంప్ చేసిన వాదనను భారత ప్రధాని మోదీ అంగీకరించడం లేదు. ఇక, పాక్ నుంచి ట్రంప్ కుమారుడికి భారీ మొత్తంలో డబ్బు అందుతోంది. ఈ కారణాల వల్లే భారత్-అమెరికా సంబంధాలను ట్రంప్ చెడగొడుతున్నా రు. ట్రంప్ చేసిన ఈ భారీ తప్పిదాన్ని చైనా తమకు అనుకూలంగా మార్చుకుంటోందని ఇమాన్యుయేల్ ఆరోపించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్‌తో, అమెరికా వ్యాపారవేత్త జాక్ విట్కాఫ్ మధ్య బిజినెస్ డీల్ జరిగింది. విట్కాఫ్ కంపెనీలో ట్రంప్ కుమారుడు జూనియర్ ట్రంప్, అల్లుడు జేర్డ్ కుష్నర్ వాటాదారులుగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దీన్ని ఉద్దేశిస్తూనే ఇమాన్యుయేల్.. ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. ఇమాన్యు యేల్ గతంలో ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేశారు.

## మహిళా కోచ్ లో మగాళ్ళను ఎలా అనుమతిస్తారు..?

- రైలు ప్రయాణీకురాలిపై అత్యాచార ఘటన బాధాకరం
- గుంటూరు-పెదకూరపాడు స్టేషన్ల మధ్య ఘటనపై స్పందించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ

**అమరావతి అక్టోబర్16( వెలుతురు):**
రైళ్ళల్లో మహిళలకు కేటాయించిన కోచ్ లలో మగాళ్ళను ఎలా అనుతిస్తారని ఏపీ మహిళా కమిషన్ డాక్టర్ రాయపాటి శైలజ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సంత్రగాచి స్పెషల్ రైలులో ప్రయాణిస్తున్న మహిళా ప్యాసింజర్ పై గుంటూరు, పెదకూరపాడు రైల్వే స్టేషన్ల మధ్య జరిగిన అత్యాచార ఘటనపై బుధవారం ఆమె స్పందించారు. ఘటన చాలా బాధాకరమన్నారు. ఈమేరకు ఘటన పూర్వాపరాలను గుంటూరు ఆర్పీఎఫ్ అధికారులతో మాట్లాడి చర్యలనిమిత్తం మహిళా కమిషన్ అధికారులను ఆమె ఆదేశించారు. దీంతో కార్యాలయ అధికారులు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ తో ఫోన్ లో సంప్రదించగా.. ఓ మహిళ రాజమహేంద్రవరంలో సంత్రగచి ప్రత్యేక ఎక్స్ప్రెస్ ట్రైన్లో చెర్లపల్లి దాకా ప్రయాణించడానికి ఎక్కగా.. ట్రైన్ గుంటూరు స్టేషన్లో ఆగిన సమయంలో, 40 సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి మహిళా కోచ్లోకి ప్రవేశించాడని.. ఆగంతకుడు మహిళను కత్తితో బెదిరించి అత్యాచారానికి పాల్పడినట్లు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు అందిందన్నారు. బాధితురాలి వద్దనున్న నగదు (రూ.5600) మరియు మొబైల్ ను దోచుకున్నట్లు



..పెదకూరపాడు స్టేషన్ దగ్గర రైలులోంచి దూకి పరారైనట్లు బాధితురాలు ఫిర్యాదిచ్చినట్లు చెప్పారు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు చేసి, కేసును నడికుడి పోలీస్ స్టేషన్కు బదిలీ చేసినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడానికి పోలీసు బృందాలు దర్యాప్తు చేపట్టాయని.. బాధితురాలు చెబుతున్న ప్రకారం గుంటూరు, పెదకూరపాడు రైల్వేస్టేషన్ ల మధ్య మొబైల్ ట్రాక్ లోకేషన్లు, సీసీ ఫుటేజీలు, ఇతర సాంకేతికత ద్వారా నిందితుడ్ని పట్టుకునేందుకు చర్యలు చేపట్టామని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు చెప్పారు.

**డీఆర్ఎం, ఆర్పీఎఫ్ ఎస్పీలకు లేఖలు:**

తక్షణమే ఈ కేసుపై వేగవంతమైన దర్యాప్తును ప్రారంభించి నేరస్తుడిని అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులను కోరారు. ఈమేరకు గుంటూరు రైల్వేస్టేషన్ డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం)కు, విజయవాడ రైల్వే సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఎస్పీ), డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే సెక్యూరిటీ ఫోర్స్, గుంటూరు వారికి మహిళా కమిషన్ ద్వారా బుధవారం లేఖలు పంపారు. మహిళా ప్రయాణికుల భద్రతను నిర్ధారించే చర్యలు వేగవంతం చేయాలన్నారు. మహిళా కంపార్ట్మెంట్లో మహిళా కానిస్టేబుళ్లను డ్యూటీకి నియమించాలని, మహిళల కోచ్ లలో ప్రయాణించడానికి ప్రయత్నించకుండా పురుషులను నిరోధించడానికి ఆర్పీఎఫ్ క్రమం తప్పకుండా డ్రైవ్లను నిర్వహించాలని కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ కోరారు. రైళ్లలో ప్రయాణీకులకు సంబంధించిన భద్రతా లోపాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి చర్యలు చేపట్టాలన్నారు. ఒంటరి మహిళా ప్రయాణీకుల భద్రతపై మరింత నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. సంత్రగాచి స్పెషల్ ఎక్స్ప్రెస్ లో జరిగిన ఘటనపై పూర్తి దర్యాప్తు అనంతరం కమిషన్ కు నివేదిక పంపాలని లేఖలో ఆమె కోరారు.

## మల్లోజుల ఆయుధం ఎందుకు వదిలారు

**ముంబై, అక్టోబర్16( వెలుతురు):**
మావోయిస్టు విప్లవోద్యమ చరిత్రలో దాదాపుగా ఒక శకం ముగిసినట్టే. మావోయిస్టు దళంలో కీలక నాయకుడిగా పని చేసిన మల్లోజుల వేణుగోపాల్ రావు ఆయుధాన్ని పక్కన పెట్టారు. ఇన్ని రోజులపాటు అడవిలో అన్నగా వెలుగొంది న అతడు ఇకపై జనజీవన స్రవంతిలో కనిపించబోతున్నాడు. దశాబ్దాలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్ గడ్, బీహార్ రాష్ట్రాలలోని అటవీ ప్రాంతాలలో తలదాచుకుని.. సమాంతర ప్రభుత్వాలు నిర్వహించిన అతడు.. ఇకపై సెలవంటూ ఆయుధాన్ని వదిలిపెట్టాడు. ఉద్యమం ఎక్కడుందో.. అక్కడే నీ కూడు ఉందని నినాదాలు చేసిన అతడు.. ఇప్పుడు జనజీవన స్రవంతిలో కలిసిపోయాడు.మల్లోజుల వేణుగోపాలరావు దాదాపు 40 సంవత్సరాలపాటు పోరాటం చేశాడు. దట్టమైన అడవులను కేంద్రంగా చేసుకొని ఉద్యమాలు చేశాడు. ఎన్నో హింసాత్మక ఘటనలలో పాలుపంచుకున్నాడు. సాధారణ మావోయిస్టుగా దళంలోకి ప్రవేశించిన అతడు దినదిన ప్రవర్తమానంగా ఎదిగాడు. ఏకంగా కేంద్ర కమిటీ ని శాసించే స్థాయికి ఎదిగాడు. 1981లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన అతడు ఏటూరు నాగారం దళసభ్యుడిగా ఆయుధాన్ని చేత పట్టుకున్నాడు. పార్టీలో అంతకంతకు విరిగిపోయాడు. 1983లో డికేస్ జడ్పీ సభ్యుడిగా.. 1995లో కేంద్ర కమిటీ సభ్యుడిగా.. 2005లో పొలిటి బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యాడు. గడచిన నాలుగు దశాబ్దల కాలంలో ఎన్నో హింసాత్మక ఘటనలలో పాలుపంచుకున్నాడు.. రాష్ట్ర




పోలీసులకు, కేంద్ర దళాలకు కొరకరాని కొయ్యగా మారిపోయాడు.ఇటీవల కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. ఇందులో భాగంగా ఎంతోమంది మావోయిస్టులను అంతం చేసింది. దట్టమైన అడవులలో మావోయిస్టుల ఆనవాళ్లు లేకుండా చేస్తోంది. మావోయిస్టులకు పట్టు ఉన్న ప్రాంతాలలో కేంద్ర బలగాలు విస్తృతంగా దాడులు చేస్తున్న నేపథ్యంలో వారికి ఆవాసం అనేది లేకుండా పోయింది. దీంతో మావోయిస్టులు తుపాకులను పక్కన పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందువల్ల ఇటీవల హిడ్మా పేరుతో ఒక లేఖ విడుదలైంది. తుపాకులను వదిలిపెడతామని ఆ లేఖలో హిడ్మా పేర్కొన్నాడు. దీనిపై మావోయిస్టులలో భిన్న స్వరాలు వినిపించాయి. మావోయిస్టు సానుభూతిపరులు కూడా హిడ్మా లేఖను తప్పు పట్టారు. దీంతో మావోయిస్టులు తుపాకులను పక్కన పెట్టడం సాధ్యం కాదని అర్థమయిపోయింది. ఈ నేపథ్యంలోనే వేణుగోపాల్ రావు 60 మంది దళసభ్యులతో లొంగిపోతున్నట్టు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. . మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో వేణుగోపాలరావు తన 60 మంది దళ సభ్యులతో కలిసి లొంగి పోయారు. జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నట్టు ప్రకటించారు. దీంతో మావోయిస్టు ఉద్యమానికి ఎదురు దెబ్బ తగిలినట్టు అయింది. ఈ క్రమంలోనే మావోయిస్టులు ఇకపై జనజీవన స్రవంతిలో కలుస్తారని తెలుస్తోంది. కేంద్రం కూడా మావోయిస్టులతో శాంతి చర్చల ప్రసక్తి లేదని స్పష్టం చేసింది. అటు కేంద్ర బలగాలు ముప్పేట దాడి చేస్తున్న నేపథ్యంలో ఊపిరి ఆడని పరిస్థితి మావోయిస్టులకు ఏర్పడింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మావోయిస్టులు తుపాకులను పక్కన పెడుతున్నారు. వేణుగోపాలరావు జనజీవన స్రవంతిలో కలిసిన తర్వాత.. ప్రజా సమస్యల పరిష్కారానికి వేరే విధమైన ఉద్యమాలను చేపడతామని పేర్కొన్నారు. కాకపోతే అది శాంతియుత విధానంలో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- కారును ట్రక్కు ఢీకొనడంతో మంటలు
- మంటల్లో నలుగురు సజీవ దహనం

**జయపుర, అక్టోబర్16( వెలుతురు):**
రాజస్థాన్‌లో బార్మర్ జిల్లాలో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్కార్పియో కారు ఓ ట్రక్కు ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి.. కారులో ఉన్న నలుగురు సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటనలో మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అతన్ని స్థానికులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడమలానీ తహసీల్‌లోని డాబర్ గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు పని నిమిత్తం సింధారీకి వెళ్లారు. పని ముగించుకుని అర్ధరాత్రి దాటాక తమ స్కార్పియో వాహనంలో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. వారి గమ్యస్థానానికి ఇంకా 30 కిలోమీటర్ల దూరంలో ఉండగా, సింధారీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సదా గ్రామ సమీపంలో మెగా హైవేపై ఎదురుగా వస్తున్న ఓ ట్రైలర్‌ను వారి కారు బలంగా ఢకొ?ట్టింది. ప్రమాదం జరిగిన తీరు ఎంత తీవ్రంగా ఉందంటే, ఢకొ?న్న వెంటనే కారులో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

దీంతో లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. ఈ ఘటనలో మోహన్ సింగ్ (35), శంభు సింగ్ (20), పంచారామ్ (22), ప్రకాశ్ (28) అనే నలుగురు యువకులు తీవ్రమైన గాయాలతో అక్కడికక్కడే మంటల్లో కాలిపోయి మరణించారు. కారు నడుపుతున్న దిలీప్ సింగ్ ప్రాణాలతో బయటపడ్డాడు. అతడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## లింగంపల్లి గ్రామం సప్తగిరి ఫామ్ హౌస్ లో రేవ్ పార్టీని భగ్నం చేసిన మంచాల పోలీసులు

**- సంఘటన స్థలాన్ని సందర్శించిన ఇబ్రహీంపట్నం ఎసిపి, కే పి వి రాజు**



**మంచాల వెలుతురు అక్టోబర్ 16:**
మంచాల మండలం లింగం పల్లి గ్రామంలోని సప్తగిరి ఫామ్ హౌస్ లో బుధవారం రాత్రి కిట్టి పార్టీ పేరుతో గుట్టు చప్పుడు కాకుండా రేవ్ పార్టీ ఏర్పాటు చేశారు రేవ్ పార్టీలో నగరం నుండి 25మంది యువత యువకులు పాల్గొన్నారు బుధవారం రాత్రి ఒక్కసారిగా కార్లలో సప్తగిరి ఫామ్ హౌస్ లోకి వచ్చారు రేవ్ పార్టీ జరుగుతున్నట్టు పక్కా సమాచారంతో మంచాల పోలీస్ స్టేషన్,ఎస్ఐ నాగేశ్వరరావు పోలీస్ సిబ్బందితో కలిసి పామ్ హౌస్ వద్దకు చేరుకొని రేవ్ పార్టీ పైదాడి చేసి భగ్నం చేసి 25మందిని అదుపులోకి తీసుకున్నారు వీరిలో 8మంది యువతులు ఉన్నారు వీరి నుండి 2లక్షల 45వేల రూపాయలు 11కార్లు 25 మొబైల్స్ మూడు మద్యం ఫుల్ బాటిల్స్ 18 బీరుబాటిల్స్ లను స్వాధీనం చేసుకున్నారు పట్టుబడిన కార్లలో ఒకకారుకు ఎమ్మెల్సీ స్టిక్కర్ ఉన్నట్టు సమాచారం ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

## తపస్ ఉపాధ్యాయ సంఘంలో చేరిన మ్యాస్ ఉపాధ్యాయుడు కాలే శ్రీశైలం



**మంచాల వెలుతురు అక్టోబర్ 16:**
మంచాల మండలం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో ఎస్ ఏ మ్యాస్ ఉపాధ్యాయుడుగా గా పనిచేస్తున్న మంచాల గ్రామానికి చెందిన కాలే శ్రీశైలం గురువారం రోజు తపస్ రాష్ట్ర అధ్యక్షులు కానుగంటి హనుమంతరావు మరియు జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు కోట్ల కాశిరావు మరియు పూజరి రమేశ జిల్లా గౌరవ అధ్యక్షులు ఘనపురం సురదీర్ ఆధ్వర్యంలో తపస్ సభ్యత్వం స్వీకరించి సంఘంలో చేరడం జరిగింది అనంతరం ఈ సందర్భంగా తపస్ బృందం శ్రీశైలం సార్ కి తపస్ డైరీ అందజేసి స్వాగతం పలకడం జరిగింది అదేవిధంగా శ్రీశైలం మాట్లాడుతూ సంఘ కార్యక్రమాలో చురుగ్గా పాల్గొంటూ సంఘ బలోపేతం కోసం తనవంతు కృషిచేస్తానని అన్నారు ఈకార్యక్రమంలో తపస్ శేరిలింగంపల్లి మండలశాఖ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు రామచంద్రయ్య మన్నెంకొండ మరియు తపస్ సంఘ జిల్లా మండల బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి అంజన్ రెడ్డి, జగదీశ్వర్, రమేష్, నాగయ్య బాపురెడ్డి శంకర్ పల్లి మండల ప్రధానకార్యదర్శి కవ్వగూడెం శ్రీనివాస్ మరియు మంచాల మండల అధ్యక్షులు రావుల శివకుమార్

## మంచాల ప్రాథమిక పాఠశాలలో వీడియో ప్రొజెక్టర్ ప్రారంభించిన ఎంఈఓ రాందాస్



**మంచాల వెలుతురు అక్టోబర్ 16:**
మంచాల మండలం కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో రెడ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు అయిన మంచాల మండల ఎంఈఓ రాందాస్ దాతల సహకారంతో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ ను అలాగే వీడియో ప్రొజెక్టర్ ను ప్రారంభించారు ఈసందర్భంగా ఎంఈఓ రాందాస్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని దాతలు పాఠశాలకు అన్ని రకాలుగా సహాయం చేయడం చాలా సంతోషకరం అన్నారు ఈకార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రుబియాన, జిల్లాప్రజాపరిషత్, పాఠశాల ఇంచార్జ్, ప్రధానఉపాధ్యాయుడు యండి సలీంఖాన్, ఉపాధ్యాయులు తుల్జారాంగ లేడీస్, జిల్లాపరిషత్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఝాన్సీ సిఆర్ పిలు పాఠశాల ఉపాధ్యాయులు సుమలత దివ్య, సాయికుమార్ యాదయ్య గీత మాజీ కోఆప్షన్ నెంబర్ అశ్వల బాలరాజు తదితరులు పాల్గొన్నారు

## బీసీ బంద్ కు కాంగ్రెస్ మద్దతు

**- ఈనెల 18న బీసీలు శాంతియుతంగా బంద్ జరపాలి**

**- బీసీ నేత లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:**
ఈనెల 18 వ తేదీన జరిగే బిసి బంద్ కు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్లో రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారిని తో బిసి జేఏసి నేతలు ఆర్ కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్, విజిఆర్ నారగోని ఇతర బీసీ నేతలు కనకాల శ్యామ్ కూర్మ వరికుప్పల మధు గూడూరు భాస్కర్ గురువారం రోజున హైదరాబాద్ లో వారిని కలిసి బంద్ కు మద్దతు కోరడం జరిగింది. ఈ సందర్భంగా ఈనెల 18 న జరిగే తెలంగాణ రాష్ట్ర బంద్ కు మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీకి ధన్యవాదాలు



తెలియజేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్ పేర్కొన్నారు. బంద్ ను బీసీలు శాంతియుతంగా జరపాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు

## సిపిఆర్ పై డాక్టర్స్ కు, పారామెడికల్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం






**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:**
అత్యవసర పరిస్థితులలో ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడే సి పి ఆర్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్. ప్రొఫెసర్ మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గాంధీ మెడికల్ కాలేజ్, సికింద్రాబాద్,అలుమ్ని సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన సిపిఆర్ అవగాహన సదస్సులో జక్కుల రాములు , జిల్లా మీడియా అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వారితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు CPR అవగాహన వారోత్సవాలలో భాగంగా ఈరోజు ఈ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఆసుపత్రుల మెడికల్ సూపరింటెండెంట్, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది 60 మంది పాల్గొన్నారు. డాక్టర్. వెంకటి జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు సిపిఆర్ పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి సిపిఆర్ పై అవగాహన కల్పించడం జరిగిందని అతను తెలిపారు. అలాగే కార్డియోపల్మనరీ రిససిటేషన్ (CPR) పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉన్నట్లయితే అత్యవసర పరిస్థితుల్లో వ్యక్తులు ప్రాణాలను ఎలా కాపాడగమో అనే విషయాన్ని గ్రహిస్తే , ఆపదలో ఉన్న వ్యక్తిని రక్షించుటకు వీలు కలుగుతుందని అన్నారు . ప్రొఫెసర్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వ్యక్తి శ్వాస తీసుకోవడం లేదా గుండె కొట్టుకోవడం మందగించినప్పుడు చేసే అత్యవసర ప్రథమ చికిత్స. గుండెపోటు, లేదా ఇతర అకస్మాత్తుగా సంభవించే సంఘటనల వంటి అత్యవసర పరిస్థితులలో CPR చేయడం చాలా ముఖ్యమని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని, ప్రజలకు CPR పద్ధతులను నేర్పడంతో తద్వారా అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా స్పందించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో Dr చైతన్య, Dr . శ్రీనివాసరావు , మెడికల్ సూపరింటెండెంట్,





గోల్కొండ ప్రభుత్వ ఆస్పత్రి, Dr , శ్రీధర్ బాబు, డిప్యూటీ సివిల్ సర్జన్, డాక్టర్ అరుణ్ కుమార్, హరిప్రియ, ప్రజ్ఞ, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచుల పెండింగు బిల్లుల విడుదలకు సిఫారసు చేయండి

### సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:**
తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 12769 గ్రామ పంచాయతీలలో ఐదు సంవత్సరాల పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి గ్రామాలను అభివృద్ధి చేసిన సర్పంచుల పెండింగ్ బిల్లులను ఇప్పించే విధంగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో గురువారం రోజున తెలంగాణ రాష్ట్ర పోలీసు కార్యాలయంలో డీజీపీ శివధర్ రెడ్డి గారిని కలిసి విజ్ఞాపన చేశారు. గ్రామాలలో సర్పంచులు అప్పులు చేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1200 కోట్ల రూపాయల బిల్లులు పెండింగులో ఉన్నాయని, బిల్లులు అందక సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని డీజీపీకి వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు కావస్తున్న ఇంకా బిల్లులు చెల్లించకపోవడంతో తాజా మాజీ సర్పంచులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని డీజీపికి వివరించినట్లు



తెలిపారు. పెండింగు బిల్లుల విడుదలకు అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం నుండి స్పందన కరువైందని తెలిపారు.తాజా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేసే విధంగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు పత్యా నాయక్, ముథోల్ మాజీ సర్పంచ్ రాజేందర్, వరికుప్పల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణ నగర్ కాలనీలో అభివృద్ధి పనులను ప్రారంభించిన నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్ వెలుతురు అక్టోబర్ 16:**
ఎల్ బి నగర్ అసెంబ్లీ, హయత్ నగర్ డివిజన్, శ్రీ రామ కృష్ణా నగర్ కాలనీ అభివృద్ధి పనుల కార్యక్రమం ప్రారంబోశ్చవానికి హయత్ నగర్ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి, సాయినగర్ గ్రామ మాజీ సర్పంచ్ గౌని దాస్ గౌడ్, రఘు గౌడ్ బొంగు, పులుసాని జీవన్ రెడ్డి విచ్చేసి వాటర్, డ్రైనేజ్, రోడ్డు లను ప్రారంభించారు. అనంతరం కాలని పెద్దలు అతిథులను సన్మానించి, అనుకున్న సమయం కంటే ముందే పనులు ముగించే విధంగా కృషి చేసిన జీవన్ రెడ్డి కి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియ తెలిపారు. కార్యక్రమం లో బొంగు రఘు గౌడ్, సద్గుణ రావు, రామ్ రెడ్డి, చంద్రయ్య గౌడ్, బొబ్బిలి శ్రీను, రఘు మోహన్ రెడ్డి, మల్లయ్య గౌడ్ గారు, సైదాచారి, శ్రీను, రామలింగం గౌడ్ , అశోక్, సోమయ్య, సంతోష్ రెడ్డి, శివ, మోక్షజ్ఞ గౌడ్ మరియు మహిళలు పాల్గొన్నారు,

## ఈనెల 18న తెలంగాణ బంద్‌కు ఎస్సీ,ఎస్టీ విద్యార్థి బహుజన సంఘాల మద్దతు

**- ఉస్మానియా యూనివర్సిటీ లోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ సంఘాల సమావేశం**

**- బంద్ కు అన్ని వర్గాల వ్యాపార సంస్థలు విద్యాసంస్థలు సహకరించాలి.**

**- బీసీ నేత లింగం గౌడ్ విజ్ఞప్తి**





**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:**
ఈనెల 18న తెలంగాణ రాష్ట్ర బంద్ ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 18న జరిగే తెలంగాణ బంద్ కు మద్దతుగా ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఎస్సీ ఎస్టీ విద్యార్థి మరియు బహుజన సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ ఈ రాష్ట్ర బంద్ ద్వారా బీసీల ఐక్యతను చైతన్యాన్ని చాటి చెప్పాలని బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని దేశానికి వినిపించడం కోసమే బంద్ చేయాల్సి వస్తుందని బీసీలకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపేది లేదని ఆయన హెచ్చరించారు. బీసీలకు న్యాయబద్ధంగా రావలసిన రిజర్వేషన్లను కోర్టులను వేదికలుగా చేసుకొని అగ్రకులాలు అడుగడుగునా అడ్డుకుంటున్నారని, ఇది ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. బీసీల ఆత్మభిమానాన్ని దెబ్బతీస్తూ బీసీల రిజర్వేషన్లను తగ్గించాలని కుట్రలు చేసే వాళ్లకు బుద్ధి చెప్పేలా బీసీలు ఉద్యమించే సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఈరెంటి విజయ మాదిగ ఎమ్మెస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, గద్దల అంజిబాబు ఓయు జెఏసి, నూకమల్ల వీరస్వామి మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ గౌడ్ తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు టిఎంఎస్ఎఫ్ స్టేట్ ప్రెసిడెంట్, నామ సైదులు హంస ఓయూ అధ్యక్షులు జి నర్సింహులు ఎమ్మెస్ ఎఫ్.టి రాష్ట్ర అధ్యక్షులు డి సంజీవ ఎంఎస్సీ రాష్ట్ర అధ్యక్షులు ఓంకార్ సాయి రవికిరణ్ బాలకృష్ణ రవీందర్ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మచ్చ ప్రభాకర్ జయంతి



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:**
తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షులు మచ్చ ప్రభాకర్ 63వ జయంతి కార్యక్రమాన్ని గురువారం నారాయణగూడ పద్మశాలి భవన్లో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు మరియు సెక్రటరీ జనరల్ కందగట్ల స్వామి, గడ్డం జగన్నాథం లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు తిరిగి పద్మశాలి సంఘం బలోపేతానికి కృషి చేశారని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా. పద్మశాలీలను రాజకీయంగా బలోపేతం చేయడానికి రాజకీయ శంఖారావం అనే భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి విజయవంతం చేశారన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జెంట్స్ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జనరల్ సెక్రెటరీ మాచర్ల రామచంద్రరావు, అఖిల భారత పద్మశాలి సంఘం కోశాధికారి , కొక్కుల దేవేందర్ అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం జాతీయ ఇంచార్జ్ అవ్వాలి భాస్కర్, రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షులు బొల్ల శివశంకర్, అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ కార్యదర్శి బొడ్ల తిరుపతి, ఇట్టే ప్రభాకర్, బీసీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెడుకు మణికంఠ నేత,

## ఐడీఎస్ఎంటీ కాలనీ బాధితుల ఆందోళన

**- మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసి బాధితుల ధర్నా...**

**- పోలీసుల అదుపులోకి ఆందోళనకారులు, మహిళ స్పృహ తప్పి ఆసుపత్రికి తరలింపు....**

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో IDSMT కాలనీ బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి, కార్యాలయానికి తాళం వేసి కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. 158 సర్వే నెంబర్‌లో 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న IDSMT కాలనీలో తమ ప్లాట్లు, ఇండ్లు ప్రైవేట్ వ్యక్తులు బుల్డోజర్లతో కూల్చివేస్తున్నా అధికారులు స్పందించడం లేదని బాధితులు ఆరోపించారు. 25 సంవత్సరాల క్రితం ప్రభుత్వం డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసిన స్థలాలు ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తులు మాదంటూ హక్కు చెలాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రోడ్లు, మురికి కాలువలు, మిషన్ భగీరథ పైపులైన్‌లు, విద్యుత్ స్తంభాలను కూడా ధ్వంసం చేస్తున్నా అధికారులు మౌనంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ధర్నా నేపథ్యంలో పోలీసులు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు, నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ క్రమంలో చోటు చేసుకున్న తోపులాటలో ఓ మహిళ స్పృహ తప్పి కుప్పకూలగా, ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు నామరవి కిరణ్ మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని అన్యాయం ఆపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ తంజీమ్, నాయకులు వెంకటేశం గుప్తా, నర్సింహారెడ్డి, వెంకట్ సాగర్ తదితరులు బాధితులకు మద్దతు తెలిపారు.

## నేడు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం...

**కూకట్ పల్లి అక్టోబర్ 16 వెలుతురు:**
కెపిహెచ్బి కాలనీ లోని సర్దార్ పటేల్ నగర్ 20వ రోడ్ లో నేడు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మందలపు సాయి బాబు చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు.



బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ వారి సహకారంతో ఈ క్యాంపు ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా కాలనీ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆసక్తి గలవారు తొలుత ఈ నెంబర్ లో సంప్రదించి 9346678842 పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

# దేవి రెడ్డి రామిరెడ్డి జ్ఞాపకార్థం ఉచిత కంటి పోర చికిత్స శిబిరం

**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 16**



మండలం మునిపంపుల గ్రామంలో దేవిరెడ్డి రామిరెడ్డి జ్ఞాపకార్థం ఈనెల 22 నుండి 28 వరకు ఉచిత కంటి పొర చికిత్స శిబిరం గ్రామంలోని భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్ దేవి రెడ్డి సావిత్రమ్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిస్నాతులైన కంటి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వారికి కంటి అద్దాలను ఉచితంగా అందజేయడంతోపాటు కంటి శుక్లాం (పొర) ఉన్నవారికి ఆపరేషన్ ను కూడా ఈనెల 26 నుండి 30 వరకు ఆపరేషన్ నిర్వహిస్తారని ఆమె తెలిపారు. మునిపంపుల గ్రామ ప్రజలతోపాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాల కోసం తోలుపునూరు చంద్రశేఖర్ 83090 02045, బొడ్డుపల్లి వెంకటేశం 95504 25433 ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

# విద్యార్థులకు ఫన్ మరియూ స్పీడ్ మాథ్ పై అవగాహన కార్యక్రమం.



**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 16**

మండలంలోని మునిపంపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం రోజు తెలుగు విశ్వ విద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్, గణితావధాని ఈ.చంద్రయ్య విద్యార్థులకు ఫన్ మ్యాథ్, స్పీడ్ మ్యాథ్, బేసిక్స్, ఈజీ మ్యాథ్ పై అవగాహన కల్పించారు. మ్యాథ్ అంటే భయం పోగొట్టేలా, కాంపిటీషన్ ఎగ్జామ్ లలో , నిత్యజీవితంలో మ్యాథ్ సులభంగా చేయడం, బేసిక్స్ పై శిక్షణనిచ్చి వారిచే గణితం చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మ్యాథ్స్ పై భయం వదిలి ఇష్టంతో సులభంగా మ్యాథ్ చేయాలని పాఠశాల గెజిటెట్ ప్రధానోపాధ్యాయులు దొడ్డి స్వామి కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు అబ్దుల్ కరీం, ఉపాధ్యాయులు కుక్కడపు రమేశ్, తిరుమల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, వసంత, మనోహర్ మంజుల, త్రివేణి ప్రసాద్, మంజుల, సరోజ, పాల్వంచ హరికిషన్, గణేశ్ విద్యార్థులు, పాల్గొన్నారు.

# రైతులు సూచనలు పాటించాలి.

**- రామన్నపేట వ్యవసాయ అధికారి ఏజాజ్ అలిఖాన్**



**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 16**

మండల వ్యాప్తంగా రైతులు వరి కోత మిషన్ ఓనర్స్ డ్రైవర్స్ గమనించగలరు.వరి చేను పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాత మాత్రమే కోయాలి. (తాలు లేకుండా ఉంటుంది) కోత మిషన్ ఉపయోగించే సమయంలో బ్లోయర్ ఆన్ లో ఉండాలి.కోత మిషన్ యొక్క ఆర్పిఎం 19 టు20 కు పై ఉండాలి.గేర్ స్పోర్ట్ ఏ టు నుంచి బి వన్ లో పెట్టి కోతకోయించాలి. అని పత్రికా సమావేశంలో తెలిపినారు.

# జహీరాబాద్ ఐడీఎస్ఎంటీ కాలనీలో ఇళ్ల కూల్చివేతపై బాధితుల ఫిర్యాదు



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 158లో ఉన్న ఐడీఎస్ఎంటీ కాలనీలో ఉద్రిక్తత నెలకొంది. ప్రభుత్వం కేటాయించిన ప్లాట్లలో నిర్మించిన ఇళ్లను కొంతమంది వ్యక్తులు బుల్డోజర్లతో కూల్చివేస్తున్నారని బాధితులు ఆరోపించారు. ఈ ఘటనపై బాధితులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వినయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



**నల్గొండ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కార్యాలయంలో ఏసీబీ దాడులు.. రూ.8 వేలు లంచం తీసుకుంటు ఏసిబి కి చిక్కిన నల్గొండ స్టేషన్ ఫైర్ అధికారి సత్యనారాయణ రెడ్డి. క్రాకర్ షాప్ యజమాని వద్ద లంచం తీసుకుంటు ఏసీబీ వలకు చిక్కిన అధికారి.**

నల్లగొండ వెలుతురు అక్టోబర్ 16:

# పత్తి సోయా కొనుగోలు త్వరితగతిన చేపట్టాలి

## ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్ వెలుతురు అక్టోబర్ 16:**

రైతులు పండించిన పత్తి, సోయా పంట కొనుగోళ్ళను సరిత గతిన ప్రారంభించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పత్తి కొనుగోళ్లపై బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహజన్ తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. లికేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్ గురించి పూర్తి స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు, రైతులు సైతం కపాస్ కిసాన్ యాప్ లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ ద్వారా రైతులకు కొనుగోళ్లలో ఇబ్బందులను తొలగించడం జరుగుతుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ యార్డులో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు మద్దతు ధర లభించాలనే ఉద్దేశంతోనే సిసిఐతో త్వరలో కొనుగోలు ప్రారంభించడం జరుగుతుందన్నారు.





# సహకార కుబేర డిపాజిట్ల సేకరణ మహోత్సవ కార్యక్రమం

**మునుగోడు వెలుతురు అక్టోబర్ 16:**



నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచ్ మునుగోడు ఆధ్వర్యంలో ఈరోజు సహకార కుబేర డిపాజిట్లు సేకరణ మహోత్సవ కార్యక్రమంలో నల్గొండ జిల్లా డిసిసిబి చేర్మెన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి ప్రారబించినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 16-10-205 నుండి 30-11-2025 వరకు 222 రోజులు సహకార కుభేర డిపాజిట్లు చేసిన వారికి బ్యాంకు ద్వారా 7.5% మరియు సీనియర్ సిటిజన్ వారికి 8.15% వడ్డీ రేటు అందిస్తుంది. ఇతర వాణిజ్య బ్యాంకుల కన్నా డిపాజిట్ లపై అత్యధికంగా వడ్డీ రేట్లు అందించే ఏకైక బ్యాంకు సహకార కేంద్ర బ్యాంక్ అని ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా బ్యాంకు ద్వారా పంట రుణాలు, మార్టిగేజ్ రుణాలు, బంగారం తాకట్టు రుణాలు, వ్యవసాయ భూమి తాకట్టు పెట్టుకొని ఇంటి నిర్మాణము రుణాలు, మరియు మహిళ సంఘాల రుణాలు బ్యాంకు ద్వారా అందిస్తున్నామని మండల ప్రజలు ఇట్టి అవకాశన్ని వినియెగించుకొవలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మేనేజర్ రాగిణి, సూపర్వేజర్ నరేష్,అకౌటెంట్ ఆసినా,ఎమ్ నిఖిత మరియు సంఘ కార్యదర్శి సుఖేందర్, సిబ్బంది అశోక్




రెడ్డి, పురుషోత్తం, స్వామినాధ్, లింగస్వామి, అటెండర్ రైతులు ఖాతదారులు పాల్గొన్నారు.

# ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన నల్గొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి

**మునుగోడు వెలుతురు అక్టోబర్ 16:**

మునుగోడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పి పి సి సెంటర్ పులిపల్పుల, కల్వలపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం





రోజున నల్లగొండ జిల్లా డిసిసిబి చేర్మెన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించినారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలలో దాన్యం అమ్ముకొవాలని దళారులకు అమ్ముకొని మోసపోవద్దు అని అన్నారు. అలాగే రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే దాన్యం తేమ శాతం 17% ఉండే విధంగా తాలు, మట్టి, పెల్లా లేకుండా శుభ్రంగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వమిచ్చే మద్దతు ధర గ్రేడ్ " ఏ " 2389 రూపాయలు సాధారణ 2369 రూపాయలు మరియు సన్న వరి ధాన్యానికి 500 రూపాలు బోనస్ అందిస్తుందని ఇట్టి అవకాశాన్ని రైతులు వినియెగించుకోవాలని తెలిపారు. రైతులు నిబంధనలను పాటించి ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చేర్మెన్ దోటి నారాయణ, ఎంపిడిఓ యుగేందర్, మానిటరింగ్ అఫిసర్ రేణుక సంఘ డైరెక్టర్లు సింగం వెంకన్న, నన్నూరి శేఖర్ రెడ్డి,అగ్రికల్చర్ ఏఈఓ నరసింహ, సంఘ కార్యదర్శి సుఖేందర్, అశోక్ రెడ్డి, పురుషోత్తం, స్వామీనాథ్ లింగస్వామి, చంద్రశేఖర్ ప్రజా ప్రతినిధులు భీమనపల్లి సైదులు, తాటికొండ సైదులు, పుట్ట శ్రీనివాస్ రెడ్డి, ముఖ్య నాయకులు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ధూళిపేట్‌లో 1.830 కేజీల గంజాయి పట్టివేత.

**- ఐదుగురిపై కేసు నమోదు ఇద్దరి అరెస్ట**



**బషీర్ బాగ్ వెలుతురు 16 అక్టోబర్ :**

లోయర్ ధూళిపేట్ పురాణపూల్ ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎస్టీఎఫ్ ఏ టీమ్ అంజిరెడ్డి సిబ్బంది తో పాటు, ధూల్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది కలిసి రూట్ వాచ్ నిర్వహించారు. ఒక వాహనంపై భద్రి నారాయణ సింగ్, రాజా సింగ్ అనే వ్యక్తులు గంజాయి అమ్మకాలు జరుపుతుండగా పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి 1.830 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రెండు సెల్ ఫోన్లు, టూ వీలర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఐదు గురిపై కేసు నమోదు చేశారు. ముఖేష్, మంజు దేవి, ప్రతీక్ సింగ్‌లపై కేసు నమోదు చేశామన్నారు . ఈ ముగ్గురు పరారీలో ఉన్నారు.ఇద్దరూ నిందితు లను, గంజాయిని ధూళపేట్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

## బిసి బంద్ కు పూర్తి మద్దతు

: చామంతిపూల

హైదరాబాద్ వెలుతురు న్యూస్ అక్టోబర్ 16:



ఈ నెల 18వ తేదీన బిసి జేఏసీ నిర్వహిం చతలపెట్టిన తెలంగాణ బంద్ కు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు జాతీయ ప్రెసిడెంట్ ప్రవేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ చామంతి పూల మల్లేష్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని బిసి జేఏసీ పిలుపునిచ్చిన బంద్ లో శ్రేణులు పాల్గొనాలని అన్నారు.

# సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు పదవి కి లక్ష్మణ్ దరఖాస్తు

**- సిద్దిపేట జిల్లా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా అవకాశం ఇవ్వండి**

**- ముదిరాజ్ బిడ్డ భీమ లక్ష్మణ్ ముదిరాజ్**

సిద్దిపేట జిల్లా వెలుతురు అక్టోబర్ 16:

సిద్దిపేట జిల్లా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా అవకాశం కల్పించాలని ముదిరాజ్ బిడ్డ భీమ లక్ష్మణ్ ముదిరాజ్ దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం ఏ జిల్లాలో కూడా ముదిరాజు బిడ్డ జిల్లా అధ్యక్ష పదవి కావాలని దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం లేదు. కానీ సిద్దిపేట జిల్లాకు జిల్లా అధ్యక్ష పదవి కావాలని భీమా లక్ష్యం ముదిరాజ్ ఈ మెరకు ఉమ్మడి మెదక జిల్లా ఎఐసిసి పరిశీలకులుదజ్యోతి రౌతేలా గారికి దరఖాస్తు ఇచ్చినారు. రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల సామాజిక వర్గాలలో అత్యధికంగా ముదిరాజులు సంఖ్యాపరంగా ఉన్నారు. ఈ సంఖ్యాపరంగా కనీసం మూడు జిల్లాల అధ్యక్ష పదవులు ఇవ్వవలసి ఉంటుంది. ఇప్పటికే ప్రదేష్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ నియామకాలలో ముదిరాజులకు తిరని అన్యాయం జరిగింది. ప్రదేష్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, తో పాటు రెండు ఉపాధ్యక్షులు, రెండు ప్రధాన కార్యదర్శిలు, ఐదు కార్యదర్శిలు తోపాటు కార్యవర్గంలో మరో 10 మందికి చోటు లభించవలసి ఉంది. అధికార ప్రతినిధులుగా నియమించవలసింది ఉంది. కానీ ప్రదేశ్




కాంగ్రెస్ కమిటీలో కేవలం ఇద్దరికి మాత్రమే ముదిరాజులకు అవకాశం కల్పించడం విచారకరం. అంతే కాకుండా కార్పొరేషన్ చైర్మన్ లలో ఒక్క బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కు మినహా ఎవరి కూడా అవకాశం కల్పించలేదు. సంఖ్యాపరంగా చూసుకుంటే కార్పొరేషన్లను కనీసం ఆరుగురు ముదిరాజులకు అవకాశం కల్పించవలసి ఉంది. మత్స్య రంగంలో ఐదు శాతం మత్స్య కార్మికులుగా ఉన్న బెస్త వారికి ఫెడరేషన్ చైర్మన్ కేటాయించి, 85 శాతం ఉన్న ముదిరాజులను విస్మరించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ముదిరాజ్ మత్స్య కార్మికులు మూడు లక్షలకు పైగా ఉండగా బెస్తవారు కేవలం 48 వేలు మాత్రమే సభ్యులుగా ఉన్నది జగమెరిగిన సత్యం. 85 శాతం ఉన్న ముదిరాజులకు కనీసం వైస్ చైర్మన్ ఇవ్వాలని ఎన్ని వినతి పత్రాలు ఇచ్చిన రాష్ట్రంలో ఉన్న ముదిరాజ్ సంఘాలు దరఖాస్తు చేసిన, పట్టించుకునే వారు మాత్రం లేరు. కార్పొరేషన్ లో అవకాశం కల్పించాలని బీమా లక్ష్మణ్ చేసిన ప్రయత్నం ఇంత అంత కాదు. వారు చేసిన ప్రయత్నం ఏ ఇతర సామాజిక వర్గాలు చేసిన వెంటనే కార్పొరేషన్ చైర్మన్ గా అవకాశం కల్పించేవారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాడు కాబట్టే బీమా లక్ష్మన్ వివక్షకు గురవుతున్నారనేది వాస్తవం. ఇలాంటి సమయంలోనైనా రాష్ట్రంలోని కనీసం మూడు జిల్లాలకు ముదిరాజులకు జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వవలసిన అవకాశం ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఏం చూస్తుందోనని ముదిరాజులు ఎదురుచూస్తున్నారు. బీమా లక్ష్యంతో పాటు మరో ఇద్దరికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవులు ఇస్తూ, రాష్ట్రంలోని కార్పొరేషన్ చైర్మన్ లలో కనీసం ఐదుగురికి ముదిరాజులకు అవకాశం కల్పించినప్పుడు మాత్రమే రాష్ట్రంలో న్యాయం జరుగుతుందనేది వాస్తవం. ఈ దశగా కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

**గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్**

**రాష్ట్ర అధికార ప్రతినిధి తెలంగాణ ఫిషర్మెన్ కాంగ్రెస్ కమిటీ.**

**రాష్ట్ర ఉపాధ్యక్షులు తెలంగాణ ముదిరాజ్ మహాసభ**

# సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్...



**కూకట్ పల్లి అక్టోబర్ 16 వెలుతురు:**
ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కాలనీ వాసులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ నగర్ కాలనీ లో కొంతమేర పెండింగ్ ఉన్న సీసీ రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించడం జరిగిందని అన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును సరిగ్గా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గుడ్ల శ్రీనివాస్, నవీన్, సురేష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ జిమ్ ఏర్పాటుకు భూమి పూజ..



**మేడిపల్లి అక్టోబర్ 16 వెలుతురు:**
బోడుప్పల్ నగరపాలకసంస్థ 21వ డివిజన్ పరిధిలోని రాజశేఖర్ కాలని పార్కులో మహిత ఎన్జీవోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్ కి భూమిపూజ గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈ రాకేష్,బి-బ్లాక్ జనరల్ సెక్రటరీ కొత్త కిషోర్ గౌడ్,మాజీ కార్పొరేటర్లు భూక్య సుమన్,బింగి జంగయ్య యాదవ్,ఎన్జీవోలు శరత్ కుమార్,సదానంద రెడ్డి,వార్డ్ ఆఫీసర్ సుమలత,డివిజన్ యూత్ అధ్యక్షులు సునీల్,కాలనీల అసోసియేషన్ సభ్యులు,కాలనీవాసులు,తదితరులు పాల్గొన్నారు.

# 18న విద్యా సంస్థల బంద్

**- బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:**
స్థానిక సంస్థల్లో ప్రభుత్వం కల్పించిన 42 శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేకు నిరసనగా ఈ నెల 18వ తేదీన విద్యాసంస్థల బంద్ కు పిలుపునిచ్చినట్లు బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తెలిపారు. స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు అన్ని స్వచ్ఛందంగా బంద్ లో పాల్గొని బీసీలకు మద్దతు తెలియజేయాలని ఆయన కోరారు. పిల్లల తల్లిదండ్రులు కూడా పిల్లలను పాఠశాలలకు, కళాశాలలకు పంపొద్దని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే అన్ని ప్రధాన రాజకీయపార్టీలు బంద్ కు మద్దతు తెలియజేశాయని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాలు, ఆటో డ్రైవర్స్ యూనియన్లు బీసీలకు మద్దతుగా బంద్ లో పాల్గొంటామని ప్రకటించారని ఆయన తెలిపారు. బంద్ ను పూర్తి స్థాయిలో విజయవంతం చేసి బీసీలకు న్యాయం జరిగే విధంగా చూడాలి ఆయన కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి బీసీ రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ చేయాని ఆయన విజ్ఞప్తి చేశారు.ం

# హద్నూర్‌లో పోలీసు విధులకు ఆటంకం... మద్యం మత్తులో అర్ధరాత్రి అల్లరి

**- ముగ్గురు యువకులు అరెస్టు...**

**- హద్నూర్ ఎస్ఐ సుజిత్ వెల్లడి...**




**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:**
సంగారెడ్డి జిల్లా హద్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి సమయంలో పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... హద్నూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్స్ సాయికుమార్, మహేష్‌లు 16వ తేదీ అర్ధరాత్రి గస్తీ విధుల్లో భాగంగా న్యాల్కల్ గ్రామ పరిధిలోని బీదర్ - నిజాంపేట్ రోడ్డుపై తిరుగుతుండగా, రాత్రి 2 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు మద్యం సేవిస్తూ కనిపించారు. పోలీసులు వారిని "ఈ అర్ధరాత్రి ఇక్కడ ఏమి చేస్తున్నారు?" అని ప్రశ్నించగా, ఆ వ్యక్తులు అహంకారంగా "మేము ఏమైనా చేస్తాం, మీరు ఎవర్రా అడగడానికి?" అంటూ దుర్భాషలాడారు. ఈ దృశ్యాన్ని వీడియో తీయడానికి ప్రయత్నించిన పోలీసులపై దాడి చేసి, వారి మొబైల్ ఫోన్ మరియు లాఠీని లాక్కొని నెట్టివేశారు. పోలీసులపై దుర్వ్యవహారం చేసిన వారిని న్యాల్కల్ గ్రామానికి చెందిన మున్నూరి రాజు, తండ్రి హనుమంతు, చుట్లకుల శ్రీకాంత్, తండ్రి సంగన్న, గాండ్ల వినయ్‌కుమార్,తండ్రి మహాలింగప్ప గా గుర్తించారు. ఈ ఘటనపై హద్నూర్ ఎస్ఐ సుజిత్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# మునుగోడు లో డి.సి.సి అధ్యక్షుడి ఎంపిక పై అభిప్రాయ సేకరణ

**డిసిసి అధ్యక్షులు గా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసి ఎవరిని ఎంపిక చేసిన మద్దతిస్తామని, రాజ్ గోపాల్ రెడ్డి కి అధిష్టానం ఇచ్చిన మాటను కూడా నిలబెట్టుకోవాలని ఏకవాఖ్య తీర్మానం**

**జన్మతః నేను కాంగ్రెస్ పార్టీ, పుట్టిన నాటి నుండి నా రక్తంలోనే కాంగ్రెస్ పార్టీ ఉంది,కాంగ్రెస్ పార్టీలోనే ఉంటా**

**ఆస్తుల అమ్ముకొని పార్టీని బ్రతికించడానికి పనిచేసిన**

**కాంగ్రెస్ పార్టీ పేరు చెప్పి ఎక్కడ చెయ్యి చాప లేదు కష్టకాలంలో కమిట్మెంట్తో కాంగ్రెస్ పార్టీ జెండాను బతికించే విధంగా పనిచేసిన వాన్ని**

**రాజధానికి కూతబెట్టి దూరంలో ఉన్న మునుగోడు వెనకబడే ఉంది**

**దశాబ్దాలుగా మునుగోడు లో అభివృద్ధి జరగకుండా అన్యాయం జరిగింది.**

**ఇప్పటికి ఇంకా అన్యాయం జరుగుతూనే ఉంది**

**ఎఐసిసి పెద్దలు ఎవరిని డిసిసి అధ్యక్షులు గా ఎంపిక చేసిన మాకు అభ్యంతరం లేదు**

**కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**

**నల్గొండ జిల్లా కాంగ్రెస్ వల్లనే రాష్ట్ర లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయింది**

**రాజగోపాల్ రెడ్డి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పేరున్న నేత, ఆయన స్థాయి కి మంత్రి పదవనేది తక్కువే, అంతకు మించిన కేపాసిటీ ఉన్న నేత**

**మీ ఓపికకు తగ్గ ప్రతిఫలం ఖచ్చితంగా లభిస్తుంది**

**అధిష్టానానికి మీ ఆవేదనను మీ కోరికను తెలియజేస్తాను**

**నేను తిరిగిన ఏ నియోజకవర్గంలో కూడా ఇక్కడ ఉన్న కాంగ్రెస్ పార్టీపై ప్రేమ ఎక్కడ కూడా చూడలేదు**

**బిశ్వరంజన్ మహంతి, ఏఐసీసీ మాజీ జనరల్ సెక్రటరీ**

**తెలంగాణలో క్రేజీ ఫాలోయింగ్ ఉన్న లీడర్ రాజగోపాల్ రెడ్డి**

**నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు కోరికను రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్తాం - ఎమ్మెల్సీ శంకర్ నాయక్**



మునుగోడు వెలుతురు అక్టోబర్ 16:
సంఘటన సృజన్ అభియాన్ లో భాగంగా డిసిసి అధ్యక్షుని ఎంపిక కొరకు నియోజకవర్గంలోని ముఖ్య నాయకుల అభిప్రాయం తీసుకోవడానికి గురువారం రోజున మునుగోడు కు ఎఐసిసి మాజీ జనరల్ సెక్రటరీ బిశ్వరంజన్ మహంతి తో పిసిసి పరిశీలకులు వచ్చారు... మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలు నాయకులతో డిసిసి అధ్యక్షుని ఎంపికకు సంబంధించి అభిప్రాయాన్ని తీసుకున్నారు...
నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్క నాయకుడు ముఖ్య



కార్యకర్త ఏఐసీసీ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఓసి లలో ఎవరిని డిసిసి అధ్యక్షులుగా ఎంపిక చేసిన మా మద్దతు ఉంటుందని, దాంతోపాటు అధిష్టానం మునుగోడు నియోజకవర్గానికి ఇచ్చిన కమిట్మెంట్ కూడా నిలబెట్టుకోవాలని కుండ బద్దలు కొట్టినట్టు ఏకవాఖ్య తీర్మానాన్ని తెలిపారు, ఈ సందర్భంగా కొందరు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కష్టకాలం లో వున్నపుడు రాజగోపాల్ రెడ్డి పార్టీని బ్రతికించారని గుర్తు చేశారు..2009 నుండి ఈరోజు వరకు ప్రతిపక్షాలకు ఎదురొడ్డి కాంగ్రెస్ పార్టీ జెండాను నిలబెడుతున్నాడని, మొన్నటికి మొన్న ఎంపీ ఎన్నికల్లో ఎవరికీ తెలియని అభ్యర్థిని ఎంపీగా గెలిపించి సత్తా చాటాడని అన్నారు... ఎంపీగా గెలిపించి వస్తే మంత్రి పదవి ఇస్తానని అధిష్టానం హామీ ఇచ్చి హామీను నిలబెట్టుకోలేదన్న విషయాన్ని ఏఐసిసి మాజీ జనరల్ సెక్రెటరీకి తెలిపారు.. మంత్రి పదవి ఇచ్చి మాట తప్పిన విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని పలువురు ముఖ్య నాయకులు తమ ఆవేదనను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.
రాజగోపాల్ రెడ్డి రెండు తెలుగు రాష్ట్రాలలో పేరున్న నాయకుడని, ఆయన స్థాయికి మంత్రి పదవి చిన్నదని, ఇంకా పెద్ద పదవులు అధిష్టించే సత్తా ఉన్న నాయకుడని విశ్వరంజన్ మహంతి కొనియాడారు... ఖచ్చితంగా మీ ఆవేదనను రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్తానని, మీ ఓపికకు తగ్గ ప్రతిఫలం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
తెలంగాణ రాష్ట్రంలో క్రేజీ ఫాలోవర్స్ ఉన్న నాయకుడు రాజగోపాల్ రెడ్డి ని ఆయనకు అధిష్టానం ఇచ్చిన హామీని నిలబెట్టాలని ఏఐసిసి ప్రతినిధి ద్వారా రిపోర్ట్ పంపిస్తామని అన్నారు ఎమ్మెల్సీ, ప్రస్తుత డిసిసి అధ్యక్షుడు శంకర్ నాయక్... ఈ సమావేశంలో ఎఐసిసి మాజీ జనరల్ సెక్రెటరీ బిశ్వరంజన్ మహంతితోపాటు ఎమ్మెల్సీ శంకర్ నాయక్, పిసిసి పరిశీలకులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, నియోజకవర్గ వ్యాప్త ముఖ్య నాయకులు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు....

# స్థానిక సంస్థల ఎన్నికలపై గందరగోళ పరిస్థితులను సృష్టించిన కాంగ్రెస్ సర్కార్....

**పాత రిజర్వేషన్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించుకోవచ్చన్న హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పుతో లోకల్ ఎలక్షన్స్ ఉంటాయో.. ఉండవో ననే అయోమయ స్థితి**

**గ్రామాలకు గడ్డుకాలం, గ్రామ స్థాయి నాయకులకు అత్యంత గడ్డు పరిస్థితులను తెచ్చిపెట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం....**

**కేంద్రప్రభుత్వ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు...**

**బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర**



**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 16:**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు కావస్తున్న గ్రామ పాలనను గాడిలో పెట్టే ఆలోచన చేయకపోవడం దురదృష్టకరమని , రెండేళ్ల కాలంగా గ్రామ పరిపాలన వ్యవస్థ సక్రమంగా లేక నేడు గ్రామాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. గురువారం కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధి గురించి పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన విమర్శించారు. గ్రామాల అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేని దుర్భర స్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. నేడు గ్రామాల్లో జరుగుతున్న అనేక అభివృద్ధి పనులు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులు( ఈజీఎస్) తో జరుగుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పనుల ఘనత తమదేనని , గ్రామ ప్రజానీకాన్ని మోసం చేస్తూ ఇన్నేళ్లుగా గొప్పలు చెప్పుకుంటూ కాలం వెళ్ళ దీసుకొచ్చిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ లతో స్థానిక సంస్థల ఎన్నికలు వెళతామన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం కు హైకోర్టు , సుప్రీంకోర్టు షాక్ ఇచ్చిందన్నారు. పాత రిజర్వేషన్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించుకోవచ్చని కోర్టు తీర్పు ఇవ్వడంతో ఆ ఎన్నికలు ఉంటాయో , ఉండవో ననే గందరగోళ, అయోమయ పరిస్థితులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చి, రాజకీయ డ్రామాలు మొదలుపెట్టిందని ఆయన విమర్శించారు. అసలే గ్రామాల్లో పరిపాలన వ్యవస్థ లేక గడ్డుకాల పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో రాజకీయ అధికారాలను చేపట్టాలని అనుకుంటున్న గ్రామ స్థాయి నాయకులకు అత్యంత గడ్డు పరిస్థితి ఎదురవుతోందన్నారు. గ్రామస్థాయిలోనిలదొక్కుకోవాలనుకుంటున్న నాయకులకు పంచాయతీ, పరిషత్ ఎన్నికలు కీలకమని భావిస్తుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఈ ఎన్నికలను చాలా వరకూ వివాదాల్లోకి నెట్టేసిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను కోర్టు కేసుల్లో పెట్టించి బీసీ రిజర్వేషన్లు అంశంతో కాంగ్రెస్ అనవసర రాజకీయాలు చేస్తుందని ఆయన మండిపడ్డారు.. బీసీల రిజర్వేషన్ అంశం తేలే వరకు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించే ఆలోచన కాంగ్రెస్ చేస్తున్న ప్రకటనలతో మొత్తం మీద ప్రభుత్వానికి ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచన ఇప్పట్లో లేదని స్పష్టంగా అర్థమవుతుందన్నారు.. బీసీ రిజర్వేషన్లకు హామీ ఇచ్చాం .. జీవోలు ఇచ్చేసి.. ఎన్నికలకు వెళితే కోర్టు కేసుల్లో పడితే ఇబ్బందులు వస్తాయని తెలిసికూడా ఈ వ్యవహారంలో ఇతర పార్టీల మీద బురదచల్లలనే దుర్మార్గపు ఆలోచనతో కాంగ్రెస్ సర్కార్ ఉన్నట్లు స్పష్టంగా కనబడుతుందన్నారు. ముఖ్యంగా రాజ్యాంగాన్ని సవరించుకండా రిజర్వేషన్లు ఇవ్వలేని పరిస్థితులు ఉంటే , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోదీని దింపేసి రాహుల్ ను ప్రధానిని చేసి రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటనలు చేయడం హాస్యస్పదంగా ఉందన్నారు. రిజర్వేషన్లు అసాధ్యమని తెలిసినప్పుడు ఓ జీవో జారీ చేసి..కోర్టుల ద్వారా ఒకే చేయించుకోగలమని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎలా అనుకుంది..? రిజర్వేషన్ల వ్యవహారంలో రాష్ట్ర ప్రాసెస్ చెల్లుబాటు కాదని న్యాయనిపుణులు చెబుతున్నారని , హైకోర్టు , సుప్రీంకోర్టు తీర్పు లు కూడా అదే విషయాన్ని స్పష్టం చేశాయని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. 42 శాతం రిజర్వేషన్ల తో నే ఎన్నికలకు వెళ్తామన్న కాంగ్రెస్ వైఖరి చూస్తుంటే , ఇప్పట్లో లోకల్ ఎలక్షన్స్ నిర్వహించాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదనేది స్పష్టంగా అర్థమవుతుందన్నారు.

# తెలంగాణ బందుకు మహిళా జేఏసీ సంపూర్ణ మద్దతు జేఏసీ చైర్మన్ యం. భాగ్యలక్ష్మి




**బషీర్ బాగ్ వెలుతురు 16 అక్టోబర్ :**
బీసీ మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం జాతీయ బీసీ మహిళా జేఏసీ ఆవిర్భావం గురువారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ మహిళలు బంద్ కు సంబంధించిన గోడపత్రిక ను ఆవిష్కరించారు. ఈ జేఏసీకి చైర్మన్ గా నియమితులైన ఎం. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఈ నెల 18న జరిగే తెలంగాణ బంద్ కు మద్దతు ప్రకటించారు. దేశంలో, రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్ల కోసం జరుగుతున్న ఉద్యమాలకు తమ జేఏసీ సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని, ఈ బంద్ గ్రామ స్థాయి నుంచి మహిళలు ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికే బీసీ రిజర్వేషన్లను కామారెడ్డిలో 42 శాతం ప్రకటించిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం మహిళలకు కేటాయించిన 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం దేశ వ్యాప్తంగా బీసీ మహిళలు ఉద్యమిస్తారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళలు నిర్మలా ముదిరాజ్, సాజిరా, జయశ్రీ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడి జీవితంలో క్రీడలు జీవనశైలి కావాల్సిందే

- కేంద్ర ప్రభుత్వం అందుకోసం ప్రత్యేక చర్యలు చేపడుతోంది
- యువతకు క్రీడా రంగంలో అద్భుతమైన అవకాశాలను కల్పిస్తున్నాం
- పోలీస్, పారామిలటరీ సిబ్బందిని క్రీడల్లో ప్రోత్సహిస్తున్నాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి
- శ్రీనగర్ లో అంగరంగ వైభవంగా ఆలిండియా జూడో ముగింపు ఉత్సవాలు
- ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతి అందజేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్









**శ్రీనగర్ వెలుతురు అక్టోబర్ 16:** దేశంలోని ప్రతి ఒక్క పౌరుడి జీవితంలో క్రీడలను ఒక జీవనశైలిగా మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ముఖ్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో క్రీడా రంగంలో యువతకు అద్భుతమైన అవకాశాలు సృష్టించే దిశ చర్యలు చేపడుతోందన్నారు. జమ్మూ కాశ్మీర్ పర్యటనలో భాగంగా గురువారం రోజున కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శ్రీనగర్ లో పర్యటించారు. గతంలో తెలంగాణలో వివిధ జిల్లాల్లో పనిచేసి ప్రస్తుతం జమ్మూకాశ్మీర్ డీజీపీగా కొనసాగుతున్న నళినీ ప్రభాత్ సహా ఉన్నతాధికారులు శ్రీనగర్ ఎయిర్ పోర్టులో కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా ఆలిండియా పోలీస్ జూడో క్లస్టర్ (మహిళలు, పురుషుల విభాగం) ముగింపు ఉత్సవాలకు కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నళినీ ప్రభాత్ తోపాటు అదనపు డీజీపీ ఆనంద్, అనురాగ్ కమార్ తోపాటు ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (AIPSCB), జమ్మూ , కాశ్మీర్ పోలీస్ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తెలంగాణ, ఏపీసహా దేశంలోని అన్ని రాష్ట్రాల పోలీస్, కేంద్ర పారామిలటరీ సిబ్బంది ఈ క్రీడల్లో పాల్గొన్నారు. అత్యుత్తమ కనబర్చిన ఆటగాళ్లకు కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ "ప్రపంచస్థాయి వసతులతో జమ్మూ , కాశ్మీర్ లో ప్రపంచస్థాయి మౌలిక వసతులతో జాతీయ క్రీడలను నిర్వహించడం సంతోషంగా ఉంది. దేశవ్యాప్తంగా క్రీడా సంస్కృతిని ప్రతి స్థాయిలో విస్తరించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోంది. ముఖ్యంగా పోలీసు, పారామిలిటరీ సిబ్బందిలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు "ఖేలో ఇండియా", "ఫిట్ ఇండియా మూవ్‌మెంట్" వంటి జాతీయ కార్యక్రమాలను నిర్వహిస్తోంది."అని తెలిపారు. "10వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ 2025–26 (పురుషులు , మహిళలు) ముగింపు కార్యక్మానికి హాజరుకావడం గౌరవంగా భావిస్తున్నాను. గత తొమ్మిది (09) రోజులుగా ఈ క్రీడా వేడుకలో మన దేశ పోలీసు దళాలు అద్భుతమైన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాయి. ఈ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన ఏఐపీఎస్ సీబీ, జమ్మూ కాశ్మీర్ అధికారులకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను."అని పేర్కొన్నారు. "గొప్ప సాంస్కృతిక వారసత్వం, ఐక్యతా భావంతో నిండిన అందమైన నగరం శ్రీనగర్ ఈ క్రీడా సమావేశానికి అద్భుతమైన వేదికగా నిలవడం ఆనందంగా ఉంది. క్రీడలు మానవ సంబంధాలను నిర్మించడంతోపాటు స్నేహాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయడానికి ఈ జూడో పోటీలే నిదర్శనం. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి నిష్పక్షపాత క్రీడాస్ఫూర్తిని చాటి మరపురాని పోటీలుగా మార్చారు."అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి స్థాయిలో క్రీడా సంస్కృతిని ప్రోత్సహించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని, పోలీస్, పారామిలిటరీ సిబ్బందిని పూర్తిస్థాయిల్ ప్రోత్సహిస్తోందన్నారు. జూడో క్లస్టర్ విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహక సంఘం, సాంకేతిక అధికారులు, రిఫరీలు, కోచ్‌లు, వాలంటీర్లందరికీ కేంద్ర మంత్రి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.



## ములుగు జిల్లా లో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు ప్రమీల ఆనందం



**ములుగు వెలుతురు అక్టోబర్ 16:** చేపలు పట్టుకుని జీవించే నాకు సీతక్క అక్క ఇల్లు కట్టించారు. ఎంతో సంతోషంగా ఉంది. మా ఇంటికి సీతక్క స్వయంగా రావడం మరింత ఆనందాన్నిచ్చింది. జీవితాంతం ఆమెకు రుణపడి ఉంటాను ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు ప్రమీల

## మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి పిల్లలకంటే ఎక్కువ ఉంటే అనర్హులు అనే నిబంధన ఎత్తివేసిన ప్రభుత్వం




**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:** గత ప్రభుత్వంలో ఇద్దరు పిల్లల కన్నా ఎక్కువ మంది ఉంటే స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీచేయడానికి అనర్హులుగా మిగిలిపోయేవారు గురువారం రోజున జరిగిన క్యాబినెట్ సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ పిల్లలు ఉంటే పోటీకి అనర్హులు అనే నిబంధనపై చర్చ చేయాలని కోరిన మంత్రి అనేక మంది పోటీ చేయాలని ఉన్నా పోటీచేయలేక అర్హులుగా మిగిలిపోతున్నారు మంత్రి వాకిటి శ్రీహరి మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి పిల్లల ఎక్కువ ఉంటే పోటీకి అనర్హులు అనే నిబంధన ఎత్తివేసిన ప్రభుత్వం

## సురేఖ ఓఎస్టీ గురించి తెలియదు

- తన కుమార్తె ఏం మాట్లాడిందో కూడా తెలియదు
- కాంగ్రెస్ నేత కొండా మురళి

**హనుమకొండ,అక్టోబర్16( వెలుతురు):** మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ విషయం తనకేమీ తెలియదని ఆమె భర్త, కాంగ్రెస్ నేత కొండా మురళి అన్నారు. తన కుమార్తె సుస్మిత హైదరాబాద్‌లో ఏం మాట్లాడిందో తెలియదన్నారు. స్మార్ట్ ఫోన్ చూడటం తనకు రాదని చెప్పారు. సిమెంట్ కంపెనీ యాజమాన్యాలను సుమంత్ బెదిరించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను ఓఎస్డీ బాధ్యతల నుంచి ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖ ఇంటి వద్దకు సుమంత్ కోసం పోలీసులు రావడం.. మంత్రి కుమార్తె సుస్మిత అడ్డుకోవడం తదితర పరిణామాల నేపథ్యంలో హనుమకొండలో కొండా మురళి మీడియాతో మాట్లాడారు. నా కుమార్తె, అల్లుడు లండన్‌లో ఉన్నారు.. అక్కడ వ్యాపారం చేస్తున్నారు. నా బిడ్డకు పదవి ఏమీ లేదు.. ఆమె ఏ పార్టీలోనూ లేదు. మంత్రి ఛాంబర్‌కు ఇప్పటివరకు నేను వెళ్లలేదు. భద్రతా కారణాల వల్ల వేర్వేరు కార్లలో నేను, సురేఖ వెళ్తాం. సీఎం రేవంత్‌రెడ్డి నాకు ఎమ్మెల్సీ ఇస్తామన్నారు.. ఇస్తారు. ఆయన సీఎం కావాలని కోరుకున్న వారిలో నేనూ ఒకడిని. సీఎం, మంత్రి పొంగులేటి మా ఇంటికి వచ్చారు.. నన్నెందుకు టార్గెట్ చేస్తారని కొండా మురళి వ్యాఖ్యానించారు.

## కోట్లాది మంది చందాదారుల జీవన సౌలభ్యం కోసం చేపట్టిన ఈపీఎఫ్ఓ సంస్కరణల ప్రయోజనాలను తెలియజేసిన కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ

- వేగవంతమైన, సరళమైన, మరింత పారదర్శక పీఎఫ్ ఉపసంహరణల కోసం పదమూడు సంక్లిష్ట నిబంధనలను మూడు వర్గాలుగా విభజించిన ఈపీఎఫ్ఓ సంస్కరణలు
- ఉపసంహరణ అర్హత కోసం కావాల్సిన ఉద్యోగ వ్యవధి ఏడు నుంచి ఒక సంవత్సరానికి తగ్గింపు
- అర్హత కలిగిన మొత్తంలో 75 శాతాన్ని ఇప్పుడు ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఉపసంహరించుకునే వీలు
- ప్రత్యేక పరిస్థితుల్లో పూర్తి ఉపసంహరణకు అనుమతి
- పీఎఫ్‌ను కొనసాగించేలా ప్రోత్సహించేందుకు, భవిష్యత్తులో పింఛను ప్రయోజనాలను పొందేందుకు ఈపీఎస్ ఉపసంహరణ నియమాల సవరణ





**వెలుతురు పిఐబీ హైదరాబాద్ 16 అక్టోబర్ 2025:** ఇటీవల చేపట్టిన ఈపీఎఫ్ఓ(ఈపీఎఫ్ఓ) సంస్కరణలు, సవరించిన నిబంధనల గురించి సామాజిక మాధ్యమాల్లో ఒక పోస్ట్ తప్పుదారి పట్టించే విషయాలను ప్రచారం చేస్తోంది. ఇది ఉపసంహరణ నియమాలు, అర్హత నిబంధనలు, సభ్యుల భవిష్య నిధి మొత్తాన్ని ఉపసంహరించుకోవటానికి సంబంధించిన వాస్తవాలను వక్రీకరిస్తోంది. ఈపీఎఫ్ చందాదారులలో గందరగోళాన్ని సృష్టించిన ఈ పోస్ట్‌లో చెప్పిన విషయాలు వాస్తవాలకు అతీతంగా ఉండటంతో పాటు పూర్తిగా తప్పుదారి పట్టించేవని ఈపీఎఫ్ఓ స్పష్టం చేసింది. వ్యవస్థీకృత రంగంలోని లక్షలాది మంది కార్మికులకు దీర్ఘకాలిక సామాజిక భద్రతనివ్వటంలో ఈపీఎఫ్ఓ కీలక పాత్ర పోషిస్తోంది. సీబీటీ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్) ఇటీవల తీసుకున్న నిర్ణయం.. పదవీ విరమణ సమయంలో సముచిత మొత్తాన్ని ఇవ్వటంతో పాటు వివిధ అవసరాలకు ఉదార విధానంలో సరళీకృత ఉపసంహరణలు అందించటం అనే రెండింటి మధ్య సమతుల్యతను పాటించింది. ఇది సభ్యులకు జీవన సౌలభ్యాన్ని కూడా అందించనుంది. యజమాన్య, ఉద్యోగి ప్రతినిధులతో కూడిన త్రైపాక్షిక కమిటీ అయిన ఈపీఎఫ్ఓ ఫైనాన్స్- ఆడిట్ కమిటీ ఈ మార్పులను సిఫార్సు చేసింది. ఈ మార్పులను ఉద్యోగి, యాజమాన్య, ప్రభుత్వ ప్రతినిధులతో కూడిన సీబీటీ ఆమోదించింది. ఇలా భాగస్వాములందరితో విస్తృతమైన సంప్రదింపులు చేసిన తర్వాతనే ఈపీఎఫ్ఓ సవరణలు చేపట్టింది. గతంలో కనీస ఉద్యోగ వ్యవధికి సంబంధించిన విషయంలో సంక్లిష్టత ఉండేది. దీనివల్ల క్లెయిమ్‌లు తిరస్కరణకు గురవటం కానీ ఆలస్యమవటం కానీ అయ్యేది. పాక్షిక ఉపసంహరణలకు సంబంధించిన చాలా నిబంధనల వల్ల సభ్యులు గందరగోళానికి గురయ్యేవారు. వీటివల్ల ఉపసంహరణ క్లెయిమ్‌లు కూడా తరచుగా తిరస్కరణ అయ్యేవి. గతంలో ఉన్న 13 రకాల పాక్షిక ఉపసంహరణ నిబంధనలను ఇప్పుడు ఒకే ఏకీకృత సరళమైన నిబంధన కిందకు తీసుకొచ్చారు. నిబంధనల సరళీకరణకు ముందు పీఎఫ్ చందాదారుడు 50 నుంచి 100 శాతం వరకు ఉపసంహరించుకునే వీలు ఉండేది. అయితే దీనికి ఉద్యోగి వాటా, వడ్డీని మాత్రమే పరిగణినలోకి తీసుకునేవారు. ఇప్పుడు ఉపసంహరించుకోదగిన మొత్తంలో ఉద్యోగి వాటా, వడ్డీతో పాటు యజమాని వాటాను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఇప్పుడు ఉపసంహరించుకునేందు అర్హత ఉన్న 75 శాతం నిధులను చూసుకుంటే గత నిబంధనల ప్రకారం వచ్చే మొత్తం కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. ఇంతకుముందు ఉపసంహరణకు ఉండాల్సిన ఉద్యోగ వ్యవధి ఏడు సంవత్సరాల వరకు ఉండేది. ఇందులో కూడా వివిధ రకాలు ఉన్నాయి. ఇప్పుడు అన్ని రకాల ఉపసంహరణలకు ఏకరీతిలో 12 నెలలు ఉద్యోగ వ్యవధిని నిర్ణయించారు. ఇది ఈపీఎఫ్ఓ సభ్యులకు సులభతంగా అర్థమవటమే కాకుండా ముందస్తు ఉపసంహరణను సులభతరం చేస్తుంది. దీని ప్రకారం ఇప్పుడు ఉద్యోగి కేవలం 12 నెలల వ్యవధి తర్వాత మునుపటి కంటే మరింత ఎక్కువగా ఉపసంహరించుకోవచ్చు. పదే పదే ఉపసంహరణలు చేసుకోవటం వల్ల పదవీ విరమణ సమయంలో తగినంత పీఎఫ్ మొత్తం ఉండేది కాదు. పదవీ విరమణ సమయంలో 50 శాతం సభ్యుల బ్యాలెన్స్ రూ. 20,000 కంటే తక్కువ, 75 శాతం మంది బ్యాలెన్స్ రూ. 50,000 కంటే తక్కువ ఉండేది. తరచూ ఉపసంహరణలు చేసుకోవటం వల్ల తక్కువ వేతనాలు ఉన్న వాళ్లు 8.25 శాతం చక్రవడ్డీ ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. తద్వారా ఎక్కువ మంది వారి ఉద్యోగ జీవితం అనంతరం సముచిత సామాజిక భద్రతను కోల్పోతున్నారు. అందుకే పదవీ విరమణ సమయంలో సరిపడా స్థాయిలో నిధులు అందటంతో పాటు దీర్ఘకాలిక సామాజిక భద్రతను అందించేందుకు 25 శాతం పీఎఫ్ బ్యాలెన్స్‌ను కొనసాగించాలన్న నిర్ణయం సీబీటీ తీసుకుంది. నిరుద్యోగిగా మారినట్లయితే 75 శాతం బ్యాలెన్స్‌ను (యజమాని, ఉద్యోగి వాటాతో పాటు వడ్డీ) వెంటనే ఉపసంహరించుకోవచ్చు. ఒక సంవత్సరం తర్వాత మిగిలిన 25 శాతం మొత్తాన్ని కూడా ఉపసంహరించుకోవచ్చు. 55 ఏళ్ల వయస్సు, శాశ్వత వైకల్యం, పని చేయటంలో అసమర్థత, తొలగింపు, స్వచ్ఛంద పదవీ విరమణ లేదా విదేశాలకు శాశ్వతంగా వెళ్లటం వంటి కారణాలతో పదవీ విరమణ పొందినట్లయితే కూడా మొత్తం పీఎఫ్ బ్యాలెన్స్‌ను (కనీస బ్యాలెన్స్ 25 శాతంతో సహా) పూర్తిగా ఉపసంహరించుకోవచ్చు.

## జాతీయ అంతర్జాతీయ పోటీలు నిర్వహించ ఫెడరేషన్లకు సహకరిస్తాం

- రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- ఉమెన్స్ వరల్డ్ కప్ క్వాలిఫైయర్ మ్యాచ్లకు హైదరాబాద్ ఆతిథ్యం
- గచ్చిబౌలి హాకీ స్టేడియం బేగంపేట హాఖీ స్టేడియాలను పరిశీలించిన హాకీ ఇండియా ఫెడరేషన్ ప్రతినిధులు





**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 16:** తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నగరంలో జాతీయ అంతర్జాతీయ పోటీలు నిర్వహించడానికి ముందుకు వచ్చే క్రీడా ఫెడరేషన్లకు ప్రభుత్వ ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహకారం అందజేస్తామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం రోజున హాకీ హాకీ ఉమెన్స్ వరల్డ్ కప్ క్వాలిఫైయర్ 2026 పోటీలను హైదరాబాదులో నిర్వహించడానికి ఉన్న అవకాశాలను సౌకర్యాలను పరిశీలించడానికి విచ్చేసిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ హాకీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా మంత్రి వాకిటి శ్రీహరి గారిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని సన్మానించారు. తెలంగాణ రాష్ట్రంలో జాతీయ అంతర్జాతీయ పోటీలు నిర్వహించడానికి ముందుకు వచ్చే క్రీడా సంఘాలకు ఫెడరేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహకారం ఉంటుందని, వివిధ జాతి అంతర్జాతీయ పోటీలు నిర్వహించే సత్తా,సౌకర్యాలు హైదరాబాద్ నగరంలో ఉన్నాయని ఆయన అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ హాకీ ప్రతినిధులు ఈరోజు గచ్చిబౌలి హాకీ స్టేడియం మరియు బేగంపేట హాకీ స్టేడియంలోని సౌకర్యాలను పరిశీలించారు. ఉమెన్ వరల్డ్ కప్ క్వాలిఫైయర్ మ్యాచ్లను హైదరాబాదులో నిర్వహించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించారు. గచ్చిబౌలిలో ఉన్న సౌకర్యాలు పట్ల సంతృప్తి చెందిన ప్రతినిధులు గచ్చిబౌలి హాకీ స్టేడియం ఈ పోటీలకు అనువుగా ఉంటుందని దీనికి సంబంధించిన అవసరమైన పునర్నిర్మాణ మరియు రిపేరింగ్ పనులను చేపట్టాల్సిందిగా స్పోర్ట్స్ అథారిటీని కోరారు. ఫిబ్రవరి25- మార్చ 15 మధ్య కాలంలో ఈ పోటీలు నిర్వహించే అవకాశం ఉంది. ఇందుకోసం గచ్చిబౌలిలో చేపట్టవలసిన వివిధ పనులపై హాకీ ఫెడరేషన్ ప్రతినిధులు, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు కలిసి చర్చించారు. దీనిపై ఒక నివేదిక రూపొందించి ప్రభుత్వం అనుమతులు రాగానే పనులు చేపట్టాలని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ సోనీ బాలాదేవి, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆర్మీ సెక్రెటరీ జనరల్ బోలా నాథ్ సింగ్, కోశాధికారి శేఖర్ జై మనోహరన్ డైరెక్టర్ జనరల్ వి ఎస్ ఎం, ఆర్ కె శ్రీ వాత్సవ డైరెక్టర్ బి.ఎన్ భూషణ్ విక్రమ్ పాల్ తెలంగాణ హాకీ అసోసియేషన్ కార్యదర్శి భీమ్ సింగ్ కోశాధికారి కళ్యాణి స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు ఇంజనీరింగ్ విభాగం అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వానికి దక్కని ఊరట

- స్పెషల్ లీవ్ పిటిషన్‌పై విచారణకు సుప్రీం తిరస్కరణ
- పాత పద్ధతిలోనే ఎన్నికలకు వెళ్లాలని సూచన
- హైకోర్టు విచారణపై జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం
- 50శాతం మించి రిజర్వేషన్లను ఆమోదించలేమని వ్యాఖ్య
- ప్రభుత్వం తదుపరి కార్యాచరణపై ఉత్కంఠ




**న్యూఢిల్లీ,అక్టోబర్16( వెలుతురు):**
సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురైంది. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ ఎస్ఎల్‌పీని సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. 50 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లండని ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. పాత రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని ధర్మాసనం హైకోర్టుకు సూచించింది. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తమ ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని.. మెరిట్స్ ప్రకారం విచారించాలని హైకోర్టుకు సూచించింది. కావాలనుకుంటే పాత రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీఓ 9పై హైకోర్టు విధించిన స్టేను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఈ నెల 9న జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్‌చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 13వ తేదీన పిటిషన్ దాఖలుచేసింది. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా 16, 17వ తేదీల్లో ఏదో ఒకరోజు ఈ అంశంపై విచారించాలని మంగళవారం సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ ముందు మెన్షన్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగానే రిజిస్ట్రీ ఈ కేసును గురువారం విచారణ జాబితాలో చేర్చింది. అయితే సుప్రీంకోర్టు దీనిపై విచారణకు నిరాకరించింది. ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రిజర్వేషన్లు 50 శాతం మించొద్దనే అభిప్రాయం సరికాదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో కులగణన సర్వే జరిగిందని, ప్రభుత్వం ఇంటింటి సర్వే చేసి లెక్క తేల్చిందని సర్వోన్నత న్యాయస్థానంకు వివరించారు. రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయని, 3 నెలలు దాటినా బిల్లుపై గవర్నర్ నిర్ణయం తీసుకోలేదని అభిషేక్ సింఘ్వీ వాదించారు. రిజర్వేషన్లు 50 శాతం మించొద్దన్న తీర్పులు స్పష్టంగా ఉన్నాయని, కృష్ణమూర్తి జడ్జిమెంట్ ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పిందని ప్రతివాది లాయర్ వాదనలు బలంగా వినిపించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో విచారణకు స్వీకరించలేమని స్పష్టం చేసింది. కావాలనుకుంటే పాత రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొంది. సుప్రీంకోర్టు నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం తదుపరి తీసుకునే చర్యలపై అందరిలో ఉత్కంఠ నెలకొంది. కేబినెట్ భేటీలో ఈ అంశంపై చర్చించే అవకాశాలు ఉన్నాయి.

## ఐటీడీఏ కార్మికుల ఆందోళన



**అదిలాబాద్, అక్టోబరు 16 ( వెలుతురు)**
ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటిడిఏ కార్యాలయం ముందు గత కొద్దిరోజులుగా ఆశ్రమ పాఠశాలలో పనిచేసే డైలీ వేజ్ వర్కర్స్ ధర్నా చేస్తున్నారు. వారంతా ఇప్పుడు నిరవధిక సమ్మె చేపట్టారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో పనిచేసే రోజువారీ కార్మికులు, కాంట్రాక్ట్ వర్కర్స్ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. నిరవధిక సమ్మె చేపట్టి ఆందోళన కొనసాగిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐటిడిఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీ వేజ్, కాంట్రాక్ట్ వర్కర్స్ సిబ్బంది తాము గత కొన్నేళ్లుగా పనిచేస్తున్నప్పటికీనీ చాలి చాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమకు ఉద్యోగ భద్రత కూడా లేదంటూ నాలుగు నెలలకోసారి ఇచ్చే వేతనాలు కూడా సరిపోవడం లేదంటూ అవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం 64 జీవోను విడుదల చేసిందని, ఆ జీవోను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. దినసరి ఉద్యోగుల ఐకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు, ఐటీడీఏ డైలీ వైస్ వర్కర్స్ మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు కొడప మధునమ్మ, ఐటిడిఏ డైలీ వైస్ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్, మరియు ఆదిలాబాద్ CITU జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ లు ఏబీపీ దేంతో తమ ఆవేదన వెలిబుచ్చారు. గత 43 రోజులుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సమ్మె కొనసాగుతోందని, ఉట్నూర్ ఐటిడిఏ కార్యాలయం ముందు 3 రోజులుగా 72గంటల నిరవధిక సమ్మె చేయడం జరుగుతుందని, ప్రభుత్వం గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న తమని గుర్తించాలని తమ విద్యార్థులకు సేవలు అందించే విధంగా తమకు ఉద్యోగ భద్రత తో పాటు కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఐటిడిఏ కార్యాలయం ముందు రాత్రి పగలు ఇక్కడే ఉంటూ రాత్రుల్లోనూ ధర్నా నిర్వహించడం జరిగిందని, అయినా ఏమాత్రం తనని ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను పట్టించుకోవాలని.. ఆదుకోకపోతే తాము ఎలా బతకాలని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి తమకి ఉద్యోగ భద్రత కల్పిస్తూ కనీస వేతనం పెంచి తమని ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకొంటున్నారు. లేనిపక్షంలో ఈ ఉద్యమాన్ని తీవ్రతరం చేసి గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం అదే విధంగా మంత్రుల ఇళ్లు, ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు.

## బీసీ రిజర్వేషన్ అమలయ్యే వరకు తమ పోరాటం ఆగదు

**కోరుట్ల,అక్టోబరు 16 ( వెలుతురు)**
బీసీ రిజర్వేషన్ అమలయ్యే వరకు తమ పోరాటం ఆగదని ,42% బిల్లులు పార్లమెంటులో ప్రవేశ పెట్టి ఆమోదించాలని, రిజర్వేషన్లు దక్కకుండా అగ్రకులాలు చేస్తున్న కుట్రలను బీసీ వర్గాలు తిప్పి కొట్టి బీసీ శ్రేణుల ఐక్యత చాటుకుందాం ఈనెల 18న బిసి వర్గాల జేఏసీ పిలుపు మేరకు రాష్ట్ర బంద్ ను విజయవంతం చేయడానికి పట్టణ రవాణా, వ్యాపార, వాణిజ్య వర్గాలు సహకరించాలని ఏఐటియుసి కార్మిక సంఘాల జిల్లా అధ్యక్షులు సుతారి రాములు కొరారు. గురువారం సీ ప్రభాకర్ భవన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లులు పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలని ఈ నెల 18న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బందును విజయవంతం చేయాలని కొరారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ప్రభుత్వం ఏర్పడి తర్వాత సకుటుంబ సర్వే నిర్వహించి ఆ గణాంకాల ఆధారంగా బీసీ రిజర్వేషన్లు ఏర్పాటు చేయవలసిందిగా అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకి పంపడం జరిగిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో నూతన 42 శాతం రిజర్వేషన్లు ఆధారంగా జరుగుతాయనేదే భావన ఉన్న ప్రజలకు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు తెలంగాణ రాష్ట్రంలోని బీసీ వర్గాలను త్రీవ నిరాశకు గురిచేసిందన్నారు.. బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు పెట్టి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చవచ్చునని కానీ బిజెపికి బిల్లు పై ఇష్టం లేక రాష్ట్ర ప్రభుత్వాలపై నింద మోపుతున్నాయని పేర్కొన్నారు. రిజర్వేషన్ పై నిర్ణయం తీసుకోకపోతే బలమైన ఉద్యమం మొదలైందని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని బిజెపికి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించే శక్తి లేకపోతే రాజీనామా చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అన్ని రాజకీయ పార్టీల బీసీ సంఘాల ప్రతినిధులతో ప్రధానమంత్రి దగ్గరికి రాష్ట్ర పతి దగ్గరికి తీసుకెళ్తామని చేసిన వాగ్దానం ఏమైంది అన్నారు. జీవో 9 పై హైకోర్టులో పిటిషన్ వేసిన రెడ్డి జాగృతికి చెందిన బుట్ట మాధవరెడ్డి తో పాటు బీసీ ద్రోహులకు తగిన గుణపాఠం తప్పదన్నారు. బీసీలకు రాజ్యాధికారం లభించే వరకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడి పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి నేతలు గోపాల్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

- జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి
- స్కానింగ్ సెంటర్లు లపై ఆకస్మిక తనిఖీ

**జగిత్యాల, అక్టోబరు 16 ( వెలుతురు)**
గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టం 1994 ప్రకారం లింగ నిర్ధారణ చేసి ఆడ ,మగ అని చెప్పడం చట్టరీత్యా నేరమని మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జగిత్యాల పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను,మాత శిశు సంరక్షణ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ మిషన్స్ మరియు డాక్టర్ల అర్హత ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకున్న విధంగానే ఉన్నాయా అని నిర్ధారించుకున్నారు. ఫారం ఎఫ్ లు ప్రతినెల 5వ తారీఖు లోపు వారికి కేటాయించబడిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లలో సబ్మిట్ చేయవలసిందిగా ఆదేశించారు. ఫారం ఎఫ్ లు ఆన్లైన్లో, ఆఫ్లైన్లో ఒకే విధంగా ఉండాలన్నారు. లింగ నిర్ధారణ చేసేటప్పుడు పేషంట్లకు కనపడే విధంగా ఇక్కడ లింగ నిర్ధారణ చేయబడదు - లింగ నిర్ధారణ చేసినచో కఠిన చర్యలు తీసుకోబడతాయి అను ఫ్లెక్సీ బోర్డులు , ఫోం బోర్డులు ఏర్పాటు చేయవలెనని డాక్టర్ జైపాల్ రెడ్డి తెలిపారు. ఈ నిబంధనలు అతిక్రమించి లింగ నిర్ధారణ చేసినచో జరిమానా విధించబడడమే కాకుండా గర్భిణీ మినహా ప్రోత్సహించిన వారిపై కూడా జరిమానా మరియు మూడు నెలల జైలు శిక్ష కూడా ఉంటుందని, వైద్యుల యొక్క రిజిస్ట్రేషన్ కూడా రద్దుపరిచబడతాయని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై నోటీసులు జారీ చేయబడతాయి. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాజేశం ఏనుగంటి తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్టీ సేవింగ్స్‌పై అవగాహనా ర్యాలీ

**పల్నాడు,అక్టోబర్16( వెలుతురు):**
'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్'లో భాగంగా వాణిజ్య పన్నుల శాఖ, పల్నాడు జిల్లా రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వాహనాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. నరసరావుపేట పట్టణ పురవీధుల్లో భారీ ఎత్తున ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, కార్లు, సరకు రవాణా వాహనాలతో ర్యాలీ చేస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామారావు, నరసరావుపేట మండల నోడల్ అధికారి పున్నరెడ్డి, పల్నాడు జిల్లా రవాణా అధికారి సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

## వ్యూస్, లైక్స్‌తో సోషల్ మీడియాలో ఫేమస్

- వ్యూస్ మాయలో విలువలు మరిచిపోతే ఎలా ?
- చిన్నారుల భవిష్యత్‌ను పణంగా పెట్టడం సమంజసమా
- చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ ఉంటే నేరం
- ఇలాంటి వాటిని తొలగించండి..భవిష్యత్‌లో పెట్టకండి
- లేదంటే చట్టప్రకారం చర్యలు తప్పవని సిపి సజ్జన్నార్ హెచ్చరిక



**హైదరాబాద్,అక్టోబర్16( వెలుతురు):**
వ్యూస్ మాయలో పడి విలువలు మరిచిపోతే ఎలా అని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ యూ ట్యూబర్లను ప్రశ్నించారు. వ్యూస్, లైక్స్‌తో సోషల్ మీడియాలో ఫేమస్ అయ్యేందుకు చిన్నారుల భవిష్యత్‌ను పణంగా పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్లతో కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ఇంటర్వ్యూలను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో సజ్జనార్ పోస్ట్ పెట్టారు. చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ చేస్తూ సభ్య సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని నిలదీశారు. చిన్నారులు, యువతకి స్ఫూర్తినిచ్చే, ఆదర్శంగా నిలిచే వ్యక్తులను ఇంటర్వ్యూలు చేసి సమాజాభివృద్ధికి దోహదం చేయండి. అంతేకానీ.. ఇలాంటి వీడియోలు వారితో చేసి పిల్లలను పెడదోవ పట్టించవద్దు. గుర్తు పెట్టుకోండి.. ఇది బాలల హక్కుల ఉల్లంఘనే కాదు.. చట్టరీత్యా నేరం. ఇటువంటి చర్యలు పోక్సో, జువైనల్ జస్టిస్ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని హెచ్చరించారు. పిల్లలను ఇలాంటి కంటెంట్‌లో భాగం చేయడం వారిని వేధించడం కిందికే వస్తుంది. మైనర్లతో ఈ తరహా కంటెంట్ చేసే వారిపట్ల పోలీస్‌శాఖ కఠినంగా వ్యవహరిస్తుంది. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటుంది. తక్షణమే వీటిని తొలగించుకున్నా.. భవిష్యత్తులో ఇలాంటి కంటెంట్ అప్‌లోడ్ చేసినా చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం అని కూడా హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇలాంటి వీడియోలు మీ దృష్టికి వస్తే వెంటనే రిపోర్టు చేయండి. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. హెల్ప్‌లైన్ నంబర్ 1930కి గానీ.. జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయండని సూచించారు. తల్లిదండ్రులుగా పిల్లలను పెంచడం మాత్రమే కాదు.. వారి బాల్యం, మానసిక ఆరోగ్యం, భవిష్యత్తును కాపాడటం కూడా మీ బాధ్యతే అనే విషయం మరిచిపోవద్దని సజ్జనార్ పేర్కొన్నారు.

## నిమిషప్రియ కేసులో స్టే కొనసాగుతోంది

### మరణశిక్ష అమలుపై సుప్రీంకు కేంద్రం వివరణ




**న్యూఢిల్లీ,అక్టోబర్16( వెలుతురు):**
యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న భారత నర్సు నిమిష ప్రియకు శిక్ష అమలుపై స్టే కొనసాగుతోందని గురువారం సుప్రీంకోర్టుకు కేంద్రప్రభుత్వం వెల్లడించింది. తీవ్రమైన పరిణామాలు ఏమీ జరగలేదని తెలిపింది. ఈ భారతీయ నర్సును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం దౌత్యమార్గాలను ఉపయోగించేలా ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారిస్తోంది. తాజాగా ఆ మరణశిక్ష గురించి ప్రశ్నించింది. ఆమెకు చట్టపరమైన సహకారం అందిస్తోన్న 'సేవ్ నిమిషప్రియ ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' తరఫు న్యాయవాది స్పందిస్తూ.. శిక్ష అమలుపై స్టే కొనసాగుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ వెంకటరమణి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఈ కేసులోకి కొత్త మధ్యవర్తి వచ్చారు. ఇప్పటివరకు మంచి విషయం ఏంటంటే.. తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకోకపోవడమేనని వెల్లడించారు. ఈ వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం కేసును జనవరికి వాయిదా వేసింది. అయితే ఏవైనా అత్యవసర పరిస్థితులు ఉంటే.. ముందస్తు లిస్టింగ్ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. నిమిష ప్రియ నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన తర్వాత 2008లో యెమెన్ వెళ్లి అక్కడే ఉద్యోగంలో చేరారు. ఆ దేశ నిబంధనల ప్రకారం స్థానిక వ్యక్తి తలాల్ అదిబ్ మెహది భాగస్వామ్యంతో అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను ప్రారంభించారు. తర్వాత ఆ వ్యక్తి ప్రియను వేధించి, పాస్‌పోర్ట్, ఇతర పత్రాలను లాక్కొన్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. 2016లో అతడిపై ప్రియ పోలీసులకు కూడా ఫిర్యాదు చేసింది. కానీ, వారు ఆమెను పట్టించుకోలేదు. దీంతో 2017లో మెహదికి మత్తుమందు ఇచ్చి అతడి వద్ద ఉన్న తన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవాలని భావించింది. కానీ, ఆ డోస్ ఎక్కువకావడంతో అతడు చనిపోయాడు. ఆ తర్వాత మృతదేహాన్ని ఓ వాటర్ ట్యాంక్‌లో పారేసింది. చివరికి అక్కడినుంచి సౌదీకి వెళ్లిపోతుండగా.. సరిహద్దుల్లో ఆమెను అరెస్టు చేసి, మరణశిక్ష విధించారు. భారత ప్రభుత్వం, మత పెద్దల ప్రయత్నాలతో ప్రస్తుతానికి ఆ శిక్ష అమలు వాయిదాపడింది.

## ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం

- న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు
- సుప్రీంను కోరిన పైలట్ సుమీత్ సభర్వాల్ తండ్రి

**న్యూఢిల్లీ,అక్టోబర్16 ( వెలుతురు):**
ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర విమాన ప్రమాదం ఘటనలో 260 మంది మృతి చెందారు. ప్రధాన పైలట్ కెప్టెన్ సుమీత్ సభర్వాల్, కో–పైలట్ క్లైవ్ కుందర్ కూడా మరణించిన వారిలో ఉన్నారు. తాజాగా ఈ కేసులో న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు కోరుతూ.. సుమీత్ సభర్వాల్ తండ్రి పుష్కరాజ్ సభర్వాల్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. భారత పైలట్ల సమాఖ్య సైతం ఈమేరకు పిటిషన్ దాఖలు చేసింది. పైలట్‌గా సభర్వాల్‌కు విస్తృత అనుభవం ఉందని, 30 ఏళ్ల కెరీర్‌లో ఒక్క మచ్చ కూడా లేదని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు విశ్రాంత జడ్జి నేతృత్వంలో.. స్వతంత్ర నిపుణుల కమిటీతో న్యాయ పర్యవేక్షణలో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన వెంటనే కూలిపోయింది. ఈ ప్రమాదంపై ఏఏఐబీ జులైలో తన ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. రెండు ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడంవల్లే విమానం కూలిపోయిందని పేర్కొంది. ఇంధన సరఫరాను ఎందుకు ఆపావని ఒక పైలట్ ప్రశ్నించగా.. తాను ఆపలేదని మరో పైలట్ సమాధానమివ్వడం కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో నమోదైందని తెలిపింది. ఇదికాస్త పైలట్ల లోపం ఉందనే ఊహాగానాలకు దారితీసింది. ఈ నివేదికను పైలట్ సంఘాలు తీవ్రంగా విమర్శించాయి. పైలట్లపై నిందలు దురదృష్ట కరమని సుప్రీం కోర్టు సైతం వ్యాఖ్యానించింది. ఇప్పుడు దర్యాప్తుపై పైలట్ తండ్రి సుప్రీం గడప తొక్కారు. ఎయిరిండియా విమాన ప్రమాదంపై ప్రాథమిక దర్యాప్తు లోపభూయిష్టంగా ఉందని పిటిషనర్లు విమర్శించారు. దర్యాప్తు బృందం ప్రధానంగా పైలట్లపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. ఈ విషాదానికి దారితీసిన సాంకేతిక, విధానపరమైన అంశాలను పరిశీలించడంలో విఫలమైందన్నారు. నివేదికలోని ఎంపిక చేసిన భాగాలను బహిర్గతం చేయడం ద్వారా వాస్తవాలను తప్పుదోవ పట్టించడం.. ముఖ్యంగా పైలట్లను లక్ష్యంగా చేసుకోవడం వంటివి అసలైన కారణాలను గుర్తించడాన్ని కష్టతరం చేస్తాయని పిటిషనర్లు పేర్కొన్నారు. 'విమాన ప్రమాదాల దర్యాప్తు బ్యూరో' నియంత్రణలోని దర్యాప్తు బృందం కూర్పునూ ప్రశ్నించారు. ఇందులో డీజీసీఏ, విమానయాన అధికారులే ఉన్నారని చెప్పారు. ఏ వ్యక్తి కూడా తన సొంత కేసులో న్యాయమూర్తిగా ఉండకూడదనే సహజ న్యాయ సూత్రాన్ని ఇది ఉల్లంఘిస్తోందన్నారు.

## అన్నదమ్ముల వివాదం

- తమ్ముడి దాడితో వదిన మృతి

**వరంగల్,అక్టోబర్16( వెలుతురు):**
జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. అన్నపై తమ్ముడు దాడి చేయగా.. అడ్డొచ్చిన వదిన తీవ్రగాయాలతో మృతిచెందారు. నల్లబెల్లి మండలం కొండాపురంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అన్న మేరుగుర్తి రమేశ్‌పై తమ్ముడు సురేశ్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో వదిన స్వరూప (30) అడ్డు వచ్చింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. అంబులెన్స్‌లో నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో స్వరూప మృతిచెందారు. గాయాలతో ఆస్పత్రిలో రమేశ్ చికిత్స పొందుతున్నాడు. అన్నదమ్ముల మధ్య డబ్బు వివాదమే ఈ ఘటనకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు.

## ధాన్యం రైతులను ఇబ్బంది పెట్టవద్దు

- ఐకెపి కేంద్ర సిబ్బందికి కడియం హెచ్చరిక

**జనగామ,అక్టోబర్16( వెలుతురు):**
రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే రైతులను.. కేంద్ర నిర్వాహకులు ఇబ్బంది పెడితే సహించేది లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి హెచ్చరించారు. ధాన్యం కొనుగోలులో వారికి సహాయంగా ఉండి తగిన విధంగా చేయూత ఇవ్వాలన్నారు. నమిలిగొండలో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కడియం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్య ఉన్నా రైతులు తన దృష్టికి తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం– రైతు ప్రభుత్వమని దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుల కోసం సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ ఏడాది నుంచి ధాన్యం డబ్బులతో పాటు బోనస్ కూడా అందించడానికి ప్రభుత్వం అద్భుతమైన నిర్ణయం తీసుకుందని కొనియాడారు. ధాన్యం కొనుగోలు ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రైతులకు మద్దతు ధరలు ఇవ్వడం, పూర్తి ధాన్యం కొనడం ప్రభుత్వ బాధ్యతని అన్నారు.

## జూబ్లీహిల్స్‌లో బోగస్ ఓట్లపై విచారణ

- ఇప్పుడు ఇసికి ఆదేశాలు ఇవ్వలేమన్న హైకోర్టు

**హైదరాబాద్,అక్టోబరు16( వెలుతురు):**
జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోగస్ ఓట్లపై మాజీ మంత్రి కేటీఆర్, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. పిటిషన్లపై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికే ఎలక్టోరల్స్‌ను ఈసీ రివిజన్ చేస్తోందని.. ఈ సమయంలో ఎలాంటి డైరెక్షన్ అవసరం లేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చిచెప్పింది హైకోర్టు. ఓటు చోరీపై హైకోర్టులో బీఆర్ఎస్ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా.. గురువారం విచారణ జరిగింది. బీఆర్ఎస్ తరపు న్యాయవాది మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌తో సంబంధంలేని వారు ఓటరు జాబితాలో చేరారని తెలిపారు. బోగస్ ఓట్లపై ఎన్నికల సంఘానికి ఆధారాలు సమర్పించామని వాదనలు వినిపించారు. ఈసీ తరపు లాయర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రిప్రజెంటేషన్‌లపై ఎన్నికల అధికారిని ఆదేశించామని.. నివేదికను బట్టి చర్యలు తీసుకుంటామని వాదించారు. ఇరువురి వాదనలు విన్న హైకోర్ట్ ధర్మాసనం బోగస్ ఓట్లపై ఈసీకి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేస్తూ విచారణను ముగించింది.

### స్కూలుకు కోటి విరాళం ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే బిగాల

**నిజామాబాద్,అక్టోబర్16( వెలుతురు):**
నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బిగాల గణెలిష్ గుప్తా మాక్లూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ. కోటి విరాళం అందజేశారు. ఈ మేరకు గురువారం ఆయన తన సోదరుడు బిగాల మహేశ్‌తో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి వచ్చి కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డికి కోటి రూపాయల విలువ గల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్ పాల్గొన్నారు.

## పాకిస్తాన్ కు ఓ వైపు.. అమెరికా.. మరో వైపు చైనా



**హైదరాబాద్, అక్టోబరు 16, ( వెలుతురు)**
యుద్ధం జరిగిన ప్రతీసారి భారత్ చేతిలో చావుదెబ్బతింటోంది మన దాయాది దేశం. యుద్ధంలోనే కాదు క్రికెట్‌లోనూ అదే పరిస్థితి. వాపును చూపుకుని బలుపుగా భావిస్తూ భారత్‌తో కయ్యానికి కాలుదువ్వుతుంది.. దెబ్బ కొట్టగానే కాళ్ల బేరానికి వస్తోంది. ఇటీవల ఆపరేషన్ సిందూర్ దెబ్బకు ఎయిర్ బేస్‌లకు ప్యాచ్ వర్క్ చేసుకుంటున్న పాకిస్తాన్‌కు ట్రంప్ అండగా నిలిచారు. మొన్నటి వరకు చైనా అండ చూసుకుని ఎగిరెగిరి పడిన పాకిస్తాన్.. ఇప్పుడు అమెరికా అండతో భారత్‌పై రివేంజ్ తీసుకోవాలని భావిస్తోంది.పాకిస్తాన్ ఇప్పటివరకు చైనా మద్దతుతో నిలబడింది. అయితే 2025లో, పాక్ కొత్త వ్యూహంగా అమెరికా చేతితో డీల్ చేసేందుకు యత్నిస్తున్నట్టు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీన్ని సుదీర్ఘ కాలంగా మాదిరిగా భావించి, అమెరికా కూడా పాకిస్థాన్ వ్యూహాల్లో మరింత పలకరించటం కనిపిస్తోంది. అయితే, అమెరికా అధ్యక్షుడైన ట్రంప్ మామూలోడు కాదని, అవసరమైతే కఠిన నిర్ణయాలు తీసుకునే వ్యక్తి కాబట్టి, పాక్ మరోసారి తప్పుకోకపోతుందని భావిస్తున్నారు.పాక్ చైనాతో కూడిన ఒప్పందాలు, ఆర్థిక సహకారాలు పెద్ద మొత్తంలో ఉన్నా, పాకిస్తాన్ అంతర్గతంగా సవాళ్లు ఎదుర్కొంటుంది. పెరిగిన అప్పులు, రాజకీయ అస్థిరతలు తలనొప్పులుగా మారాయి. అందువల్ల, పాక్ అల్టర్నేటివ్ మద్దతుల కోసం అమెరికాను కోరుతోంది. అయితే, అమెరికా – పాక్ డీల్ లో అమెరికా దృష్టి మరింత కఠినపడి, పాక్ ప్రవర్తనపై కట్టుదిట్టం పెరిగే అవకాశాలు ఉన్నాయి, అంటే పాక్ ఈసారి మరల పొరపాటు చేయటం దీర్ఘకాలంలో దుష్పరిణామాలు కలుగజేయవచ్చు.పాకిస్తాన్ వ్యూహాలు భారత భద్రతా విశ్లేషకులకు పెద్ద సవాలు. ప్రస్తుతం, పాక్ – చైనా సంబంధాల మధ్య తాత్కాలిక మార్పులు వస్తున్నప్పటికీ, ఇండియా కీలక కారణంగా మిగిలి ఉంటుందని అంచనా. భారతం తన భద్రతా పథకాలను మరింత గట్టి చేస్తూ, అంతర్జాతీయ మైదానంలో కొత్త చట్టాలు, దృఢత చూపించాల్సి ఉంటుంది. ట్రంప్ మాదిరి కట్టుదిట్ట నేత నేతృత్వం కారణంగా, అమెరికా – భారత్ – ఇతర మైత్రి సంబంధాలు పాకిస్తాన్ వ్యూహాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కీలకం అవుతాయి.పాక్ – భారత్ మధ్య భవిష్యత్ గణనీయమైన మార్పులు చూస్తామని సూచిస్తున్నారు. పాక్ ఇప్పుడు అమెరికా చేతితో ప్రయోగాలు చేస్తుండగా, భారత్ దీన్ని గమనించి సహజ ప్రతిస్పందన చర్యలను పలు మెలకువలతో చేర్పించాల్సి వస్తుంది.

## 18న గ్రూప్ 2 నియామక పత్రాలు




**హైదరాబాద్, అక్టోబరు 16, ( వెలుతురు)**
తెలంగాణ గ్రూప్ 2 సర్వీసు పోస్టులకు సంబంధించిన తుది ఫలితాలు సెప్టెంబర్ 28న విడుదలైన సంగతి తెలిసిందే. మొత్తం 783 పోస్టులకు గానూ 782 పోస్టులకు ఎంపిక జాబితాను టీజీపీఎస్సీ విడుదల చేసింది. మిగిలిప ఒక పోస్టు మాత్రం భర్తీ కాలేదని, విత్ హెల్డ్‌లో పెట్టినట్లు వెల్లడించింది. మొత్తం 16 శాఖల్లో 18 రకాల పోస్టులకు సంబంధించి టీజీపీఎస్సీ గ్రూప్ 2 తుది ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఇక గ్రూప్ 2 పోస్టులకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందించేందుకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేస్తుంది.. తాజా ప్రకటన మేరకు గ్రూపు 2 ద్వారా ఎంపికైన 783 మంది అభ్యర్థులకు అక్టోబరు 18వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదగా నియామక పత్రాలు అందించనున్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఆ రోజు సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం సచివాలయంలో సమీక్ష జరిపారు. ఈ నియామకాల్లో సాధారణ పరిపాలన, రెవెన్యూ, ఎక్సైజ్, పంచాయతీరాజ్, వాణిజ్య పన్నుల శాఖలకు చెందిన వారే అధికంగా ఉన్నారు. అందువల్ల ఆయా శాఖల కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులతోపాటు వారి కుటుంబసభ్యులు కూడా ఈ కార్యక్రమానికి అనుమతించనున్నట్లు ఆయన తెలిపారు.కాగా టీజీపీఎస్సీ గ్రూప్ 2 నోటిఫికేషన్‌ను 2022లో విడుదల చేయగా, 2024 డిసెంబర్ 15, 16 తేదీల్లో రాతపరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 2,49,964 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్ష ఆఫ్‌లైన్ విధానంలో జరగడంతో ఓఎంఆర్ పత్రాల్లో లోపాలు, బబ్లింగ్ సరిగా చేయకపోవడం వంటి కారణాలతో దాదాపు 13,315 మందిని కమిషన్ అనర్హులుగా ప్రకటించింది. మిగిలిన 2,36,649 మంది అభ్యర్థుల జనరల్ ర్యాంక్ లిస్ట్ (మార్కులతో సహా)ను మార్చి 11న విడుదల చేసింది. గత నెలలో తుది జాబితాను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ లిస్టులోని వారందరికీ మరో 3 రోజుల్లో నియామక పత్రాలు అందించనున్నారు.

## సచివాలయంలో నీటి కొరత

**హైదరాబాద్, అక్టోబరు 16, ( వెలుతురు)**



తెలంగాణ సచివాలయంలోనే మంచి నీటి కొరత ఏర్పడింది. తాగునీటి సరఫరా చేయాల్సిన కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. దీంతో ఎండాకాలం రాకముందే కొన్ని డిపార్ట్ మెంట్స్ లో తాగునీటి సమస్య ఏర్పడింది. ఆయా విభాగాల్లో ఉద్యోగులు సొంతంగా వాటర్ బాటిల్స్ క్యారీ చేస్తున్నారు. భోజన సమయం, టీ టైమ్ లో కూడా మంచి నీళ్లు లేకపోవడంతో కొంతమంది ఉద్యోగులు క్యాంటీన్ లో వాటర్ బాటిల్స్ కొంటున్నారు.సచివాలయంలో వాటర్ సరఫరా చేసే కాంట్రాక్టర్లకు తాగునీటి బిల్లులను సైతం చెల్లించలేని స్థితికి ప్రభుత్వం దిగజారింది అనే విమర్శలు వస్తున్నాయి. నెల నెల బిల్లులు చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టర్ మూడు రోజులుగా నీటి సరఫరాను నిలిపివేశారు. వివిధ శాఖలకు సంబంధించి దాదాపు 20 లక్షల వరకు బిల్లులు పెండింగ్ లో ఉన్నట్లు తెలుస్తోంది. బిల్లుల కోసం కాంట్రాక్టర్ ఎన్నిసార్లు సంబంధిత శాఖ అధికారులను సంప్రదించినా ప్రయోజనం లేకపోవడంతో చివరికి నీటి సరఫరా నిలిపివేశారు.తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నస సిబ్బంది చివరకు ఇంటి నుంచి బాటిల్ తెచ్చుకుంటున్నారు. ఆయా శాఖల నుంచి డబ్బులు రావడం లేదని, వ్యక్తిగతంగా కొనుగోలు చేసుకోవాలని చెప్పినట్లు తెలుస్తోంది. ప్రతి నెల 300 ఇస్తే తాగునీరు సరఫరా చేస్తామని చెప్పడంతో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలో తాగునీటి కష్టాలు ఎండా కాలం కాకముందే ఇలా ఉండటంతో వేసవి కాలంలో ఎలాంటి పరిస్థితి ఉంటుందోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

# అధిష్టానాన్ని లైట్ తీసుకుంటున్న నేతలు


**హైదరాబాద్, అక్టోబరు 16, ( వెలుతురు)**
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి పదేళ్ల తర్వాత వచ్చింది. అయితే అధికారాన్ని నిలబెట్టుకోవాల్సిన నేతలు వీధిన పడుతున్నారు. చిల్లర గొడవలకు దిగుతున్నారు. అయితే పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ ను అధినాయకత్వం నియమించినప్పటికీ నేతల్లో మాత్రం మార్పు కనిపించడం లేదని పిస్తుంది. గతంలో ఉన్న ఇన్ ఛార్జిగా ఉన్న దీపాదాస్ మున్షీని తొలగించిన పార్టీ నాయకత్వం గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉండే మీనాక్షి నటరాజన్ ను ఇన్ ఛార్జిగా నియమించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన మంత్రులే గొడవ పడుతుండటం కాంగ్రెస్ పార్టీ క్యాడర్ ను అయోమయానికి గురి చేసింది .. దీంతో మీనాక్షి నటరాజన్ కు కూడా నేతలు వెరవకుండా తమకు తోచినట్లే వ్యవహరిస్తున్నారంటున్నారు. నేతల్లో సఖ్యత కొరవడింది. ప్రభుత్వంలో మంత్రుల మధ్య కూడా సమన్వయం కనిపించడం లేదు. చిన్న చిన్న వాటికి వారు గొడవలకు దిగుతున్నారు. మీడియాకు ఎక్కుతున్నారు. మంత్రుల తీరుపై పార్టీ నాయకత్వం ఆగ్రహంగా ఉందని అంటున్నా మీనాక్షి నటరాజన్ మాత్రం ఎలాంటి నష్టనివారణ చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినపిస్తున్నాయి. ఒకవైపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో పాటు త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరిగే అవకాశముండటంతో వరసగా మంత్రులు గొడవలకు దిగడం పార్టీ శ్రేణులకు మింగుడు పడటం లేదు... మీనాక్షి నటరాజన్ రాహుల్ కోటరీలో కీలకమైన నేత కావడంతో ఆమె పార్టీని సెట్ చేశారని అనుకున్నారు. ఆమె సాదాసీదాగానే ఉంటున్నారు. జీవనశైలి ఇక్కడ ముఖ్యం కాదు. పార్టీని గాడిలో పెట్టడం ముఖ్యమన్నది మీనాక్షి



నటరాజన్ మర్చిపోతు న్నారన్నకామెంట్స్ వినపడుతున్నాయి. మీనాక్షి నటరాజన్ మధ్యప్రదేశ్ లో బయోకెమిస్ట్రీలో పీజీ చేశారు. ఇండోర్ లో చదువుకుంటూనే రాజకీయాల పట్ల ఆకర్షితులయ్యారు. కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాహుల్ గాంధీ సింప్లిసిటీని చూసి ఆమె కూడా అదే పార్టీని ఎంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ విద్యార్థి అనుబంధ విభాగమైన ఎన్.ఎస్.యూ.ఐ లో పనిచేశారు. తర్వాత 2008లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.2009 ఎన్నికల్లో మందసౌర్ నుంచి పోటీ చేసి మీనాక్షి నటరాజన్ విజయం సాధించారు. గతంలో 2024, 2019 ఎన్నికల్లో ఓటమి పాలయి 2024 లో విజయం సాధించి ఎంపీగా ఎన్నికయ్యారు. రాహుల్ టీం లో ఒక సభ్యురాలిగా చేరారు. రాహుల్ గాంధీకి నమ్మకమైన నేతగా పేరుపొందారు. అయినా సరే నేతలు మాత్రం ఎటువంటి జంకు లేకుండా పార్టీ పరువును వీధికెక్కిస్తున్నారు. మంత్రులే కాదు ఎమ్మెల్యేలు కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేసి పార్టీని ఇరకాటంలోకి నెడుతున్నారు. మీనాక్షి నటరాజన్ నేరుగా ఇక్కడి విషయాలను రాహుల్ గాంధీకి చేరవేసే చొరవ ఉన్నప్పటికీ ఆమె ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రోజుకో రగడ పార్టీని ప్రజల్లో నవ్వుల పాలు చేస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేళ్ల పాటు అధికారంలో కాంగ్రెస్ ఉంటుందని చెబుతున్నప్పటికీ పార్టీ నేతలు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. కోమటిరెడ్డి సైతం కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ఎక్సైజ్ పాలసీని సమీక్షించాలని కోమటిరెడ్డి కోరారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుకునేలా లిక్కర్ సిండికేట్లు వ్యవహరిస్తున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం వేళ మద్యం దుకాణాలు తెరిచి ఉండటంతో పగలు, రాత్రనక మద్యం తాగుతూ ఆర్థికంగా కుటుంబాలు నలిగిపోతున్నాయని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. అందుకే సాయంత్రం వేళల్లో మాత్రమే మద్యం షాపులు తెరిచేలా ప్రభుత్వం ఎక్సైజ్ పాలసీని మార్చాలన్నారు. మునుగోడు నియోజకవర్గంలో మాత్రం తాను ఊరిలో వైన్ షాపునకు అనుమతిచ్చే ప్రసక్తి లేదని తెలిపారు. ఊరి బయట వైన్ షాపులు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై తాను ప్రభుత్వంతో మాట్లాడతానన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మద్యం విషయంలో తాను రాజీపడబోనని చెప్పారు.

## ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ ఎగ్జామ్స్

**హైదరాబాద్, అక్టోబరు 16, ( వెలుతురు)**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈసారి కాస్త ముందుగానే ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే ఏపీలో ఇంటర్ పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభంకానున్నట్లు ప్రకటన వెలువడింది. ఇందుక సంబంధించిన టైం టేబుల్ కూడా అక్కడి ఇంటర్ బోర్డు తాజాగా విడుదల చేసింది. ఇక ఇదే పంథాలో తెలంగాణ ఇంటరో బోర్డు కూడా అడుగులు వేస్తుంది. తెలంగాణలో కూడా ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు నుంచే ప్రారంభించనున్నట్లు తాజాగా ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం నివేదికను పంపింది.ప్రభుత్వం ఆమోదం తెలియజేస్తే 2026 ఫిబ్రవరి 23 లేదా 25 నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మొదలవనున్నాయి. ఈ మేరకు రెండు రకాల టైం టేబుళ్లను సర్కారుకు పంపారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా సీఎం రేవంత్‌రెడ్డి కొనసాగుతున్నందున ఆయన ఆమోదం తర్వాతనే ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. మరోవైపు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంటర్ పబ్లిక్




పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమై.. మార్చి 24వ తేదీతో ముగియనున్నాయి. సరిగ్గా ఇదే తేదీల్లో తెలంగాణలోనూ ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. లేదంటే ఒక రోజు అటుఇటుగా మొదలవుతాయి. అయితే ఏపీ కంటే ముందుగానే ఇంటర్ పబ్లిక్ పరీక్షలు తెలంగాణలో పూర్తయ్యే అవకాశం ఉంది.గతంలో అంటే కరోనాకు ముందు ఫిబ్రవరి నెలాఖరులోనే పరీక్షలు మొదలయ్యేవి. కరోనా మహమ్మారి ప్రభావంతో ఇది కాస్తా మార్చికి మారింది. అప్పటి నుంచి మార్చిలోనే ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. అయితే ఫిబ్రవరిలోనే ఇంటర్ పరీక్షలు జరిగితే జేఈఈ మెయిన్, ఈఏపీసెట్, నీట్‌కు సన్నద్ధమయ్యే వారికి కాస్త వెసులుబాటు లభిస్తుంది. గత ఏడాది మార్చి 5న ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయి. మరోవైపు జేఈఈ మెయిన్ రెండో సెషన్ పరీక్షలు ఏప్రిల్ 2 నుంచి ప్రారంభమయ్యాయి. దాంతో ఇంటర్ పరీక్షలు రాసిన వారికి కేవలం 12 రోజులు మాత్రమే సన్నద్ధతకు లభించాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పబ్లిక్ పరీక్షలకు దాదాపు 9 లక్షల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనే పరీక్షలు మొదలైతే విద్యార్థులకు ఇతర నీట్, జేఈఈ వంటి పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు సమయం లభిస్తుంది.ఇదిలా ఉంటే మరోవైపు ఇంటర్ పరీక్షల ఫీజు పెంచాలని ఇంటర్ బోర్డు భావిస్తుంది. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపింది. ప్రాక్టికల్స్ లేని కోర్సులకు రూ.520, ప్రాక్టికల్స్ ఉండే పరీక్షలకు ఎంపీసీ, బైపీసీ, జువాలజీ గ్రూపులతోపాటు ఒకేషనల్ కోర్సులకు మొత్తం రూ.750 వరకు పరీక్ష ఫీజు కింద చెల్లిస్తున్నారు. ఇంటర్ బోర్డు ప్రతిపాదనలను రేవంత్ సర్కార్ ఆమోదిస్తే ప్రాక్టికల్స్ లేని కోర్సులకు రూ.600, ప్రాక్టికల్స్ ఉన్న పరీక్షలకు రూ.875 వరకు ఫీజు పెరిగే అవకాశం ఉంది.

## అటు అక్క, ఇటు తమ్ముడు.. ఓటర్లు ఆ గట్టునుంటారా? ఈ గట్టునుంటారా?

**హైదరాబాద్, అక్టోబరు 16, ( వెలుతురు)**
అప్పుడు జూబ్లీహిల్స్ బస్తీలు ఖైరతాబాద్ సెగ్మెంట్లోనే ఉండేవి. ఆ ఏరియాల్లో పీజేఆర్‌కు మంచి పట్టు ఉండేది. ఇప్పటికీ జూబ్లీహిల్స్‌లో పీజేఆర్‌కు పెద్ద ఎత్తున అభిమానులు ఉన్నారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి మాగంటి సునీత పోటీ చేస్తుండగా.. వారిద్దరికి మద్దతుగా ఆ అక్కా తమ్ముడు అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నారు. వాళ్లే ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు, దివంగత నేత పీ జనార్ధన్‌రెడ్డి కూతురు విజయారెడ్డి, తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి.ప్రస్తుతం విజయారెడ్డి అధికార కాంగ్రెస్ పార్టీలో ఉండగా.. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలో విష్ణువర్ధన్ రెడ్డి కొనసాగుతున్నారు. దీంతో ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అక్క కాంగ్రెస్ గెలుపు కోసం శ్రమిస్తుండగా.. తమ్ముడేమో కాంగ్రెస్జెండాను ఎగరనీయనంటూ ప్రతిన పూనుతున్నారు. ఇలా వీళ్లిద్దరూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తమ పార్టీ గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. అటు విజయారెడ్డి, ఇటు విష్ణువర్ధన్రెడ్డి ఇద్దరు పీజేఆర్ వారసులు. గతంలో ఇద్దరు కాంగ్రెస్‌లో పనిచేశారు. జూబ్లీహిల్స్ నుంచి విష్ణువర్ధన్‌రెడ్డి, ఖైరతాబాద్‌లో విజయారెడ్డి పాలిటిక్స్ చేసుకుంటూ వచ్చారు. ఆ తర్వాత విజయారెడ్డి బీఆర్ఎస్‌లో చేరి కార్పొరేటర్‌గా కూడా ఎన్నికయ్యారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల ముందు విజయారెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లగా..విష్ణువర్ధన్‌రెడ్డి కారెక్కేశారు. అయితే పీజేఆర్ గతంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా పనిచేశారు.అప్పుడు జూబ్లీహిల్స్ బస్తీలు ఖైరతాబాద్ సెగ్మెంట్లోనే ఉండేవి. ఆ ఏరియాల్లో పీజేఆర్‌కు మంచి పట్టు ఉండేది. ఇప్పటికీ జూబ్లీహిల్స్‌లో పీజేఆర్‌కు పెద్ద ఎత్తున అభిమానులు ఉన్నారు. ఈ ఈక్వేషన్‌లో అటు కాంగ్రెస్ విజయారెడ్డి ద్వారా..ఇటు బీఆర్ఎస్ విష్ణువర్ధన్‌రెడ్డితో పీజేఆర్ అభిమానులను, బస్తీ



వాసులకు ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి.ఇదే సమయంలో పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలుపు బాధ్యతను భుజాన వేసుకున్నారు. మాగంటి గోపీనాథ్ మరణంతో వచ్చిన ఈ ఉప ఎన్నికను పర్సనల్‌గా తీసుకున్న విష్ణువర్ధన్రెడ్డి..పార్టీ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించుకునేందుకు శాయశక్తులా పనిచేస్తున్నారు. ఆమె వెంటే ఉంటూ సొంత సోదరిలా ఆమె గెలుపే తన గెలుపుగా భావిస్తూ జూబ్లీహిల్స్ గల్లీ గల్లీ తిరుగుతున్నారు.తాను బతికి ఉన్నంతవరకు ఇక్కడ కాంగ్రెస్ జెండాను ఎగురనివ్వనంటూ భీషణ శపథం కూడా చేశారు విష్ణు. జూబ్లీహిల్స్‌లో కచ్చితంగా గులాబీ జెండా ఎగురుతుందని, ఆ బాధ్యత తానే తీసుకుంటున్నానని విష్ణువర్ధన్ రెడ్డి గంటాపథంగా చెబుతున్నారు. ఇలా జూబ్లీహిల్స్‌లో అటు అక్కా, ఇటు తమ్ముడు.. ఒకరు కాంగ్రెస్ కోసం, మరొకరు బీఆర్ఎస్ కోసం తీవ్రంగా శ్రమించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ఎందుకంటే వీళ్ళిద్దరూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అభ్యర్థులు కాదు.కానీ ఒకరు మాజీ ఎమ్మెల్యే అయితే, మరొకరు జీహెచ్ఎంసీ కార్పొరేటర్. విష్ణువర్ధన్ రెడ్డి జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యేగా రెండు సార్లు మాగంటి గోపీనాథ్‌పై పోటీ చేసి ఓడిపోయారు. కానీ ఇప్పుడు అదే మాగంటి కుటుంబం కోసం ఆయన సతీమణి సునీత తరఫున బీఆర్ఎస్‌ను గెలిపించుకునేందుకు పనిచేస్తుండటం ఇంట్రెస్టింగ్‌గా మారింది. జూబ్లీహిల్స్ నుంచి మళ్ళీ తాను ఎమ్మెల్యే కావాలని బలంగా కోరుకోవాల్సిన విష్ణువర్ధన్ రెడ్డి..ఇప్పుడు మాగంటి సునీత కోసం పనిచేయాల్సి రావడం ఆసక్తికరంగా మారింది.ఇక ప్రస్తుతం కార్పొరేటర్‌గా ఉన్న విజయారెడ్డి కూడా ఎప్పటినుంచో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని అనుకుంటున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గ టికెట్ ఆశిస్తున్న విజయారెడ్డికి అవకాశం మాత్రం రావడం లేదు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం సీరియస్‌గా పనిచేస్తూ..అధిష్టానం దృష్టిలో పడేందుకు..పార్టీ రాష్ట్ర పెద్దలను మన్ననలను పొందేందుకు విజయారెడ్డి ప్రయత్నం చేస్తున్నారట.జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే వచ్చే ఎన్నికల్లోనైనా తనకు ఖైరతాబాద్ టికెట్ దక్కడానికి ప్లస్ పాయింట్‌గా మారుతుందని లెక్కలు వేసుకుంటున్నారట విజయా రెడ్డి. ఫ్యూచర్ పొలిటికల్ ప్లాన్‌లో భాగంగా అక్కా కాంగ్రెస్ గెలుపుకోసం..తమ్ముడు బీఆర్ఎస్ విజయం కోసం శ్రమిస్తుండటం ఇంట్రెస్టింగ్‌గా మారింది.

## గురుకులాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల అక్టోబరు 16, ( వెలుతురు)**
జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో గురుకుల ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినీ విద్యార్థులు గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 17 వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా లక్షెట్టిపేట బాలికల గురుకుల విద్యాలయంలో దరఖాస్తులు సమమర్పించాలని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రంతో పాటు ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు హాల్ టికెట్ ర్యాంకు ధ్రువీకరణ పత్రాల నకలు ప్రతులు జత పరచాలని సూచించారు. లక్షెట్టిపేట చెన్నూరు మందమర్రి బెల్లంపల్లి (బాలికలు) బెల్లంపల్లి కాసిపేట కోటపల్లి మంచిర్యాల జైపూర్ (బాలుర) సాంఘిక సంక్షేమ గురుకులాలలో ఖాళీగా ఉన్న సీట్లను ఈ నెల 18న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేసి, భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. బాలికల



గురుకులాలలోని 6వ తరగతిలో ఎస్ సి 6 ఎస్టి 2 బీసీ 3 జనరల్ 3 మైనారిటీ 2 సీట్లు ఉన్నాయని 7వ తరగతిలో బీ సి 5 సీట్లు 8 వ తరగతిలో ఎస్ సి 4 ఎస్టి 1బీసీ 10 జనరల్ 6 మైనారిటీ 5 9వ తరగతి లో ఎస్ సి 3b ఎస్టి 4 బీసీ 4 జనరల్ 5 మైనారిటీ 3 సీట్లు ఉన్నాయని తెలిపారు. బాలుర గురుకులాలలో 5వ తరగతిలో ఎస్టి 3 జనరల్ 3 మైనారిటీ 2 సీట్లు 6వ తరగతిలో ఎస్ సి 9 ఎస్టి 5 జనరల్ 1 మైనారిటీ 6 సీట్లు 7వ తరగతిలో ఎస్ సి 5 సీట్లు 8వ తరగతిలో ఎస్ సి 8 బీసీ 8 జనరల్ 6 మైనారిటీ 8, 9వ తరగతి లో ఎస్ సి 11 బీసీ 4 ఓసీ 7 మైనారిటీ 5 సీట్లు ఉన్నాయని తెలిపారు.

https://epaper.velthuru.com


# వెలుతురు

cinema

## వెట్రిమారన్ తెలుగు సామ్రాజ్యం

### ఎన్టీఆర్ వాయిస్‌తో ప్రోమో విడుదల

తమిళ దర్శకులలో వెట్రిమారన్ ది ఓ ప్రత్యేక శైలి. బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలిచి, వారి సమస్యలను తెరకెక్కించడంలో వెట్రిమారన్ దిట్ట. అంతేకాదు... వేరే దర్శకులతోనూ ఇలాంటి కథలనే సినిమాలుగా నిర్మించిన వ్యక్తి వెట్రిమారన్. తెలుగులోని స్టార్ దర్శకులతో సినిమాలు చేయాలని ఆయన కొంతకాలంగా అనుకుంటున్నారు. కానీ ఏ ప్రాజెక్ట్ కూడా సెట్ కావడం లేదు. ఎన్టీఆర్ తోనూ వెట్రిమారన్ సినిమా చేస్తే బాగుంటుందని భావిస్తున్న అభిమానులు చాలా మందే ఉన్నారు. ఆ మధ్య సూర్య హీరోగా వెట్రిమారన్ ఓ సినిమా చేస్తాడని వార్తలు వచ్చాయి. కానీ ఆ మూవీ అనివార్య కారణాలతో ఆగిపోవడంతో ఇప్పుడు శింబుతో 'అరసన్' మూవీని చేస్తున్నాడు వెట్రిమారన్. ఈ సినిమా తెలుగు వర్షన్ కు ఎన్టీఆర్ సైతం తన గొంతుతో చేయూతనివ్వబోతున్నాడు. శిలంబరసన్, వెట్రిమారన్ కాంబోలో తెరకెక్కుతున్న 'అరసన్'ను తెలుగులో 'సామ్రాజ్యం' పేరుతో డబ్ చేస్తున్నారు. దీని ప్రోమో శుక్రవారం ఉదయం ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ తో రాబోతోంది. ఈ మధ్య ఎన్టీఆర్ 'కింగ్ డమ్' మూవీకి వాయిస్ ఓవర్ అందించాడు. ఆ సినిమాను హిందీలో 'సామ్రాజ్య' పేరుతో డబ్ చేశారు. ఇప్పుడు 'అరసన్' మూవీని తెలుగులో 'సామ్రాజ్యం'గా డబ్ చేయడం, దాని ప్రోమోకు ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇవ్వడం విశేషం. మొత్తానికి 'సామ్రాజ్యం' అనే టైటిల్ కు ఎన్టీఆర్ కు ఏదో అవినాభావ సంబంధం ఉన్నట్టుగా అనిపిస్తోంది. ఈ సినిమాను సీనియర్ నిర్మాత థాను ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ కు, హీరో శింబుకు మధ్య కూడా మంచి అనుబంధం ఉంది. బేసికల్ గా మంచి సింగర్ అయిన శింబు తెలుగు సినిమాల్లో కొన్ని పాటలు పాడాడు. అందులో ఎన్టీఆర్ 'బాద్ షా' మూవీ కూడా ఒకటి. ఇటు దర్శకుడు, అటు కథానాయకుడు ఇద్దరితో ఉన్న అనుబంధం కారణంగా 'సామ్రాజ్యం' ప్రోమోకు ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇచ్చాడని అంటున్నారు.




## పెద్ది నుంచి త్వరలో లవ్ సాంగ్

### దర్శకుడు బుచ్చిబాబు సానా

రామ్‌చరణ్ హీరోగా జాన్వీ కపూర్ కథానాయికగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది' . ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సిక్సర్ కొట్టి అభిమానుల్లో విపరీతమైన క్రేజ్ పెంచేసింది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఆ క్రేజ్ మరింత రెట్టింపు అయింది. దసరాకు వస్తుందనుకున్న ఫస్ట్ సింగిల్ రాకపోవడంతో ఫ్యాన్స్ కాస్త నిరాశ చెందారు. అయితే దర్శకుడు బుచ్చిబాబు దీపావళికి దద్దరిలే అప్‌డేట్ ఇచ్చారు. తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో తాజా అప్‌డేట్ ఇచ్చారు దర్శకుడు సానా బుచ్చిబాబు. ఆ కార్యక్రమంలో 'పెద్ది' విశేషాలేంటని యాంకర్ ప్రశ్నించగా త్వరలో మంచి లవ్ సాంగ్ ప్రేక్షకుల ముందుకురాబోతుందని. ఆ పాటకు సంగీత దర్శకుడు ఏ.ఆర్ రెహమాన్ అదిరిపోయేలా మ్యూజిక్ ఇచ్చారని ఆయన చెప్పారు. ఆ అప్‌డేట్ ఫ్యాన్స్‌లో ఉత్సాహం నింపింది. అయితే ఈ పాట దీపావళికే వస్తుందని ఆడియన్స్ ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. దర్శకుడు దానిపై క్లారిటీ ఇవ్వలేదు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. 'ఉప్పెన' బ్లాక్‌బస్టర్ తర్వాత బుచ్చిబాబు నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి.




## కాంతారా చాప్టర్1 కు దీపావళి వెలుగులు

హిట్ మూవీ 'కాంతార'కు ప్రీక్వెల్‌గా తెరకెక్కి ఆ చిత్రానికి మించిన విజయం అందుకుంది 'కాంతార చాప్టర్ అక్టోబరు 2న బాక్సాఫీసు ముందుకొచ్చిన ఈ సినిమా 12 రోజుల్లో రూ. 675 కోట్లకుపైగా కలెక్షన్లు రాబట్టింది. దీపావళిని పురస్కరించుకుని కొత్త ట్రైలర్ను చిత్ర బృందం గురువారం విడుదల చేసింది. సినిమాలోని పలు కీలక సన్నివేశాలతో రూపొందించిన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. స్వీయ దర్శకత్వంలో రిషబ్‌శెట్టి హీరోగా నటించిన సంగతి తెలిసిందే.




## రశ్మిక మైసా సంగీత దర్శకుడుగా జేక్స్ బిజోయ్

నేషనల్ క్రష్ రశ్మిక మందన నటిస్తున్న పవర్ ఫుల్, ఫీమేల్ సెంట్రిక్ యాక్షన్ మూవీ 'మైసా' ఈ సినిమాతో రవీంద్ర పుల్లె డైరెక్టర్ గా అరంగేట్రం చేస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ సంస్థ భారీ బ్జడెట్‌తో పాన్-ఇండియా స్థాయిలో 'మైసా' సినిమాను నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మేకర్స్ ఒక ఇంట్రస్టింగ్ అప్డేట్ ఇచ్చారు. నాని నటించిన 'సరిపోదా శనివారం' చిత్రానికి సంగీతం అందించిన ప్రముఖ సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ ను 'మైసా' చిత్రా నికి మ్యూజిక్ డైరెక్టర్ గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జేక్స్ బిజోయ్ ట్రైబల్ వాయిద్యాలతో రీరికార్డింగ్ చేస్తున్న వీడియోను రిలీజ్ చేశారు. ఈ సౌండింగ్ అదిరిపో యింది. 'మైసా' మ్యూజికల్ గా గ్రాండ్ స్కేల్ లో వుండబోతుందని ఈ వీడియో చూస్తే అర్థమౌతోంది. 'మైసా' గోండు తెగల బ్యాక్ డ్రాప్ లో హై-ఆక్టేన్ ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ గా ఉండబోతోంది. రశ్మిక మందణ్ణ ఇంతకుముందు ఎప్పుడూ చూడని ఇంటెన్స్ అవతార్ లో కనిపించనుంది. ఈ సినిమాకు సూర్య 'రెట్రో' సినిమాకి పని చేసిన శ్రేయాస్ పి కృష్ణ డీవోపీగా పని చేస్తున్నారు. యాక్షన్ ని 'కల్కి 2898 ఏ డీ' ఫేమ్ ఆండి లాంగ్ డిజైన్ చేస్తున్నారు.

## పోస్ట్ ప్రొడక్షన్స్ పనులు పూర్తి చేసుకున్న "ఉలిక్కిపడ్డ ఉప్పాడ చిత్రం"



**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) అక్టోబర్ 16:** శ్రీ మల్లికార్జున మూవీస్ బ్యానర్ లో ఎక్కిమ సాయికుమార్ దర్శకత్వం వహించిన ఉలిక్కిపడ్డా ఉప్పాడ చిత్రం ఇటీవలే పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్నవి. ఈ సందర్భంగా దర్శకుడు అక్కిమ సాయికుమార్ మాట్లాడుతూ. మత్స్యకారుల జీవిత కథనంతో రూపొందిన ఈ చిత్రం ఉలిక్కిపడ్డా ఉప్పాడ చిత్రం త్వరలో సెన్సార్ పూర్తి చేసుకుంటుందని, విడుదల తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ చిత్రంలో ముఖ్య పాత్రలుగా కమెడియన్ గౌతమ్ రాజ్ బీహెచ్ఈఎల్ ప్రసాద్, ఘర్షణ శ్రీనివాస్, స్నేహ, నైనా తదితరులు ముఖ్య పాత్రలు పోషించగా మ్యూజిక్ డైరెక్టర్ హర్ష ప్రవీణ్, డిఓపి భరత్ పట్టి ఉన్నారు.



## సక్సెస్‌కు రవితేజ ఎదురుచూపు

### 31న వస్తున్న మాస్ జాతర

మాస్ మహరాజా రవితేజ కు సాలీడ్ హిట్ పడి చాలా కాలమే అయ్యింది. చిరంజీవితో కలిసి రవితేజ నటించిన 'వాల్తేరు వీరయ్య' తర్వాత మళ్ళీ ఆ స్థాయి సక్సెస్ ను రవితేజ చూడలేదు. అయితే బ్యాక్ టు బ్యాక్ సినిమాలు మాత్రం రవితేజ చేసేస్తున్నాడు. అక్టోబర్ 31న రవితేజ 75వ చిత్రం 'మాస్ జాతర' జనం ముందుకు రాబోతోంది. 'ధమాకా'తర్వాత శ్రీలీల మరోసారి ఈ సినిమాలో రవితేజతో జోడీ కట్టింది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పాటలు బాగానే అలరిస్తున్నాయి. నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాతో రచయిత భాను భోగవరపు దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇది యాక్షన్ ఎంటర్ టైనర్ జానర్ కు చెందిన సినిమా. ప్రస్తుతం రవితేజ నటిస్తున్న 76వ చిత్రానికి కూడా ఒకప్పటి రచయిత కిశోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్నాడు. 'నేను శైలజ, ఉన్నది ఒకటే జిందగీ, రెడ్' వంటి రొమాంటిక్, యాక్షన్ మూవీస్ ను తీసిన అనుభవం కిశోర్ తిరుమలకు ఉంది. పైగా అతనిది మంచి పెన్. రవితేజ సరసన ఈ సినిమా ఆషికా రంగనాథ్, కేతిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ స్పెయిన్ లో జరుగుతోంది. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాకు మొదట్లో 'అనార్కలి' అనే టైటిల్ అనుకున్నారు. కానీ ఇప్పుడీ సినిమాకు 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే పేరు పెట్టబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. రాబోయే సంక్రాంతి బరిలో ఈ సినిమా కూడా నిలుస్తుందని అంటున్నారు. ఇది ఫ్యామిలీ డ్రామా. ఇక రవితేజ చేయబోతున్న 77వ చిత్రాన్ని శివ నిర్వాణ డైరెక్ట్ చేయబోతున్నాడని తెలుస్తోంది. 'నిన్ను కోరి, మజిలి, టక్ జగదీశ్, ఖుషీ' సినిమాలను తెరకెక్కించిన శివ నిర్వాణ ఈసారి థ్రిల్లర్ డ్రామాను తీయబోతున్నాడట. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ దీనిని ప్రొడ్యూస్ చేస్తుందని తెలుస్తోంది. ఇందులో రవితేజ తన వయసుకు తగ్గ పాత్ర చేస్తాడని అంటున్నారు. ఇక రవితేజ చేయబోతున్న 78వ సినిమాను కళ్యాణ్ శంకర్ డైరెక్ట్ చేస్తాడని సమాచారం. 'మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్' చిత్రాలను డైరెక్ట్ చేసిన కళ్యాణ్ శంకర్ నిజానికి 'టిల్లూ క్యూబ్' కు డైరెక్ట్ చేయాల్సి ఉంది. సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తానని చెప్పారు. అయితే ఇప్పుడు కళ్యాణ్ శంకర్... ఆ సినిమాను పక్కన పెట్టి రవితేజతో ఓ సూపర్ హీరో మూవీ చేస్తాడని సమాచారం. సో... 'మాస్ జాతర' తర్వాత నాగవంశీ... రవితేజతో తీయబోయే సినిమా ఇది. ఇలా... వరుసగా నాలుగు డిఫరెంట్ జానర్స్ తో రవితేజ సినిమాలు చేస్తున్నాడు. మరి ఈ చిత్రాలలో ఏవేవి రవితేజను తిరిగి సక్సెస్ ట్రాక్ లోకి తీసుకొస్తాయో చూడాలి.




## వరుస సినిమాలతో అనుపమ దూకుడు

### మరో రెండు సినిమాల విడుదల

మలయాళ ముద్దుగుమ్మ అనుపమా పరమేశ్వర్ ఒక్కసారిగా తన జోరు పెంచింది. గత రెండు మూడేళ్ళుగా సెట్స్ మీద ఉన్న ఆమె సినిమాలన్నీ వరుస పెట్టి విడుదల కావడం మొదలైంది. దాంతో ఈ యేడాది అనుపమా పరమేశ్వరన్ నటించిన సినిమా మొత్తం ఆరు జనం ముందుకు వచ్చినట్టయ్యింది. విశేషం ఏమంటే ఈ ముద్దుగమ్మ నటించిన నాలుగు చిత్రాలు ఇప్పటికే ఈ యేడాది విడుదల కాగా, గురువారం ఓ మలయాళ చిత్రం, శుక్రవారం తమిళ చిత్రం జనం ముందుకు వస్తున్నాయి. ఈ యేడాది ప్రారంభంలోనే ప్రదీప్ రంగనాథన్ సరసన అనుపమా పరమేశ్వరన్ నటించిన 'డ్రాగన్' మూవీ విడుదలైంది. ఇది తెలుగులోనూ వచ్చింది. ఆ తర్వాత అనుపమా పరమేశ్వరన్ నటించిన మలయాళ చిత్రం 'జానకి వి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' సినిమా వచ్చింది. అనుపమా ఎంతో ఇష్టంగా చేసిన సినిమా 'పరదా'. తెలుగులో 'సినిమా బండి, శుభం' చిత్రాలను తెరకెక్కించిన ప్రవీణ్ కాండ్రేగుల ఈ సినిమాను రూపొందించాడు. విడుదలకు ముందు ఎంతో బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా ఆ తర్వాత పెద్దంత ప్రభావాన్ని చూపించలేక పోయింది. ఈ సినిమా ప్రమోషన్స్ లో అనుపమా పరమేశ్వరన్ భావోద్వేగానికి గురి కావడంతో అప్పట్లో సోషల్ మీడియాలో ఆమె గురించి విశేష ప్రచారం జరిగింది. ఇక ఈ యేడాది వచ్చిన అనుపమా పరమేశ్వరన్ నాలుగో చిత్రం 'కిష్కింధపురి' . బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో గతంలో 'రాక్షసుడు' మూవీలో నటించిన అనుపమా పరమేశ్వరన్. మరోసారి వీరిద్దరి కాంబోలో వచ్చిన 'కిష్కింధపురి' థియేట్రికల్ గా ఆశించిన స్థాయిలో కలెక్షన్స్ రాబట్టలేకపోయినా... ఓటీటీలో మంచి స్పందనే దీనికి లభించింది. తాజాగా దీపావళి కానుకగా అనుపమా పరమేశ్వరన్ నటించిన 'ది పెట్ డిటెక్టివ్' అనే మలయాళ చిత్రం గురువారం జనం ముందుకు వచ్చింది. నిజానికి ఇది గత యేడాది విడుదల కావాల్సిన సినిమా. రకరకాల కారణాలతో వాయిదా పడి ఎట్టకేలకు విడుదలైంది. ఇక శుక్రవారం ఆమె నటించిన తమిళ చిత్రం 'బైసన్' విడుదల కాబోతోంది. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సీనియర్ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా నటించాడు. కబడ్డీ నేపథ్యంలో ఈ సినిమా రూపుదిద్దుకుంది. 'బైసన్' తెలుగు వర్షన్ ఓ వారం తర్వాత 24న విడుదల కాబోతోంది. గతంలో మారి సెల్వరాజ్ తెరకెక్కించిన 'పరియేరుమ్ పెరుమాళ్'లో తనకు నటించే అవకాశం వచ్చిందని, కానీ అప్పుడు దాన్ని ఉపయోగించుకోలేక పోయానని, ఇప్పుడు మరోసారి ఆయన మూవీ 'బైసన్'లో ఛాన్స్ దక్కడం ఆనందాన్ని కలిగించిందని అనుపమా చెబుతోంది. మరి ఈ రెండు సినిమాల్లో ఏదైనా ఆమెకు మెమొరబుల్ హిట్ ను అందిస్తుందేమో చూడాలి.



# కర్నూలు జిల్లాలో ప్రధాని మోడీ పర్యటన

**- ముందస్తుగా లెఫ్ట్ నేతలు పలువురి గృహనిర్బంధం**

**- విద్యార్థి సుగాలి ప్రీతి తల్లికి తప్పని నిర్బంధం**



**కర్నూలు, అక్టోబర్16( వెలుతురు):**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జిల్లాలో పర్యస్తున్న నేపథ్యంలో పోలీసులు వామపక్ష నాయకుల పై ప్రజాసంఘాల నాయకులపై నిర్బంధాన్ని ప్రయోగించారు. గురువారం తెల్లవారుజామునే 4:30 గంటలకే వామపక్ష నాయకుల ఇళ్లను పోలీసులు ముట్టడించి గృహనిర్బంధం చేశారు. ఈ మేరకు సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శి డి గౌసుదేశాయిని వన్ టౌన్ లోని ఆయన నివాస గృహ ప్రాంగణంలో నిర్బంధించారు. సిపిఐ జిల్లా నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సిపిఎం ఓల్డ్ టౌన్ నగర కార్యదర్శి ఎం రాజశేఖర్, జిల్లా నాయకులు అలివేలు, సిఐటియు నాయకులు ప్రభాకర్ సాయిబాబా, షరీఫ్, కాజా, సిపిఐ నగర సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సోమన్న, దళిత విద్యార్థి సంఘాల నాయకులు మాల వెంకటేష్, ఓబులేసులను అరెస్టు చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ జిల్లా పర్యటనను నిరసిస్తూ గో బ్యాక్ మోడీ అంటూ సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని సిపిఐ నాయకులు కార్యకర్తలు చేపట్టారు. ఈ మేరకు త్రీటౌన్ పోలీసులు నిరసనకారులను దౌర్జన్యంగా అరెస్టు చేసి మూడో పట్టణం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సిపిఐ కార్యకర్తలు స్టేషన్‌కు చేరుకొని అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని బైఠాయించి నినాదాలు చేశారు. ఇకపోతే విద్యార్థిని సుగాలి ప్రీతి అనుమానాస్పద మతి కేసులో న్యాయం చేయాలంటూ పోరాడుతున్న ఆమె తల్లి సుగాలి పార్వతిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సుగాలి పార్వతి ప్రధానిని కలుసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించాలని భావించారు. అయితే పలు భద్రతా కారణాలు చూపుతూ, ఆమెను ముందస్తుగా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఆమెతో పాటు సుగాలి ప్రీతి కుటుంబ సభ్యులందరినీ పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు.

# రైల్లో ప్రయాణికురాలిపై అత్యాచారం

**- దుండగుడిని అరెస్ట్ చేసిన పోలీసులు**



**గుంటూరు,అక్టోబర్16(వెలుతురు):**
రైల్లో ప్రయాణికురాలిపై అత్యాచారం చేసిన నిందితుడిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. రెండు రోజుల క్రితం గుంటూరు స్టేషన్‌కు చేరుకున్న సంత్రగాచి స్పెషల్ రైలులోని మహిళా బోగీలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీ కెమెరాల సాయంతో నిందితుడిని గుర్తించారు. తెనాలి స్టేషన్‌లో గుంటూరు రైల్వే పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. ఓ మహిళ సోమవారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో సంత్రగాచి స్పెషల్ రైలు మహిళా బోగీలో ఎక్కారు. గుంటూరు వచ్చేసరికి ఆ భోగిలో ప్రయాణికులు ఎవరూ లేరు. ఆమె మాత్రమే మిగిలారు. రన్నింగ్ ట్రైన్‌లో మహిళ భోగికి ప్రవేశించాడు. కొద్దిసేపటికే తలుపు మూసివేసి ఆమెను కత్తితో బెదిరించాడు. ఆమె వద్ద ఉన్న రూ.5,600, సెల్‌ఫోన్, హ్యాండ్‌బ్యాగును లాక్కొని దాడి చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. పెదకూరపాడులో ఫలకనామ ఎక్స్‌ప్రెస్ క్రాసింగ్ కోసం రైలును నిలిపివేశారు. అదే అదునుగా పెదకూరపాడు రైల్వే స్టేషన్ దిగి పారిపోయాడు. మంగళవారం రైలు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకున్న అనంతరం బాధితురాలు సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నడికుడి జీఆర్పీ పోలీసులకు బదిలీ చేశారు దీంతో రంగంలోకి దగిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడుని పట్టుకున్నారు.

# కల్తీ మద్యం కేసులో ప్రభుత్వం సీరియస్

**- జగన్ నేరస్థులను ప్రోత్సహించడంతోనే ఈ కేసు**

**- మండిపడ్డ టిడిపి నేత బుద్ధా వెంకన్న**



**విజయవాడ, అక్టోబర్16( వెలుతురు):**
నకిలీ మద్యంపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ సాగుతోందని టీడీపీ నేత బుద్ధా వెంకన్న అన్నారు. నకిలీ మద్యం కేసులో ఉన్నవారిని ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. జోగి జోగి కలిస్తే బూడిద రాలినట్లు జగన్, జోగి రమేష్ కలిస్తే బూడిద రాలుతుందని తేలి పోయిందని వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్లల్లో జగన్ అవినీతిని, హత్యలు చేసిన వారిని ప్రోత్సహించారని.. అదే చంద్రబాబు అయితే వెంటనే వారిపై చర్యలు తీసుకున్నారని అన్నారు. జోగి రమేష్ కీలక పాత్ర ఉందని జనార్ధన్ స్వయంగా ప్రకటించారని.. తప్పు చేసి దొరికిపోయి కూడా జోగి రమేష్ సిగ్గు లేకుండా వాగుతున్నారని మండిపడ్డారు. కల్తీ మద్యంతో సంబంధం లేని చంద్రబాబు ఎందుకు ప్రమాణం చేయాలని ప్రశ్నించారు. 'జోగి రమేష్, జనార్ధన్ స్నేహితులం అని చెప్పలేదా. మీ ఇద్దరి మధ్య వాట్సప్ చాటింగ్, ఫేస్ టైమ్ కాల్స్ మాట్లాడింది వాస్తవం కాదా, నువ్వు ఏ తప్పు చేయకపోతే సిట్ ముందుకు వెళ్లు. నీ దగ్గర ఉన్న ఆధారాలు ఇచ్చి సచ్చీలత నిరూపించుకో' అంటూ సవాల్ విసిరారు. జగన్ అవినీతి గురించి లోకమంతా తెలుసన్నారు. ఆయన మద్యం కుంభకోణం వల్ల 12 మంది జైలుకు వెళ్లారని.. ఇప్పుడు నకిలీ మద్యం విషయంలో జోగి రమేష్ అడ్డంగా దొరికిపోయారని అన్నారు. ఇంత జరుగుతున్నా జగన్ నిద్ర పోతున్నాడా... జోగి రమేష్‌ను ఎందుకు సస్పెండ్ చేయలేదని నిలదీశారు. కొడాలి నానీ, పేర్ని నాని, దేవినేని అవినాష్, వెల్లంపల్లి, వల్లభనేని వంశీ వీరంతా గత ప్రభుత్వంలో నోటికొచ్చినట్లు వాగారని.. మహిళలని కూడా చూడకుండా దూషించారని బుద్ధా వెంకన్న మండిపడ్డారు.

## పరకామణి పాపం

# ఎవరిది...

**తిరుమల, అక్టోబరు 16 (న్యూస్ పల్స్)**

దేవ దేవుడి సన్నిధి. ఏడు కొండల వాడి ఖజానా. శేషాద్రివాసుడి హుండీ లెక్కించే అవకాశమే అదృష్టం. కానీ అందులో కూడా చేతివాటం ప్రదర్శించి పాపం అంటగట్టుకున్నారు కొందరు. తిరుమల తిరుపతి దేవస్థానం పరికామణి విభాగంలో జరిగిన దొంగతనం కేసు మళ్లీ లైమ్‌లైట్‌లోకి వచ్చింది. అప్పటి ఉద్యోగి రవికుమార్ 920 డాలర్లు కొట్టేశారని టీటీడీ విజిలెన్స్ అధికారులు ఏప్రిల్ 2023లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో లోక్ అదాలత్ ముందు రవికుమార్‌తో రాజీ కుదిరింది.ఈ రాజీ నిర్ణయం చట్టపరంగా ఎంతవరకు కరెక్ట్ అన్న వివాదం మొదలైంది. ఈ చోరీపై పూర్తిస్థాయి దర్యాప్తు జరగలేదని..ఓ జర్నలిస్టు హైకోర్టులో పిటిషన్ వేయడంతో మళ్లీ చర్చ స్టార్ట్ అయింది. పరకామణి చోరీ కేసుకు సంబంధించి..ఖజానా రికార్డులు, రాజీ ఒప్పంద పత్రాలు సీజ్ చేయాలని హైకోర్టు సూచించింది. అయితే పోలీస్ అధికారులు కోర్టు ఆదేశాలను పాటించలేదని లేటెస్ట్‌గా న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏకంగా పోలీస్ స్టేషన్లనే మూసివేయండి అంటూ ఘాటుగా స్పందించింది. దీంతో వెంటనే సీఐడీ అధికారులు రంగంలోకి దిగారు. పరకామణి కేసుకు సంబంధించి టీటీడీ పాలక మండలి తీర్మానాలు.. లోక్ అదాలత్‌లో రాజీ చేసిన ఫైల్స్ అన్ని పరిశీలించారు సీఐడీ అధికారులు. ఆ డాక్యుమెంట్స్ అన్నీ సీజ్ చేశారు. సీసీ పుటేజీను కూడా పరిశీలిస్తున్నామని అధికారులు



చెప్తున్నారు. పరకామణి చోరీ కేసు నమోదైన తిరుమల వన్ టౌన్ పీఎస్‌లో రికార్డుల పరిశీలించారు.లోక్ అదాలత్‌లో రాజీ తర్వాత..పరకామణి లెక్కింపులో చోరీ చేసిన రవికుమార్..టీటీడీకి రూ.14 కోట్ల విలువైన ఆస్తులను విరాళంగా ఇచ్చినట్లు గుర్తించారు. అయితే రాజీ ద్వారా నిందితుడిపై చర్యలు నిలిపివేయడమే పెద్ద వివాదం అవుతోంది. ఈ విషయంపై ఇప్పటికే టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాశ్‌రెడ్డి ఈ మధ్యే ప్రెస్‌మీట్ పెట్టి మరీ అప్పటి టీటీడీ పెద్దలపై అలిగేషన్స్ చేశారు. స్వామివారి సొమ్మును స్వాహా చేస్తే చర్యలు తీసుకోకుండా..ప్రైవేటుగా సెటిల్ చేయడమేంటి..అలా చేయడానికి మీకు ఎవరు అధికారం ఇచ్చారని ప్రశ్నించారు.శ్రీవారి హుండీని దొంగతనం చేసిన రవికుమార్ అనే వ్యక్తిని కోర్టులో నిందితుడిగా ప్రవేశపెట్టకుండానే..లోక్ అదాలత్‌లో రాజీచేయడం, అతడు చోరీ చేస్తుండగా సీసీ పుటేజీకి చిక్కడం వంటి బలమైన ఆధారాలు ఉన్నా చర్యలు తీసుకోకపోవడంపై కూటమి పెద్దలు డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రూ.వంద కోట్ల వరకు శ్రీవారి హుండీ నుంచి దోచేశారని, 40 కోట్ల రూపాయల విలువైన ఆస్తులను బినామీ పేర్లతో రాయించుకున్నారని..భూమన కరుణాకర్‌రెడ్డి టార్గెట్‌గా అలిగేషన్స్ చేస్తున్నారు కూటమి నేతలుఅ మధ్య టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి బయటపెట్టిన వీడియోతో తిరుమల వేదికగా రాజకీయం మరోసారి వేడెక్కింది. అయితే తన మీద వచ్చిన ఆరోపణలపై భూమన కరుణాకర్‌రెడ్డి కూడా సీరియస్‌గానే రియాక్ట్ అయ్యారు. తాను టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు పరకామణిలో దొంగతనం జరిగినట్లు నిరూపిస్తే తల నరుక్కుంటానని సవాల్ చేశారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే రవికుమార్ శ్రీవారి హుండీ లెక్కింపులో దొంగతనం చేశారని భూమన అంటున్నారు.రవికుమార్ కుటుంబ సభ్యులు పాప పరిహారంగా తమ ఆస్తులను టీటీడీకి రాసిచ్చారని చెప్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే పరకామణి చోరీ జరిగిందని..రవికుమార్ అనే వ్యక్తి వెనుక వైసీపీ నేతల హస్తం ఉందని కూటమి ఆరోపిస్తోంది. ఒక ఉద్యోగి టీటీడీకి రూ.14కోట్లు రాసిచ్చారంటే..శ్రీవారి ఖజానా నుంచి ఎంత కొట్టేశారో అర్థం చేసుకోవచ్చంటున్నారు.పైగా రవికుమార్ నుంచి అప్పుడు టీటీడీలో కీలకంగా ఉన్న నేతలు ఆస్తులు రాయించుకున్నారని కూడా ఆరోపిస్తున్నారు. ఇప్పుడు సీఐడీ విచారణతో ఇది ఎవరికి మెడకు చుట్టుకుంటుందోనన్న టెన్షన్ మొదలైంది. ఇప్పటికే రోజుకో ఇష్యూ ఏపీ పాలిటిక్స్‌ను షేక్ చేస్తోంది. ఇప్పుడు పరకామణి ఎపిసోడ్ ఎటు దారితీయబోతోంతో.. ఎవరెవరు బుక్ అవుతారో వేచి చూడాలి మరి.

# ప్రశాంత్ అస్త్ర సన్యాసం

**పాట్నా అక్టోబర్16( వెలుతురు):**

ప్రశాంత్ కిశోర్.. తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితమైన పేరే.. ముద్దుగా పీకేగా పిలుచుకునే ఇతను మాజీ ఎన్నికల స్ట్రాటజిస్టు. 2014లో కేంద్రంలో బీజేపీ గెలవడానికి, తెలంగాణలో బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్ గెలవడానికి పనిచేశారు. 2019లో ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీని గెలిపించారు. అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల తరఫున పనిచేశారు. అయితే ఇప్పుడు బిహార్‌లో సొంత పార్టీ పెట్టారు. జన్‌సురాజ్ పార్టీ పేరుతో మూడేళ్ల క్రితమే పార్టీని ప్రారంభించారు. అయితే ఎన్నికల వ్యూహకర్త అయిన పీకే.. బిహార్‌లో ఇప్పుడు తన పార్టీ గెలుపును మాత్రం అంచనా వేయలేకపోతున్నారు. ఒంటరిగా అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగిన పీకే.. తాను మాత్రం ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించారు.ప్రశాంత్ కిశోర్ రాఘోపూర్, కర్గాహర్ నియోజకవర్గాల్లో ఏదో ఒకస్థానం నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. కానీ ఆయా స్థానాల్లో చంచల్ సింగ్, రితేష్ రంజన్ పాండేను జన్ సురాజ్ పార్టీ అభ్యర్థులుగా ప్రకటించారు. దీంతో ఆయన పోటీ చేయరని స్పష్టమైంది.దగ్గుబాటి, ప్రసారం వంటి ప్రముఖ ప్రభుత్వ విద్యార్థులు, కార్యకర్తల ఆధారంగా తిరువనంతపురంను బలపరిచేందుకు ప్రశాంత్ కిశోర్ ప్రయత్నిస్తుండడం రాజకీయ వ్యూహం యొక్క కీలకమయిన అంశమని అభిప్రాయ వ్యతిరేకులు పేర్కొంటున్నారు. ఎన్డీయే కూటమి ఈ ఎన్నికల్లో ఘోరమైన ఓటమి భవిష్యత్తును ఎదుర్కోవాల్సి ఉందన్న ధీమా ఆయన వ్యక్తం చేశారు. జన్ సురాజ్ పార్టీ ప్రధాన లక్ష్యం ఆరు రాష్ట్రాల్లో 150 స్థానాలకు పైగా సాధించడం.

ఒక సీటు కూడా తగ్గితే విజయం లేనిట్టేనని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమూహాల ప్రతినిధిత్వానికి ప్రాధాన్యత కల్పించారు, అందులో అతి పిన్న వర్గాలు, మైనారిటీలు, యువత ప్రాముఖ్యత పొందాయి. ప్రశాంత్ కిశోర్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తూనే నాయకత్వంలో వ్యూహాత్మక మార్గదర్శకుడిగా వ్యవహరిస్తామని తెలుస్తోంది. ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనకపోయినా, జన్ సురాజ్ పార్టీని బలపరచడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ స్థితిగతులు బిహార్ రాజకీయ వేదికపై జన సురాజ్ పార్టీకి కొత్త మైలురాయిగా నిలుస్తాయి.






Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com